RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam

# ఉదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

సంపుటి : 12 ‖ సంచిక : 193 ‖ ఆదిలాబాద్ ‖ ఆదివారం, డిసెంబర్ 22, 2024 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 3.00 ‖ పేజీలు : 12

## ఫిబ్రవరి 28న సైన్స్ ఉపాధ్యాయుల సెమినార్

చెన్నూరు, డిసెంబర్ 21(ఎ.ఎం.ఎస్): తెలంగాణ రాష్ట్ర విద్య వైజ్ఞానిక శిక్షణ పరిశోధన సంస్థ ఎన్ సీఈఆర్ టీ ఆధ్వర్యంలో మన సైన్స్ అనే అంశంపై సైన్సు ఉపాధ్యాయులకు సెమినార్ నిర్వహించనున్నట్లు డిఇఓ యాదయ్య శనివారం తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సెమినార్ ఉంటుందని పేర్కొన్నారు. సెమినార్ పత్రాలను జనవరి 20 వరకు సమర్పించాలని తెలిపారు.

## ముందుగా పాఠశాలలో ఘనంగా శ్రీ రామానుజన్ జయంతి వేడుకలు

డోర్నకల్, డిసెంబర్ 21(ఎ.ఎం.ఎస్): డోర్నకల్ మండలం ముల్కలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం ముందుగా శ్రీ రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అతని చిత్ర పటానికి పూలను సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గులు, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. దీనితో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొని పండుగలా మారింది. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మధ్యానపు నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు రుక్మాంగధర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సంక్రాంతి నుంచి రైతు భరోసా

- ఆ పథకం అమలుకు సూచనలు, సలహాలనివ్వండి
- శాసనసభలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- మేం రైతు బంధు ఇవ్వబట్టే సాగు విస్తీర్ణం పెరిగింది...కేటీఆర్ వ్యాఖ్య
- ఆ పథకానికి కోతలు పెట్టొద్దంటూ విజ్ఞప్తి
- వందల ఎకరాలు ఉన్నవారికి, లక్షల్లో జీతం తీసుకున్న వారికీ రైతు బంధు ఇచ్చారు.. మంత్రి సీతక్క విమర్శ
- ఎన్ని ఎకరాలకు పరిమితి విధించాలో చెప్పాలంటూ నిలదీత
- రైతు భరోసాపై అసెంబ్లీలో వాడి వేడి చర్చ



హైదరాబాద్ : వచ్చే సంక్రాంతి పండుగ నుంచి రాష్ట్రంలో రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శాసనసభలో ప్రకటించారు. రైతు భరోసా పథకంపై శనివారం సభలో ఆయన చర్చను ప్రారంభించారు. దీనిపై విస్తృత ప్రజాభిప్రాయ సేకరణ కోసం అన్ని జిల్లాల్లో సమావేశాలు నిర్వహించామని గుర్తు చేశారు. పథకం విధి విధానాల రూపకల్పన కోసం ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రి వర్గ ఉపసంఘాన్ని కూడా ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ఈ కమిటీ రైతులు, రైతు నిపుణులు, రైతు సంఘాల ప్రతినిధులు, మేధావులతో చర్చించి పలు సూచనలు, సలహాలనిచ్చిందని వివరించారు. ఈ అంశంపై చర్చలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ నుంచి కే.తారక రామారావు, బీజేపీ నుంచి పాయల్ శంకర్, కాంగ్రెస్ నుంచి విజయ రమణారావు పాల్గొన్నారు. మధ్యలో మాజీ మంత్రి కేటీఆర్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి.. కేటీఆర్‌కు, మంత్రి జూపల్లి కృష్ణరావుకు మధ్య సంవాదం నడిచింది.

రాష్ట్ర శాసనసభ సమావేశాల ఏడో రోజైన శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన సభ ప్రారంభమైంది. ఉదయం 10 గంటలకు సభ ఆరంభం కాగానే సభాపతి అనుమతితో బీఆర్ ఎస్ సభ్యుడు తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ... ప్రతీ రోజూ సభ ఐదు నిమిషాలు, పది నిమిషాలు, పదిహేను నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమవుతోందని చెప్పారు. తమ బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్ణీత సమయానికి సభను ప్రారంభించేవారమని తెలిపారు. సభను నిర్ణీత సమయానికి, అంటే సరిగ్గా పది గంటలకే ప్రారంభించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్పీకర్ స్పందిస్తూ... సభను నిర్ణీత సమయానికే ప్రారంభిస్తున్నామనీ, ప్రత్యేకంగా ఈరోజు జీరో అవర్‌పై సమాలోచనలు చేయాల్సి రావటం వల్ల కొద్దిగా ఆలస్యమైందని వివరణిచ్చారు. అనంతరం కాంగ్రెస్ సభ్యుడు యెన్నం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... సభను ఎప్పుడు చేశామన్నది ముఖ్యం కాదు.. సభలో ప్రజా సమస్యలపై ఏ మేరకు చర్చించామన్నదే ముఖ్యమని వ్యాఖ్యానించారు. కీలకమైన బిల్లులపై చర్చలో బీఆర్ ఎస్ సభ్యలు ఏ ఒక్క రోజూ పాల్గొనలేదని విమర్శించారు. నియమ నిబంధనల గురించి, సభా గౌరవం గురించి మాట్లాడుతున్న ఆ పార్టీ సభ్యులు ప్రధాన ప్రతిపక్ష నేత సభకు రాకపోవటం గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు బంధు స్థానంలో తమ ప్రభుత్వం రైతు భరోసాను తీసుకొస్తోందని చెప్పారు. పంట పండించే రైతుకే రైతు భరోసా కింద ఆర్థిక సాయం చేయాలన్నది తమ ప్రభుత్వ ఆలోచన అని స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా కూడా ఇదే తన అభిప్రాయమని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పంట పండని భూములకు కూడా రైతు బంధు ఇచ్చారనీ, ఇప్పుడు అలాంటి లోపం జరక్కుండు పక్కాగా నియమ నిబంధనలు రూపొందించాలని కోరారు. ఇందుకు సంబంధించి అధికార యంత్రంతో సమగ్ర నివేదికను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాస్తవానికి గత బీఆర్ ఎస్ హయాంలో రైతు బంధు తీసుకున్న వారి లెక్కలను తీసుకుంటే దాదాపు ఆరు లక్షల మంది అకౌంట్లు దొరకటం లేదనీ, క్షేత్రస్థాయిలో అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఇలాంటి విషయాలు బయటపడ్డాయని తెలిపారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్ష సభ్యులు రాష్ట్రంలో అసలు రుణమాఫీయే జరగలేదన్నట్టుగా మాట్లాడటం విడ్డూరంగా ఉ ందన్నారు.

బీఆర్ ఎస్ సభ్యుడు కేటీఆర్ చర్చలో పాల్గొంటూ...తమ ప్రభుత్వ హయాంలో రైతు బంధు ఇచ్చాం కాబట్టే... రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో ఆర్.వో.ఎఫ్.ఆర్. చట్టం కింద నాలుగున్నర లక్షల మంది గిరిజన బిడ్డలకు పోడు పట్టాలిచ్చామని తెలిపారు. ఆయా గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో కనాకష్టం మీద ఒకే ఒక్క పంట పండుతుందని వివరించారు. అలాంటప్పుడు అక్కడి పోడు రైతులకు ఒకే పంటకు రైతు భరోసా ఇస్తారా? రెండో పంటకు కూడా ఇస్తారా? చెప్పాలంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలోని 45 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతోందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ పంట కాల పరిమితి ఎనిమిది నెలలని చెప్పారు. అందువల్ల పత్తి పండించే రైతులకు ఒక విడతే రైతు భరోసా ఇస్తారా? రెండు పంటలకా? అని అడిగారు. కంది రైతుల సమస్య కూడా ఇదే విధంగా ఉందన్నారు. పీఎమ్ కిసాన్ సమ్మాన్ నిధి విధి విధానాల గురించి వ్యవసాయ మంత్రి తన ప్రకటనలో ప్రస్తావించారనీ, ఆ పథకం కింద తెలంగాణకు చెందిన 25 శాతం మంది రైతులే లబ్ది పొందుతున్నారని వివరించారు. రైతు భరోసాకు కూడా అవే విధి విధానాలను ప్రామాణికంగా తీసుకుంటారా? అని ప్రశ్నించారు. ఒకవేళ రైతు బంధు పథకానికి కోతలు పెట్టకుండా, దాన్ని యథావిధిగా అమలు చేయదలుచుకుంటే సభలో అసలు చర్చే అవసరం లేదని కేటీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రైతు బంధుపై అధికార పక్షం దుష్ప్రచారం చేయటం తగదని హితవు పలికారు. పదేండ్లలో ఆ పథకం వల్ల రైతులు పచ్చబడ్డారనీ, దాన్ని చూసి కొంతమంది ఓర్వలేకపోయారని కాంగ్రెస్ సభ్యులనుద్దేశించి ఆయన ఎద్దేవా చేశారు. వాస్తవానికి మన రాష్ట్రంలో నూటికి 98 శాతం మంది బక్కరైతులే ఉన్నారని చెప్పారు. ఈ క్రమంలో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా, వ్యవసాయరంగం గాడిన పడేదాకా రైతుబంధు కింద అందరికీ పెట్టుబడి సాయం ఇవ్వాలనే విధంగా విధానపరమైన నిర్ణయం తీసుకున్నామని వివరించారు. వ్యవసాయ రంగం స్థిరీకరణ జరిగేదాకా, అది బలోపేతం అయ్యేదాకా రైతుబంధు పైన ఎలాంటి ఆంక్షలు పెట్టలేదన్నారు. గతంలో రైతుబంధు పొందిన రైతన్నల్లో 98 శాతం మంది బడుగు బలహీన, చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని ఆయన వివరించారు.

కేటీఆర్ మాట్లాడుతున్న క్రమంలో జోక్యం చేసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి... పదేండ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ ఎస్ ప్రజలను తీవ్రంగా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పార్టీ పాలనలో కేవలం 40 కుటుంబాలే బాగుపడ్డాయని తెలిపారు. గత పదేండ్లలో 24 గంటలపాటు నాణ్యమైన కరెంటును ఇచ్చామంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ సభ్యులు చెబుతున్న దాంట్లో వాస్తవం లేదన్నారు. ఆయన వ్యాఖ్యలపై బీఆర్ ఎస్ సభ్యుడు హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ లేవనెత్తిన అంశాలపై వ్యవసాయ శాఖ తుమ్మల నాగేశ్వరరావు సమాధానమిస్తూ... రైతు భరోసాకు ప్రభుత్వం ఇంకా ఎలాంటి విధి విధానాలు రూపొందించలేదని స్పష్టం చేశారు. అందువల్ల ఈ అంశంలో ప్రభుత్వాన్ని విమర్శించటం సరికాదని సూచించారు. ప్రజలు, రైతులు, రైతు నేతలు, ప్రతిపక్షాల సూచనలు, సలహాల మేరకే రైతు భరోసాకు విధి విధానాలను రూపొందిస్తామని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ... రైతులకు బేడీలు వేసిన ఘన చరిత్ర బీఆర్ ఎస్ దేనంటూ ఎదురుదాడి చేశారు. ఆ ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు ఒక్క పైసా పెట్టుబడి సాయం ఇవ్వలేదని వాపోయారు.

వారు కిరాయి ఇండ్లల్లో ఉంటే కిరాయిదారుల్లాంటి వారంటూ అప్పట్లో కౌలు రైతుల్ని అపహాస్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్ల మీ పాలనలో ఫామ్ హౌజ్‌లకు, లక్షలాది రూపాయల జీతం తీసుకునే వారికి సైతం రైతు బంధు కింద వేల కోట్లను అప్పనంగా అప్పగించారు, కానీ ఏమీ లేని నిరుపేదలకు ఏమిచ్చారంటూ ప్రశ్నించారు. భూమి లేని నిరుపేదలకు తమ ప్రభుత్వం రూ.12 వేల ఆర్థిక భరోసానిచ్చేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని వివరించారు. వీటిపై బీఆర్ ఎస్ వైఖరి ఏంటో చెప్పాలని కేటీఆర్‌ను మంత్రి ఈ సందర్భంగా నిలదీశారు. బీఆర్ ఎస్ హయాంలో చేసింది రుణమాఫీ కాదనీ, అది వడ్డీ మాఫీ అంటూ ఎద్దేవా చేశారు. అప్పట్లో నియమ నిబంధనలు కఠినంగా ఉండటంతో చాలా మందికి రుణమాఫీ కాలేదని గుర్తు చేశారు. రైతు బంధు, రుణమాఫీ సక్రమంగా అమలైతే...ఇంకా రూ.30 వేల కోట్ల మేర రైతు రుణాలు ఎందుకున్నాయని ప్రశ్నించారు. గ్రామాల్లో ఏయే కుటుంబాలకు ఎంతెంత రైతు బంధు వెళ్లింది? ఫామ్ హౌస్ లకు ఎంత వెళ్లింది? నిరు పేదలకు ఎంత మేర ప్రయోజనం కలిగిందనే వివరాలను ప్రజల ముందు ఉంచాలని వ్యవసాయ శాఖ మంత్రిని కోరారు. రైతు భరోసాకు సంబంధించి ఎన్ని ఎకరాల వరకూ పరిమితి విధించాలో చెప్పాలంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్‌ను కోరారు.

రైతు భరోసాపై ఎలాంటి అపోహలూ వద్దు
అసెంబ్లీలో సీఎం రేవంత్ స్పష్టీకరణ
రైతులను ఆదుకోవటమే తమ లక్ష్యమని వెల్లడి

రైతు భరోసాపై శనివారం అసెంబ్లీలో జరిగిన చర్చకు, సభ్యులు లేవనెత్తిన వివిధ అంశాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానమిస్తూ... రైతులను ఆదుకోవటమే లక్ష్యంగా తమ ప్రభుత్వం రైతు భరోసాను అమలు చేయబోతోందని చెప్పారు. దీనిపై ఎవరికీ ఎలాంటి అనుమానాలు, అపోహలు అవసరం లేదని వ్యాఖ్యానించారు.

గత బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో సాగులో లేని భూములకు కూడా రైతు బంధు ఇవ్వటం ద్వారా రూ.22,600 కోట్ల మేర ఆయాచిత లబ్దిని చేకూర్చారని తెలిపారు. రాళ్లకు, గుట్టలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, పారిశ్రామికవాడలకు కూడా రైతు భరోసా ఇద్దామా? అంటూ ప్రశ్నించారు.

ఈ పథకాన్ని సమర్థవంతంగా, సక్రమంగా అమలు చేసేందుకు వీలుగా సభ్యులందరూ విలువైన సూచనలు,సలహాలనివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## ముగిసిన రాష్ట్రపతి పర్యటన

### ఘనంగా వీడ్కోలు పలికిన గవర్నర్, మంత్రి సీతక్క తదితరులు

హైదరాబాద్ : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది , పర్యటన విజయవంతంగా ముగిసింది. భారత రాష్ట్రపతి ఈ నెల 17 న హైదరాబాదుకు చేరుకున్నారు. ఈ 5 రోజుల పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి, సంక్షేమ పనులు, సాంస్కృతిక కార్యక్రమాలను రాష్ట్రపతి ప్రారంభించారు. ఈ పర్యటన ముగించుకుని శనివారం హకింపేట Airport నుండి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి,వెళ్ళిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, భారత గనుల మంత్రిత్వ శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ , & మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మేడ్చెల్ –మల్కాజగిరి జిల్లా కలెక్టరు గౌతం , ఇతర అధికారులు ఘనంగా వీడ్కొలు పలికారు.

## 25, 26 తేదీల్లో రాష్ట్రంలో ఉప రాష్ట్రపతి పర్యటన

### ఏర్పాట్లపై సీఎస్ శాంతికుమారి సమీక్ష



హైదరాబాద్, డిసెంబర్ 21 :: ఈ నెల 25, 26వ తేదీలలో రెండు రోజుల పాటు భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ రాష్ట్ర పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్ల పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం తెలంగాణ సచివాలయంలో ఉ న్నతస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి 25వ తేదీన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి %×జూా=%–కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శిస్తారని, అక్కడే సేంద్రీయ విధానంలో సాగు చేస్తున్న 500 మంది రైతులతో ముఖాముఖిలో పాల్గొంటారని సీఎస్ తెలిపారు. 25వ తేది రాత్రి కన్హా శాంతివనంలో బస చేస్తారని తెలిపారు.

రాష్ట్రపతి పర్యటన జరిగే రెండు రోజుల పాటు బ్లూ బుక్ ప్రకారం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రంగా రెడ్డి, మెదక్ జిల్లా కలెక్టర్ లు, ఉప రాష్ట్రపతి కార్యాలయంతో, రాష్ట్రంలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సీ ఎస్ ఆదేశించారు. పోలీసు శాఖ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్, బందోబస్త్ చేయాలని డిజిపిని ఆదేశించారు. ఈ పర్యటనలో సరిపడా వైద్య సిబ్బందితో వైద్య సౌకర్యాలు కల్పించాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. భారత ఉపరాష్ట్రపతి ప్రయాణించే దారిలో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని R&B శాఖకు సూచించారు. అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని టీఎస్ఎస్పీడీసీఎల్ యం.డిని ఆదేశించారు. అదే విధంగా అగ్నిమాపక శాఖ విభాగం తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. 26వ తేదీ ఉదయం ఢిల్లీకి తిరుగు ప్రయాణం వరకు సంబంధిత విభాగాల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సి.ఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ జితేందర్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, టీఎస్ఎస్పీడీసీఎల్ ఎండీ ముషారఫ్ అలీ, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ హరీష్, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు, రంగా రెడ్డి, మెదక్ జిల్లాల కలెక్టర్లు, అధికారులు, RGI Airport అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రైతు భరోసాపై ఎలాంటి అపోహలూ వద్దు

- అసెంబ్లీలో సీఎం రేవంత్ స్పష్టీకరణ
- రైతులను ఆదుకోవటమే తమ లక్ష్యమని వెల్లడి

హైదరాబాద్ : రైతు భరోసాపై శనివారం అసెంబ్లీలో జరిగిన చర్చకు, సభ్యులు లేవనెత్తిన వివిధ అంశాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానమిస్తూ... రైతులను ఆదుకోవటమే లక్ష్యంగా తమ ప్రభుత్వం రైతు భరోసాను అమలు చేయబోతోందని చెప్పారు. దీనిపై ఎవరికీ ఎలాంటి అనుమానాలు, అపోహలు అవసరం లేదని వ్యాఖ్యానించారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో సాగులో లేని భూములకు కూడా రైతు బంధు ఇవ్వటం ద్వారా రూ.22,600 కోట్ల మేర ఆయాచిత లబ్దిని చేకూర్చారని తెలిపారు. రాళ్లకు, గుట్టలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, పారిశ్రామికవాడలకు కూడా రైతు భరోసా ఇద్దామా? అంటూ ప్రశ్నించారు. ఈ పథకాన్ని సమర్థవంతంగా, సక్రమంగా అమలు చేసేందుకు వీలుగా సభ్యులందరూ విలువైన సూచనలు,సలహాలనివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## భూభారతితో భూములకు కాంగ్రెస్ ప్రభుత్వం భూహారతి

- భూమాత పోర్టల్.. భూమేతకు దారి తీస్తుంది
- తెలంగాణ రైతకు రక్షణ కవచం ధరణి
- ధరణి వచ్చిన తర్వాత భూమోసాలు పోయాయి
- ధరణితో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చరిత్ర క్షమించదు
- బీఆర్ఎస్ పార్టీ అంటే.. భూ రక్షణ సమితి
- రైతులకు భూభద్రతను కల్పించిన వ్యక్తి కేసీఆర్
- శాసన మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్ బీ భూభారతి చట్టంతో కాంగ్రెస్ ప్రభుత్వం భూములకు భూహారతి పాడుతుందని, భూమాత పోర్టల్.. భూమేతకు దారి తీస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. తెలంగాణ రైతకు రక్షణ కవచంగా ఉ న్న ధరణి వ్యవస్థను రద్దు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. భూభారతిని ఒక తిరోగమన చర్యగా అభివర్ణించారు. శాసన మండలిలో శనివారం నాడు భూభారతి బిల్లుపై జరిగిన చర్చలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. ధరణి వచ్చిన తర్వాత భూమోసాలు పోయాయని, ధరణితో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చరిత్ర క్షమించదని తేల్చిచెప్పారు. ప్రజలు వెంటబడి మరీ ధరణిని తిరిగి సాధించుకుంటారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అంటే.. భూ రక్షణ సమితి అని రైతులు, ప్రజలు అనుకుంటున్నారు"భూమి కోసం ప్రాణమిచ్చేది ఇద్దరే... ఒకరు సైనికుడు, మరొకరు రైతు. మాతృభూమి కోసం సైనికుడు ప్రాణమిస్తే... సాగు భూమి కోసం రైతు ప్రాణమిస్తారు. ఏమైనా సమస్యలు వస్తే వాటిని పరిష్కరించుకొని ముందుకెళ్లాలి తప్పా వ్యవస్థనే రద్దు చేయడం సరికాదు. ధరణిలో కుట్ర కోణం ఉన్నదని ప్రభుత్వం చెప్పడం దారుణం. తెలంగాణలో 2.8 కోట్ల ఎకరాల భూమి ఉ ంది.. అందులో 1.5 కోట్ల ఎకరాలు సాగు భూమి. 17.8 లక్షల ఎకరాలు మాత్రమే వివాదాల్లో ఉంది.

## సింగరేణి సంస్థకు ఎనర్షియా అవార్డు ప్రదానం

సింగరేణి సంస్థ కు జాతీయస్థాయి లో అత్యుత్తమ పర్యావరణహిత మైనింగ్, సోలార్ ఉ త్పాదక సంస్థగా ప్రతిష్టాత్మక ఎనర్షియా అవార్డును విశాఖపట్నంలో బహూకరించారు. ఎనర్షియా17వ పర్యావరణ మైనింగ్, సాంప్రదాయేతర ఇంధన వనరుల జాతీయస్థాయిలో ఇండియాస్ బెస్ట్ అండ్ మోస్ట్ సస్టైనబుల్ కోల్ మైనింగ్ అండ్ ఆపరేషన్ విత్ రెన్యువబుల్ ఎనర్జీ అనే అవార్డును కేంద్ర ఎలక్ట్రిసిటీ అథారిటీ ఛైర్మన్ ఘన్ శ్యామ్ ప్రసాద్ నుండి సింగరేణి సంస్థ సీఎండీ తరసున డైరెక్టర్ ఇ అండ్ ఎం. డి సత్యనారాయణ రావు, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ ఎస్ డి.ఎం సుభాని స్వీకరించారు. శనివారం ఉదయం హైదరాబాద్ సింగరేణి భవన్ లో జీఎం (కో ఆర్డినేషన్) ఎస్ డి ఎం సుభాని ఈ అవార్డును సంస్థ ఛైర్మన్, ఎండి ఎన్ ఎన్ బలరామ్ కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ ఎన్. బలరామ్ మాట్లాడుతూ రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటు కు సిద్ధం కావడం, భారీ జలాశయాల్లో ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండటం, కార్బన్ డై యాక్సైడ్ నుంచి మిథనాలు తయారీ, భారీగా మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలకు గుర్తింపు లభించిందన్నారు. జాతీయస్థాయిలో ఈ అవార్డు రావడం ఎంతో స్ఫూర్తిని కలిగిస్తుందని, ఇక ముందు కూడా సింగరేణి సంస్థ పర్యావరణహిత మైనింగ్ ను మరింతగా పెంపొందిస్తూ సోలార్ విద్యుత్తు కూడా పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు

# సంపాదకీయం

## అన్ని విధాలా రాష్ట్రానికి నష్టం

సౌర విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన సామాగ్రిని ఉత్పత్తి చేసే సామర్థ్యమున్న కంపెనీలు టెండరు ప్రక్రియలో పాల్గొంటే, అలాంటి సామర్థ్యం లేని కంపెనీలు పేర్కొన్న ధరల కన్నా తక్కువ ధరలను పేర్కొనాలి. అదేవిధంగా, వేలాది మెగావాట్ల సౌర విద్యుత్ సరఫరాకు టెండరులో పాల్గొనే కంపెనీలు అంత భారీ ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకొల్పే అవకాశంతో (ఎకానమీ ఆఫ్ స్కేల్) తక్కువ ధరలను పేర్కొనాలి. అదానీ ఎనర్జీ విషయంలో అలా జరగలేదు. ఆనాడు పోటీ బిడ్డింగులలో అలాంటి సదుపాయంలేని కంపెనీలు తక్కువ సామర్థ్యానికే అదాని రేట్లకన్నా చాలా తక్కువగా రేట్లను పేర్కొనటం వల్ల కొన్ని విషయాలు స్పష్టం అవుతున్నాయి. అదాని చివరకు అంగీకరించిన యూనిట్‌కు రూ. 2.42 రేటు చాలా అధికం. సౌర విద్యుత్ ఫలకాలు, తదితర సామాగ్రిని ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్న కంపెనీలు మాత్రమే బిడ్డింగులో పాల్గొనటానికి అర్హులని మోడి ప్రభుత్వం సెకీ బిడ్డింగ్ షరతులలో చేర్పించటం, నిజమైన పోటీ లేకుండా అదాని కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చటానికే. అలాంటి ఉత్పత్తి సామర్థ్యం ఉందా లేదా అనే దానితో నిమిత్తం లేకుండా, ఎవరు అతి తక్కువ రేటును బిడ్డింగులో పేర్కొంటే, ఆ కంపెనీనే ఎంపిక చేసి, సాపేక్షికంగా తక్కువ ధరలకే సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసే అవకాశం ఈ షరతుల తొత్తడంతో లేకుండా పోయింది. అజూర్ కంపెనీ 4000 మె.వా. విద్యుత్ విక్రయాలతో సుమారు 20 ఏళ్ళలో పన్ను చెల్లింపు తరువాత 2 బిలియన్ డాలర్ల గణనీయమైన లాభాలు లభిస్తాయని అంచనా వేసిందని అమెరికా కోర్టులో గౌతమ్ అదానికి, ఇతరులకు వ్యతిరేకంగా దాఖలైన అభిశంసన అభియోగ పత్రంలో (పేరా 45) పేర్కొన్నారు. సాధారణంగా, సౌర విద్యుత్ ప్రాజెక్టులకు ఈక్విటీపై 16 శాతం లాభం లెక్కగట్టేవారు. ఉత్పత్తిదారులకు లాభం ఎంత గణనీయంగా ఎక్కువగా ఉంటే, సౌర విద్యుత్ కొనుగోలుదారులకు చార్జీల భారం అంత అధికంగా ఉంటుంది. అదాని-సెకితో ఎపిడి స్కాముల ఒప్పందంలో జరిగింది ఇదే. టెండర్లు వేశాక 2019 డిసెంబరు 10న సెకి అదాని గ్రీన్‌కు, అజూర్‌కు లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్‌ఒఎ) ఇచ్చింది. టెండరులోని రిక్వెస్ట్ ఫర్ సెలెక్షన్ (ఆర్‌ఎఫ్‌ఎస్) నిబంధనల ప్రకారం ఎల్‌ఒఎ జారీ చేసిన 90 రోజులలోగా సెకి ఎంపికైన కంపెనీలతో పిపిఎలు చేసుకోవాలి. అయితే పిపిఎలు చేసుకొనేందుకు 18 నెలలకు పైగా ఆలస్యమైంది. ఎందుకంటే, వివిధ రాష్ట్రాల డిస్కాంలకు సెకీ అదాని, అజూర్‌ల నుండి కొనుగోలు చేయడానికి అంగీకరించిన రేట్లకు పిఎస్‌ఎలు చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలను ఆ రేట్లు అధికంగా ఉన్నాయని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, డిస్కాములు అంగీకరించలేదు. ఆ తరువాత అదాని, అజూర్ కంపెనీలు వాటి అధికారుల ద్వారా 'భారీ ముడుపుల పథకం' నడిపాక, పిపిఎలు చేసుకొనేందుకు మార్గం సుగమమైంది. మె.వా.కు రూ.25 లక్షల చొప్పున ముడుపులను లెక్కగట్టారని, ఆంధ్రప్రదేశ్ అధికారులకు రూ.1750 కోట్ల మేరకు లంచాలు ఇస్తామని హామీ ఇచ్చారని లేదా చెల్లించారని, ఆ అధికారులలో ముఖ్యమంత్రి ఉన్నారని 2021 ఆగస్టులో అదాని గ్రీన్ రికార్డులలో ఎఫ్‌బిఐ దర్యాప్తు అధికారులు కనుగొన్నారని అమెరికా కోర్టులో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్ (ఎస్ఇసి) దాఖలు చేసిన అభియోగ పత్రంలో పేర్కొన్నారు. గౌతం అదాని, సాగర్ అదాని ముఖ్యమంత్రిని 2021 ఆగస్టులో, సెప్టెంబరులో వేర్వేరుగా కలిశారని, ప్రోత్సాహకాలతో సెకితో డిస్కాంలు పిఎస్ఎ చేసుకొనకపోవటాన్ని చర్చించారని అభియోగ పత్రంలో పేర్కొన్నారు (పేరాలు 29, 33, 34, 51, 53, 54). ఆ తరువాత రాష్ట్ర మంత్రి వర్గం సెకితో 7000 మె.వా. పిఎస్ఎ చేసుకునేందుకు ఆమోదం తెలిపింది. అధిక ధరలకు ఆ సౌర విద్యుత్ కొనుగోలుకు సెకీతో ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ప్రోత్సాహకాలు పని చేశాయని అభియోగ పత్రంలో వ్యాఖ్యానించారు. అదాని సౌర విద్యుత్‌ను రాష్ట్రంలో వ్యవసాయ అవసరాలకు సరఫరా చేయడానికే కొనుగోలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతమున్న మూడు డిస్కాములు లేదా కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామీణ వ్యవసాయ విద్యుత్ పంపిణీ కంపెనీ, ఈ విద్యుత్‌ను రాష్ట్ర మంతటా సరఫరా చేయాలి. ఆయా ప్రాంతాలలో వ్యవసాయ విద్యుత్ డిమాండు ఆధారంగా అవసరమైన ఉత్పత్తి సామర్థ్యంతో స్థానికంగా సౌర విద్యుత్ ప్రాజెక్టులను నెలకొల్పితే అనేక ప్రయోజనాలుంటాయి. వాటి నుండి చుట్టుపక్కల స్థానిక ప్రాంతాలకు విద్యుత్ ప్రసారం, పంపిణీలకు పెట్టుబడుల అవసరాలు, చార్జీలు, ప్రసార, పంపిణీ నష్టాలు తక్కువగా ఉంటాయి. ఇలాంటి ఏర్పాటు అవసరమైన ఓల్టేజి నిర్వహణకు దోహదం చేస్తుంది. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. రాజస్థాన్‌లోని అదాని ప్రాజెక్టుల నుండి సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసే ఏర్పాటుతో రాష్ట్రం, వినియోగదారులు ఈ ప్రయోజనాలను కోల్పోయారు. అంతకు ముందు, రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ ద్వారా 6000 మె.వా సౌర విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలిచింది ఇలాంటి ఏర్పాట్ల అవకాశాలతోనే. టెండర్ల షరతుల మార్పుపై వివాదాలతో, హైకోర్టు తీర్పుతో, తరువాత సెకీతో ఏర్పాటుతో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చివరకు ఆ టెండర్లను రద్దు చేసుకుంది. కేంద్ర విద్యుత్ ప్రసార సంస్థ పిజిసిఐఎల్ రాజస్థాన్ నుండి అదాని విద్యుత్‌ను రాష్ట్ర సరిహద్దు వరకు ప్రసారం చేస్తుంది. అక్కడి నుండి ఆ విద్యుత్‌ను వ్యవసాయం నిమిత్తం రాష్ట్రమంతటా సరఫరా చేయాల్సినందున ప్రసార, పంపిణీ నష్టాలు ఎక్కువ అవుతాయి. రాజస్థాన్ నుండి సౌర విద్యుత్ పొందటం వల్ల రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు భూమి కేటాయించాల్సిన అవసరం ఉండదని, దానిని ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చునని ఆనాడు అదాని-సెకితో ఒప్పందం వ్యవహారంలో ఉన్న అధికారులు వాదించారు. ప్రతి రాష్ట్రం అదే వైఖరి తీసుకుంటే, విద్యుత్ ప్రాజెక్టులు, ఆ మాటకు వస్తే ఇతర ప్రాజెక్టులు, పరిశ్రమల వంటి వాటి స్థాపనకు, ఉపాధి కల్పనకు, అభివృద్ధికి అవకాశాలు వుండవనేది స్పష్టం. ఇతర రాష్ట్రాల నుండి దిగుమతులపై ఆధారపడాల్సి వస్తుందనేది స్పష్టం.

# విద్యావ్యవస్థ పిల్లికి గంట ఎవరు కడతారు?

విద్యా వ్యవస్థ చాలా చింతాజనకమైన పరిస్థితిలో ఉందని అందరూ అంటారు - విద్యార్థులు, తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు, విద్యాసంస్థల అధిపతులు, యాజమాన్యం. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎన్ని ఏళ్ళూ పూళ్లూ గడిచినా పై పై మార్పులు తప్ప మూల కారణాల అన్వేషణ, చికిత్స మరియు ప్రక్షాళన జరగటం లేదు.

విద్యయే దేశాభివృద్ధికి ఆధారం.

చదువుల నాణ్యత - పట్టించుకునే తల్లిదండ్రులకు తెలుస్తుంది. కానీ వారికి సమయం కుదరాలి. అందుకే విద్యాశాఖ వారు కూడా బడి చదువు నాణ్యతను పరీక్షిస్తారు. అధికారులను తనిఖీకి పంపిస్తారు, లేదా స్వయంగా విద్యాశాఖామంత్రి, లేదా ముఖ్యమంత్రి నాణ్యతను పరీక్షిస్తారు. ఈ తీరున కొన్నాళ్ళ క్రితం అప్పటి మంత్రి హరీష్ రావు గారు ఒక బడి దర్శించి స్వయంగా నాణ్యత పరీక్షకై కొన్ని చిన్న చిన్న ప్రశ్నలు వేసి, పిల్లల సమాధానాలు విని, విద్యాప్రమాణాల పతనం గ్రహించి విస్తుపోయారు. తరువాత ఏమి జరిగిందో నాకు తెలియదు కానీ ఆ బడివారికి నాణ్యతను పెంచమని చెప్పినట్టు సమాచారం. ఈ మధ్య ఒక వార్తాపత్రిక కథనం ప్రకారం బడి చదువు నాణ్యత కోసం జరిపిన సర్వేలో నిర్ఘాంత పోయే విషయాలు బయటపడ్డాయి. ఏతావాతా తెలుస్తున్నది ఏమిటంటే విద్యాప్రమాణాలు దిగజారిపోతున్నా సరే, పరీక్షా ఫలితాలు (అంటే మార్కులు, సంఖ్యలు) దండిగా, మెండుగా, శుభ్రంగా, పుష్టిగా వస్తున్నాయి. తేలిందేమిటంటే, ఫలితాలకు, పిల్లల విషయ అవగాహనకి సంబంధం లేకుండా పోయింది. ఇది ఉపేక్షించదగని విషయం. విషయ అవగాహన లేని సంఖ్యలు ఎందుకు? ఎందుకూ పనికి రాక, ఉత్పత్తి లేని దేశం నోట్లు ముద్రించినట్లు. ఆ నోట్లకి ఏమి విలువ ఉంటుంది? దేశంలో నగదు అధిక ముద్రణ వలన ప్రజలకి ఎలా ఇసుమంతైనా ప్రయోజనం ఉండదో, విద్య లో ఊరికనే విచక్షణారహితంగా మార్కులు ప్రసాదించడం వలన ఏ ప్రయోజనం ఒనగూరదు.

తోపుడు విధానం: ప్రస్తుత విద్యావ్యవస్థలో 10వ తరగతి వరకు తోపుడు విధానం ఉంది. ఒక తరగతిలో కనీస విషయ పరిజ్ఞానం సంపాదించినా సంపాదించక పోయినా, కనీస హాజరు ఉంటే, తరువాతి తరగతిలోనికి యాంత్రికంగా వెళ్ళిపోతాడు. కింది తరగతి విషయాల పరిజ్ఞానం, అవగాహన లేకుండా పై తరగతికి వెళ్ళిపోతే, ఆ పై తరగతి విషయాలు ఎలా అర్థం అవుతాయి? ఈ కింది తరగతి విషయాల మీద ఆధారపడే గదా అవి ఉంటాయి? ఇంత ప్రాథమిక విషయాన్ని పెద్దలు (తల్లిదండ్రులు, శిక్షకులు, దేశాధినేతలు) ఎలా పట్టించుకోలేదో అర్థం కాని విషయం. ఇది దేశ మానసిక స్థితిని సూచిస్తుంది.

ఒక వివరణ మరియు సంజాయిషీ ఏమిటంటే ఉత్తీర్ణులు కాని పిల్లలు మానసిక ఒత్తిడికి గురి అవుతారు. దీని వలన ప్రమాణపత్రమైతే లభిస్తుంది కాని జీవనోపాధి లభించదు. ఉత్తుత్తి ప్రమాణపత్రాలు చిత్తుకాగితాలతో సమానం. బుద్ధి ఉన్న వాడెవడు కేవలం ప్రమాణ పత్రం మీద ఆధారపడి ఉద్యోగం ఇవ్వడు.

నిర్మాణ సంవత్సరాలలో పిల్లలలో ప్రతికూల మరియు సానుకూల అనుభవాలు వారి మెదడు అభివృద్ధిని గణనీయంగా ప్రభావితం చేస్తాయి. తెలంగాణ రాష్ట్రంలో ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యాబోధన, నైపుణ్యమైన శిక్షణ, ఉపాధి కల్పన కోసం అందరికీ జీవితకాల అభ్యాసాన్ని ప్రోత్సహించి, విద్యలో నూతన సంస్కరణలు తీసుకోరావడానికి తెలంగాణ ప్రభుత్వం 3వ తారీఖు సెప్టెంబరు 2024 న కొత్త విద్యా కమిషన్ ను ఏర్పాటు చేసింది . పదవి కాలం రెండు సంవత్సరాలు ఉంటుంది. తెలంగాణ విద్యా కమీషన్ మొదటి చైర్మన్‌గా ఆకునూరి మురళిని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024 సెప్టెంబరు 03న ఉత్తర్వులు జారీ చేసింది. ఆకునూరి మురళికి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించింది. దానిలో ముగ్గురు సభ్యులు - పీ.ఎల్. విశ్వేశ్వర్‌రావు, చారుగొండ వెంకటేష్, జ్యోత్స్నా శివారెడ్డి కూడా ఉన్నారు. ఆ విధంగా విద్యా కమీషన్ బాధ్యతలు చేపట్టిన ఆకునూరి మురళిపై, ఆయన పనితీరు పై ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఆకునూరి మురళి ఎన్నికల ముందు ఒకలాగా ఇప్పుడు ఒకలాగా మాట్లాడుతున్నారని విద్యా కమీషన్ ఏమి చేస్తుందో తెలియట్లేదని ఆగ్రహించారు. రేవంత్ రెడ్డి ని కాపాడేందుకు ఆకునూరి మురళి పని చేస్తున్నారు ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితులు చూసి విద్యా కమీషన్ ఏమి చేస్తుందని ప్రశ్నించారు. విద్యా కమీషన్ ఏమి చేస్తుందో ఆకునూరి మురళి నే అడగాలన్నారు.దానికి ప్రతిస్పందనగా ఆకునూరి మురళి తాము కష్టించి పనిచేస్తున్నామని, తాము ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని చెప్తూ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ పై ప్రత్యారోపణలు చేసారు. ఇది టీవీ చర్చల్లో రాజకీయనాయకుల వ్యవహారాన్ని తలపించింది. వారు చేసిన ఆరోపణలకు వీరు సమాధానం చెప్పరు. చెప్పకుండా ప్రత్యర్థిపై ప్రత్యారోపణలు చేస్తారు. ఈ ప్రత్యారోపణలకు సమాధానం వారు చెప్పరు. ఒకరి మీద ఒకరు బురద చల్లుకోవడం తప్ప.

**సీతా రామ రాజు సనపల**

# జాతీయ గణిత దినోత్సవం



20వ శతాబ్దంలో ప్రపంచ ప్రసిద్ధిచెందిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు పొందిన, భారతీయ గణిత చరిత్రకు మెరుగులు దిద్దిన శ్రీనివాస రామానుజన్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతియేటా డిసెంబర్ 22ను జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపు కొంటున్నారు.గణిత శాస్త్రములో ఆర్యభట్ట, భాస్కరాచార్యులు తరువాత భారత దేశానికి గొప్ప పేరు తెచ్చిన మేధావి భారత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ (1887 డిసెంబర్ 22 - 1920 ఏప్రిల్ 26). తన విలక్షణ అసమాన మేధాసంపత్తితో అనన్య సామాన్యమైన కృషిచేసి భారతీయ కీర్తి పతాకాన్ని దశదిశలా ఎగరవేసిన మహా గణితజ్ఞుడు శ్రీనివాస రామానుజన్. ఆయన జీవించింది 32 అయినా 3900పైగా సిద్ధాంతాలను, సూత్రాలను అందించిన అపరగణిత మేధావి. ఆయన సిద్ధాంతాలపై నేటికీ ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు జరుగుతుండడం విశేషం.

గణితం వేద కాలము నుండి భారతీయ సంప్రదాయంలో భాగమేనని మన వేద గణితం ద్వారా మనకు తెలుస్తున్నది. గణితం ప్రాచీన భారత దేశంతో పాటు ప్రాచీన ఈజిప్టు, మెసపు టేమియా, ప్రాచీన చైనా, ప్రాచీన గ్రీకు నాగరికతలలో ఎక్కువగా అభివృద్ధి చెందింది. ప్రపంచ వ్యాప్తంగా గణితము అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఎంతో ఉంది. సంఖ్యామానానికి పట్టుకొమ్మ అయిన సున్నా భారతీయుల ఆవిష్కరణే. ప్రాచీన భారతీయులు గణితంలో ఎన్నో విషయాలు కనుగొన్నారు. సంఖ్యలను కనుగొనడంలో చాల కృషి చేశారు. దశాంశ పద్ధతిని గుర్తించిన మొదటివారు భారతీయులే. ఆర్యభట్ట కాలాన్ని భారతీయ గణిత శాస్త్రానికి స్వర్ణయుగంగా పేర్కొంటారు. ఇది భాస్కరా చార్యుని వరకు అప్రతిహతంగా సాగింది. భాస్కరాచార్యుని తర్వాత కాలంలో బహు విదేశీ దండ యాత్రల వల్ల గణితం కళ తప్పింది. అనువాదాలు, వ్యాఖ్యానాలు తప్ప పెద్దగా స్వతంత్ర గణిత సారస్వతం ఏదీ ఆవిష్కరణ కాలేదు. ఆ స్థితిలో మళ్లీ భారతీయ గణిత చరిత్రకు మెరుగులు దిద్దిన మేధావి శ్రీనివాస రామానుజన్.

గణితంపై అనేక గ్రీకు అరబిక్ గ్రంథాలు 12వ శతాబ్దం నుండి లాటిన్‌లోకి అనువదించ బడ్డాయి. ఇది మధ్యయుగంలో ఐరోపాలో గణిత శాస్త్రం మరింత అభివృద్ధికి దారితీసింది. పురాతన కాలంమధ్య యుగాల వరకు, గణితశాస్త్ర ఆవిష్కరణ కాలాలు తరచుగా శతాబ్దాల స్తబ్దతతో అనుసరించ బడ్డాయి. 15వ శతాబ్దంలో పునరుజ్జీవనోద్యమం ఇటలీలో ప్రారంభమై , కొత్త గణిత శాస్త్ర పరిణామాలు, కొత్త శాస్త్రీయ ఆవిష్కరణల పరంపర పెరుగుతున్న వేగంతోఈ రోజు వరకు కొనసాగుతోంది. ఆధునిక కాలపు తొలినాళ్ళలో పశ్చిమ ఐరోపాలో గణిత శాస్త్రం అభివృద్ధి వేగం పుంజుకుంది. 17వ శతాబ్దం లో న్యూటన్, లీబ్నిజ్ ల కలన గణితం అభివృద్ధి చెందిది. గణితంలో విప్లవాత్మక మార్పులను తెచ్చింది. లియొన్‌హార్డ్ ఆయిలర్ 18వ శతాబ్దంలో అత్యంత ప్రసిద్ధ గణిత శాస్త్రజ్ఞుడు, అనేక సిద్ధాంతాలు, ఆవిష్కరణలకు తోడ్పడ్డాడు. 19వ శతాబ్దంపు తొలి గణిత శాస్త్రజ్ఞులలో ఒకడైన కార్ల్ ఫ్రెడ్రిక్ గాస్... బీజగణితం, విశ్లేషణ, అవకలన జ్యామితి, మాతృక సిద్ధాంతం, సంఖ్యా సిద్ధాంతం, గణాంకాలు వంటి రంగాలలో అనేక రచనలు చేశాడు. శ్రీనివాస రామానుజన్, కల్యంపూడి రాధాకృష్ణ రావు, సుజాత రాందొరై, పి.సి. మహల నోబిస్, మడకా హరిప్రసాద్ లాంటి ప్రముఖ భారతీయ గణిత శాస్త్రజ్ఞులు విశేష కృషి చేశారు. 2012 ఫిబ్రవరి 26 న మద్రాస్ విశ్వవిద్యాలయంలో జరిగిన రామానుజన్ 125వ జయంతి ప్రారంభ వేడుకల్లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టిన రోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. అలాగే 2012 ను జాతీయ గణిత సంవత్సరంగా జరుపుకుంటామని ప్రకటించారు. అలా 2012 నుంచి ప్రతీ సంవత్సరం డిసెంబర్ 22 ను జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.యువతలో శాస్త్రీయ స్వభావాన్ని పెంపొందించడం, గణిత శాస్త్రంలో పరిశోధనలను ప్రోత్సహించడం, ఆర్థిక, విజ్ఞాన శాస్త్రం, ఇతర విభాగాలలో దాని అనువర్తనాన్ని అన్వేషించడంతో పాటు గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ ను స్మరించుకుని, గౌరవించటం జాతీయ గణిత దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

భారత దేశంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలలో జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపుకుంటారు. రామానుజన్ 75వ జన్మదినోత్సం సందర్భంగా 1962లో కేంద్ర సర్కార్ పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. అత్యంత చిన్న వయసులోనే గణిత శాస్త్రంలో తనకున్న పట్టును చాటుకున్న రామానుజన్ మ్యాథ్య జీనియస్ గా పేరుగాంచిన ఆయన జీవిత ఆధారంగా ద మ్యాన్ హూ నో ఇన్ఫినిటీ పేరుతో సినిమా కూడా విడుదలైంది.

రామ కిష్టయ్య సంగన భట్ల...

# కాకలు తీరిన రాజకీయ నేత కాకా

రాజకీయాల్లో కాకలు తీరిన నేతగా... 'కాకా'గా చెరగని ముద్ర వేసిన కేంద్ర మాజీ మంత్రి, సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి గడ్డం వెంకటస్వామి(92). భారత రాజ్యాంగ రూపకర్త బాబా సాహెబ్ అంబేద్కర్‌తో కలసి పనిచేసిన వారిలో కాకా ఒకరు. కార్మిక నేతగా ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. భారత దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవికి అతి సమీపానికి వెళ్ళి, కొందరి స్వార్థం, కుట్రల మూలంగా, ఆ పదవి పొందలేక పోయానని కాకా పదే పదే చెపుతుండే వారు. హైదరాబాద్ లో ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేయించి గుడిసెల వెంకట స్వామిగా గుర్తింపు పొందారు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు మొదటిసారి ప్రతిపాదన చేసిన వ్యక్తి వెంకటస్వామి. సుదీర్ఘ రాజకీయ జీవితంలో కార్మిక నేతగా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, పిసిసి అధ్యక్షుడిగా, ఎఐసిసి బాధ్యునిగా, ఎంపీగా , కేంద్ర మంత్రిగా, ఆయన అందించిన బహుముఖ సేవలు నిత్య జ్ఞాపకాలుగా మిగిలాయి.గడ్డం వెంకటస్వామి 5 అక్టోబర్ 1929న హైదరాబాద్ లో జన్మించారు. చిన్న వయసులోనే నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. మొదట ఆర్యసమాజ్‌లో, ఆ తర్వాత రామానందతీర్థ శిష్యుడిగా కాంగ్రెస్‌లో పనిచేశారు. సాయుధ పోరాట సమయంలో జైలుకెళ్లిన కాకా.. హైదరాబాద్ విలీనం అనంతరం రాజకీయాలు వదిలేసి కుటుంబ పోషణ కోసం కూలీ పని చేశారు. అప్పుడే కార్మిక నాయకుడిగా ఎదిగారు. హైదరాబాద్‌లో నిలువనీడ లేకుండా ఉన్న పేదల కోసం ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసి వారి కోసం పోరాడారు. ఆర్థికంగా బలపడ్డాక మళ్లీ రాజకీయాల్లోకి వచ్చిన కాకా అనేక పదవులు అలంకరించారు. 1957- 62 మరియు 1978-84 ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ్యులుగా రెండు పర్యాయాలు ఉన్నారు. 1967లో 4 వ లోకసభకు ఎన్నికైయ్యారు.1969-71 వరకు ప్రజా పద్దుల కమిటీ సభ్యుడు. అవిభక్త కరీంనగర్ జిల్లా పెదపల్లి లోకసభ నియోజకవర్గంనుండి పార్లమెంట్ కు ప్రాతినిధ్యం వహించారు. 1971లో 5వ లోకసభకు (2వ పర్యాయం), 1977లో 6వ లోకసభకు (3వ పర్యాయం), 1989లో 9వ లోక్ సభ (4వ పర్యాయం), 1991లో 10వ లోకసభకు (5వ పర్యాయం), 1996లో 11వ లోకసభకు (6వ పర్యాయం), 2002-2004 అధ్యక్షుడి గా, ఎ.ఐ.సి.సి. ( ఎస్ సి %డ% ఎస్ టి ), 2004లో 14వ లోకసభకు (7వ పర్యాయం), ఎన్నికైయ్యారు. 1978 - 1982 లేబర్ మరియు సివిల్ సప్లైస్, ఆంధ్ర ప్రదేశ్ క్యాబినెట్ మంత్రిగా పని చేశారు. ఫిబ్రవరి 1973 - నవంబర్ 1973 వరకు లేబర్ మరియు పునరావాస కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. నవంబర్ 1973-మార్చి 1977 వరకు సప్లై అండ్ రీహాబిలిటేషన్ కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. 21 జూన్ 1991 నుండి 17 జనవరి 1993 గ్రామీణాభివృద్ధి కేంద్ర మంత్రిగా, 18 జనవరి1993 నుండి ఫిబ్రవరి 1995 టెక్స్టైల్స్ కేంద్ర సహాయమంత్రి (ఇండిపెండెంట్ ఛార్జ్)గా, 10 ఫిబ్రవరి నుండి 1995-15 సెప్టెంబర్ 1995 వరకు టెక్స్టైల్స్ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 15 సెప్టెంబర్. 1995 నుండి 10 మే 1996 వరకు కార్మిక శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 20 ఫిబ్రవరి 1996-16 మే 1996 కార్మిక మరియు వస్త్రాల శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. అలాగే డిప్యుటి లీడర్ కాంగ్రెస్ పార్లమెంట్ పార్టి, లోకసభ మెంబర్, కమిటి ఆన్ ఎనర్జి , మెంబర్, కమిటి ఆన్ ఇన్ స్టాలేషన్ ఆఫ్ పోర్ట్రైస్ / స్టేటస్ ఆఫ్ నేషనల్ లీడర్స్, పార్లమెంటేరియన్ ఇన్ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌మెంబర్, కమిటి ఆన్ ఎతిక్స్‌మెంబర్, కన్ సులేటివ్ కమిటి, మినిస్ట్రీ ఆఫ్ హెవీ ఇండస్ట్రీస్ మెంబర్, స్టాండింగ్ కమిటి ఆన్ ఎనర్జజీ పని చేశారు.కాకా మొదటి కుమారుడు గడ్డం వినోద్, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, రెండవ కుమారుడు గడ్డం వివేకానందా, పెద్దపెల్లి నియోజక వర్గానికి ఎం.పి.గా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారునిగా పనిచేశారు.ఆయన 2014, డిసెంబరు 22వ తేదీ హైదరాబాదులో మరణించాడు.

# దారితప్పిన సరోగసీ

సరోగసీ ఒక వ్యాపారంగా విస్తరిస్తోందన్నది బహిరంగ రహస్యమే. ఆధునిక జీవనశైలిలో అనేక మార్పులు రావడం, ఒత్తిళ్లు పెరగడంతో ఆ ప్రభావం యువతను అనేక విధాలుగా వేధిస్తోంది. సంపాదనలో భార్యాభర్తలు ఇద్దరూ నిమగ్నం కావడంతో అప్పుడే సంతానం అక్కరలేదని సరిపెట్టుకొంటున్నారు. కొన్నేళ్ల తరువాత సంతానం పొందాలనుకొనే ఆకాంక్ష కలిగినా సంతాన సాఫల్యం కలగని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దాంతో సంతాన రహితులైన స్వదేశీయులే కాదు విదేశాల్లో ఉన్న ప్రవాస భారతీయులు కూడా కొన్ని లక్షల రూపాయల పెట్టుబడితో ప్రత్యామ్నాయంగా అద్దె గర్భాలను కుదుర్చుకుని సంతానం పొందడానికి తాపత్రయపడడం పరిపాటి అయింది. అయితే ఇది ఫక్కా వాణిజ్యంగా రూపాంతరం చెందుతోంది. ఎన్ని నిబంధనలున్నా దీనిని నియంత్రించడం కష్టసాధ్యమవుతోంది. ఈ చాటుమాటు వ్యవహారాలు, విషాద సంఘటనలు దేశంలో అక్కడక్కడ జరుగుతున్నా అంతగా బయటపడడం లేదు. రెండు రోజుల క్రితం తెలంగాణలోని రాయదుర్గంలో సరోగసీ గర్భధారిణి నిర్బంధానికి గురై, లైంగిక వేధింపులు భరించలేక తొమ్మిదో అంతస్థు నుంచి దూకి బలవన్మరణానికి బలైపోవడం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. సరోగసీ తెలంగాణలో చాపకింద నీరులా సాగుతోందనడానికి ఈ విషాద సంఘటన సాక్షమవుతోంది. సరోగసీలో నిబంధనల ప్రకారం సమీప బంధువుల నుంచి మాత్రమే అద్దెగర్భం ప్రక్రియలో సంతానాన్ని పొందవలసి ఉంటుంది. కానీ నిబంధనలు ఏవీ పాటించకుండా నిరుపేద మహిళలకు కొంత నగదు ముట్టజెప్పి పిల్లలను ప్రసవింప చేసుకోగలుగుతున్నారు. కొన్ని సాఫల్య కేంద్రాలు, ప్రైవేట్ ఆస్పత్రులు ఈ అద్దెగర్భాల ప్రక్రియను భారీ వాణిజ్య రాకెట్‌గా సాగిస్తున్నాయి. సరోగసీ ద్వారా సంతానం పొందాలనుకుంటే కొన్ని నిబంధనలు చట్టంలో రూపొందించారు. దంపతులకు పెళ్లయి ఐదేళ్లు నిండాలి. వీరికి గతంలో పిల్లలు కానీ, దత్తత తీసుకున్న సంతానం కానీ ఉండకూడదు. భర్తకు 26 55, భార్యకు 25 50 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. దంపతుల్లో ఒకరికి సంతాన వైఫల్యం సమస్య ఉన్నట్టు జిల్లా మెడికల్ బోర్డు ధ్రువపత్రం అవసరం. జన్మించిన బిడ్డ సంరక్షణ హక్కులకు మేజిస్ట్రేట్ అనుమతి తీసుకోవాలి. గర్భాన్ని అద్దెకిచ్చే మహిళ వివాహితురాలై ఉండడమే కాదు, ఒక బిడ్డకు జన్మనిచ్చి ఉండాలి. ఒకసారి మాత్రమే అద్దెగర్భం పొందే అవకాశం ఉంటుంది. అదీ సమీప బంధువులకు మాత్రమే ఇవ్వాలి. ప్రసవానంతరం ఆ మహిళకు 16 నెలల బీమా సౌకర్యం కల్పించాలి. ఇన్ని నిబంధనలు ఉన్నా ఇవేవీ పట్టించుకోకుండా దళారీ వ్యవస్థ ద్వారా అద్దె గర్భాలను కుదుర్చుకుంటున్నారు. ఒకప్పుడు హైదరాబాద్, విజయవాడ కేంద్రాలుగా సాగిన సరోగసీ వ్యవహారం రానురాను తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు కూడా ప్రాకింది. ఐదేళ్ల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో సరోగసీ దందా వెలుగు చూసింది. పేద గిరిజన మహిళలకు లక్షల రూపాయలు ఆశ చూపి వారిని పావులుగా వాడుకున్నారు. భువనగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సరోగసీ కోసం సుమారు 100 మంది మహిళలను గుట్టుగా ఉంచగా, ఓ మహిళ బయటపడడంతో ఆ వ్యవహారమంతా వెలుగులోకి వచ్చింది. చిన్న వయసులో వివాహాలు జరిగి పిల్లలు పుట్టిన యువతులను సరోగసీకి ఎంపిక చేసుకుంటున్నారు. వారికి తొలుత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆ తర్వాత సరోగసీకి బలవంతంగా ఒప్పిస్తున్నారు. అయితే ఇది వికటించి కొందరు మహిళలు అనారోగ్యానికి గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. బలవంతంగా వివాహితలను ఈ రొంపిలోకి లాగినట్టు కొన్ని కేసులు కూడా పోలీస్ స్టేషన్లలో నమోదయ్యాయి. థాయ్‌లాండ్, నేపాల్, మెక్సికో, కంబోడియాలతోపాటు భారత దేశం కూడా సరోగసీని నిషేధించిన తరువాత ఉక్రెయిన్, జార్జియా, లావోస్, మలేసియా, అర్జెంటీనా, కొలంబియా, నైజీరియా, కెన్యా, దక్షిణాఫ్రికా వంటి దేశాలకు సరోగసీ మార్కెట్ విస్తరించింది. భారత దేశంలో 2010లో సరోగసీ నియంత్రణ ముసాయిదా బిల్లు తయారైంది. 2019 లో సరోగసీ నిషేధ చట్టాన్ని లోక్‌సభ ఆమోదించింది. 2021లో సరోగసీ (నియంత్రణ) చట్టం ఆమోదం పొందింది. అంతవరకు భారతదేశం ప్రముఖ సరోగసీ గమ్యస్థానంగా ఉండేది. అనైతిక విధానాలు సాగేవి. అద్దె తల్లుల ఒప్పందాలు తక్కువ ఖర్చుతో సులువుగా జరిగేవి. విదేశాల్లో ఉండే సంతాన యోగం లేని వారు భారత దేశానికి వచ్చి అద్దె తల్లుల ద్వారా సంతానాన్ని సులువుగా పొందగలిగే వారు. 2009లో గుజరాత్‌లో 45 మంది సరోగసీ తల్లులను అధ్యయనం చేయగా, సంతానం పొందాలనుకున్న తల్లిదండ్రుల్లో 41% మంది విదేశాల నుంచి వచ్చారని తేలింది. అద్దె తల్లులు కావాలనుకునే మహిళలు తాము తీసుకునే రిస్కుకు తగినట్టు పారితోషికం చెల్లించాలన్న డిమాండ్ ఆయా కుటుంబాల నుంచి ఎక్కువగా తెరపైకి వచ్చింది.

## బాసర శ్రీ నాగభూషణ విద్యాలయం లో ఘనంగా అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం




బాసర డిసెంబర్ 21 ( వుదయం ప్రతినిధి) బాసర మండల కేంద్రంలోని స్థానిక శ్రీ నాగభూషణ విద్యాలయంలో శనివారం అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాబురావు మాట్లాడుతూ ద్యానం చేయడం అనేది మంచి అలవాటు అన్నారు. విద్యార్దులు నిత్యం ధ్యాన సాధన చేయడం ద్వారా జ్ఞాపక శక్తి, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జే బాబురావు, వైస్ ప్రిన్సిపాల్ సులోచన, యోగ గురువు మల్లేష్ మరియు ఉపాధ్యాయులు సందీప్, చరణ్ మరియు విద్యార్దులు పాల్గొన్నారు.

## సృజన కారులు సమాజానికి చూపునివ్వాలి!

### శ్రీ వారాల ఆనంద్ రచించిన 'కరచాలనం పుస్తకావిష్కరణ

కరీంనగర్ (వుదయం ప్రతినిధి): కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ %డ% సైన్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత, కవి, రచయిత శ్రీ వారాల ఆనంద్ రచించిన 'కరచాలనం' కళాశాల ప్రాంగణంలో పుస్తకావిష్కరణ జరిగింది. రిటైర్డ్ ఆర్ జె డి మరియు విద్యావేత్త శ్రీ బి. రామచంద్ర రావు పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో విలువలు నశించిపోతున్నాయని, సామాజిక స్పృహ కొరవడిందని, దానిని మార్చగలిగేది కవులు రచయితలేనని అన్నారు. కవులు రచయితలు సమాజానికి దిశా నిర్దేశం చేయాలని అన్నారు. పుస్తక రచయిత వారాల ఆనంద్ మాట్లాడుతూ తన మొదటి సాహిత్య ప్రయాణం కళాశాలలోని విశ్వనాథ కళామందిరంతో మొదలైందని, ఆ సాహిత్య నేపథ్యమే తనలో ఉత్తమ కళాసృజనలో భాగమవడానికి ప్రేరణ కలిగించిందని అన్నారు. కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ ఉత్తమ సాహితీవేత్తలను, బహుముఖీన ప్రజ్ఞ గలిగిన కళావేత్తలను వారాల ఆనంద్ తన కరచాలనం పుస్తకంలో పరిచయం చేశారని, ఇది సాహితీవేత్తలకు మార్గదర్శనం చేస్తుందని అన్నారు. పుస్తక సమీక్ష చేసిన పుల్లూరి జగదీశ్వర్ మాట్లాడుతూ భారతదేశంలో సినీ సాహిత్య రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తుల విలువైన కృషిని తెలుగు సాహిత్యానికి అందించి వారాల ఆనంద్ కొత్త బాట వేశారని అన్నారు. డా. గండ్ర లక్ష్మణరావు గారు మాట్లాడుతూ సాహిత్య అధ్యయనం ఆవశ్యకతను తెలుపుతూ, అనువాద రంగంలో వారాల ఆనంద్ గారి కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ ప్రధాన ఆచార్యులు డా. కోట మురళి గారు మాట్లాడుతూ కవులు రచయితలు కలకాలం తమ రచనల చేత జీవించి ఉంటారని అన్నారు. ప్రముఖ కవి జూకంటి జగన్నాథం మాట్లాడుతూ కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలని, పొరుగున ఏం జరుగుతుందో తెలుసుకోవాలని, అనువాదాల ద్వారా వారాల ఆనంద్ ఆ పని చేశారని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ గారు అభినందనలు తెలియజేశారు. అనంతరం రచయిత ఆనంద్ తన కరచాలనం పుస్తకాన్ని, వారి బంధువులు శ్రీమతి%డ% శ్రీ వెంకటరమణ, మెట్టు సుగంధర్ రావులకు అంకితం చేశారు. కళాశాల ప్రధానాచార్యులు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు డా. బూర్ల చంద్రశేఖర్, వారాల ఆనంద్ సతీమణి ఇందిర మరియు వారి బంధువులతో పాటు అధ్యాపకులు బూర్ల వెంకటేశ్వర్లు, డా. డి.ప్రకాష్, మెట్టు వెంకటేశ్వర్లు డా.పాత అశోక్, డా. పురస్తుల అనిల్, డా. తాటికాయల భోజన్న, డా. పి. చైతన్య, డా. మీసాల మల్లారెడ్డి, డా. సోమనర్సయ్య, డా.వంగల శ్రీనివాస్, సత్య ప్రకాష్, ఆసంపల్లి నాగరాజ్ ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## బాసరలో శోభాయమానంగా పాప హరేష్వరుని విగ్రహ శోభాయాత్ర

ఆలయంలో కొలువుదీరిన పున ప్రతిష్టాపన దేవతల ఉత్సవ విగ్రహాలు భక్తి పారవశ్యం లో నిమగ్నమైన బాసర.



బాసర డిసెంబర్ 21 ( వుదయం ప్రతినిధి) నిర్మల్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలోని శ్రీ పాపహరేశ్వర ఆలయ శిఖర,ఉత్సవ విగ్రహ పున : ప్రతిష్టాపన మహోత్సవాలు మొదటిరోజు వేద మంత్రోచ్ఛరణాల మధ్య వైదిక బృందం ఆధ్వర్యంలో శనివారం అంగరంగ వైభవంగా విశేష పూజలతో జరిగాయి. ఆలయంలో గణపతి,సంతాన నాగేంద్రుడు, అన్నపూర్ణ,నందీశ్వరుడు, కాలభైరవుడు,వీరభద్రుడు, బలిపీఠాలు,నవగ్రహలు,ధ్వజ శిఖర ప్రతిష్టాపన వంటి దేవత ఉత్సవమూర్తులకు గోదావరి నీటి జలాలతో అభిషేకం,అర్చన చేసిన అనంతరం స్వామివారికి సాంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం శివుడికిరుద్రాభిషేకం,బిల్వర్చన,చండీ హెూమం,వంటి విశేష పూజలను నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఏడు గంటలకు బస్టాండ్ నుండి గ్రామ వీధుల గుండా ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో గ్రామస్తులు,కమిటీ నిర్వాహకులు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయంలో విగ్రహ పునప్రతిష్టాపన సందర్భంగా గ్రామ మహిళ లు ముత్తైదువులు చిన్నారులు అందరూ హాజరై హారతి ప్లేట్లతోవచ్చి గ్రామ దేవతలకు ఘనంగా స్వాగతం పలికారు.

## ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్,నర్సరీ పరిశీలన.



ధర్మసాగర్ డిసెంబర్21(వుదయం ప్రతినిధి): ఈ రోజు ఎల్కుర్తి గ్రామంలో డిఆర్డిఓ మేన శ్రీను మరియు ఎంపీడీవో ఇందిరమ్మ ఇండ్లు మొబైల్ యాప్ సర్వే పనిని ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. అనంతరం నర్సరీ నీ పరిశీలించడం జరిగింది. త్వరగా పనులు పూర్తి చేసి జూలై లో మొక్కలను పంపిణీ చేయుటకు సిద్ధం చేయాలని అదేశించటం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ కుమార్, ఏపీవో సంపత్, పంచాయతీ కార్యదర్శి భీమరాజు, టిఏ మధుకర్, కర్నాకర్ ఎఫ్ఎ కవిత పాల్గొన్నారు.

## భువనగిరి అయ్యప్పస్వామి దేవాలయంలో పంబ ఆరట్టు

- ముఖ్య అతిథి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హన్మంత రావు
- వందల సంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు "
- భువనగిరి పట్టణం అయ్యప్ప నామస్మరణతో హెూరెత్తిన జన సముద్రం

నృత్యకళాకారుల విన్యాసం పులకరించిన భక్త జనం



యాదాద్రి భువనగిరి / డిసెంబర్ వుదయం ప్రతినిధి : శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం పంబా ఆరట్టు మహెూత్సవం సందర్భంగా భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం హనుమంతరావు, మరియు మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది. వ్యవస్థాపక చైర్మన్ అయిత రాములు, అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు ల ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ సి. వెంకటేష్ శర్మ గురు స్వామి ప్రధాన తాంత్రి వర్యులు వారి ఆధ్వర్యంలో మరియు ఆర్. నరేంద్ర శర్మ, ఘనంగా వారి ఆధ్వర్యంలో పంబా ఆరట్టు మహెూత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ శ్రీమతి కల్వ సుజాత గుప్తా పాల్గొన్నారు. భువనగిరి మున్సిపల్ కమిషనర్ రామా%శీ%జుల రెడ్డి , భువనగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, కౌన్సిలర్ ఈరపాక నర్సింహ, మరియు ఎనబోయిన ఆంజనేయులు, ఏవి కిరణ్, పుర ప్రముఖులు,పాల్గొన్నారు. శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహంతో హనుమాన్ వాడ లక్ష్మీనారాయణ దేవాలయం నుండి భువనగిరి పురవీరుల పురవీధుల గుండా ఊరేగింపు చేసి భువనగిరి పెద్ద చెరువులో అఖండనవాభిషేకములు అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. మరియు వస్త్రాలంకరణ పుష్పాలంకరణ, అర్చన,అన్న ప్రసాదము, చేయడం జరిగింది.మరియు సేనాధిపతిగా ఉపేందర్ గురుస్వామి, మరియు %చీఎణ% గురు స్వామి,ఇట్టి కార్యక్రమంలో మాజీ చైర్మన్లు మంచాల ప్రభాకర్, మరియు బెల్దే వెంకటేష్, వనుపు నూరి నాగభూషణం,దిడ్డి నత్యం గురుస్వామి, చీకటిమల్ల రాములు గురు స్వామి, పాలకుర్తి వేణుమాధవ్, కొడిత్యాల నాగరాజు,తన్నీరు శ్రీను స్వామి, అల్లే నరేష్ స్వామి, అయిత శ్రీనివాస్, చింత రవి,చందా మహేందర్ గుప్తా గాదె శ్రీనివాస్, మంచాల రిషికేష్, చామ రవీందర్ జిల్లా వెంకటరమణ, చామ నాగేందర్, పోల శ్రీనివాస, బచ్చు నరేందర్, పొద్దుటూరి నాగేందర్, మంచి కంటి రవికుమార్ పసూపు నూరి మనోహర్, సిద్ధ గొని సుధాకర్ గౌడ్, ఎంపల్లి బుచ్చి రెడ్డి, నరసింహ చారి, మార్తా వెంకటేశం మంచుకొండ వినోద్, రావుల శ్రీధర్, పోకల సోమన్న, సుగ్గుల చంద్రశేఖర్, ఇరుకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేయాలి

### అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి.



పరకాల డిసెంబర్ 21 (వుదయం ప్రతినిధి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న తీరును హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రజా పాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల ప్రకారం గ్రామ పంచాయతీ లో సమర్పించిన దరఖాస్తులు పంచాయతీ కార్యదర్శులు సర్వే చేస్తున్న తీరును అదనపు కలెక్టర్ అడిగి తెలుసున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో స్వీకరించిన అన్ని దరఖాస్తు సర్వే చేయడం జరుగుతుంది అని ఎవరైనా దరఖాస్తు చేసుకోకుంటే వారు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి డాక్టర్ కె నారాయణ తహసీల్దార్ శైలజ పంచాయతీ కార్యదర్శి రిజ్వానా ఇందిరమ్మ కమిటీ సభ్యులు వెంట ఉన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా పిల్లుట్ల శ్రీనివాస్ నియామకం

**నియామక పత్రం అందజేసిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య...**



కోదాడ టౌన్ డిసెంబర్ 21(వుదయం)బీసీ కులాల హక్కుల కోసం కోదాడ పట్టణాన్ని వేదికగా చేసుకొని జిల్లా వ్యాప్తంగా అనేక పోరాటాలు చేసిన పిల్లుట్ల శ్రీనివాస్ సేవలను గుర్తించి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య పిలుట్ల శ్రీనివాస్ ను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం పిల్లుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కోఆర్డినేటర్ గా బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. గత కొన్ని ఏండ్లుగా తన జీవితాన్ని బీసీ కులాల హక్కుల కోసం ఆర్ కృష్ణయ్య అలుపెరగని పోరాటం చేస్తున్నారని,బీసీల సమస్యలపై ఆర్.కృష్ణయ్య పిలుపుతో ఏ ఉద్యమానికైనా సిద్ధం అన్నారు. రాజ్యధికారంలో వాటా కన్నా చట్టసభల్లో బీసీలకు 50 శాతం ఇవ్వాలని, కానీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బడుగులకు 21 సీట్లు మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. ఆర్ కృష్ణయ్య ఆదేశాలతో చట్టసభల్లో 50 శాతం వాటా కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని, గ్రామ, మండల, జిల్లా కమిటీలు వేసి బీసీ సంఘాలను మరింత పటిష్టం చేస్తామని పిల్లుట్ల శ్రీనివాస్ తెలిపారు.

## యువ నేతాజీ ఫౌండేషన్ అద్వర్యంలో అన్నదాన కార్యక్రమం



వరంగల్ (వుదయం ప్రతినిధి) డిసెంబరు 21 : వరంగల్ యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్ కు చెందిన ఐలోని శ్రేయాన్ పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు ఐలోని రాము-మమత దంపతులు సోదరుడు ఐలోని త్రిశాంక్ తాతయ్య నానమ్మలు కీ.శే. ఐలోని లింగమూర్తి-కొమరమ్మ సహకారంతో స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమం, ములుగు రోడ్డు, హనుమకొండ లో ఉన్న వృద్ధులకు 365వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐలోని రాము, ఐలోని మమత, ఐలోని శ్రేయాన్, ఐలోని త్రిశాంక్, ఐలోని కొమరమ్మ, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, కోలా రాజేష్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, అలువల పృథ్వి, ఉప్పరపల్లి రాజ్ కుమార్, మునిగాల రాంప్రసాద్, ఊరటి రవికుమార్, సృజన, జ్యోతి, భావన, బిటుకూరి యాకయ్య, పాలకుర్తి విష్ణు, ఎస్.కె ముస్తఫా, లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ (హైకోర్ట్ అడ్వకేట్), యాద రవి కుమార్, చెలిమల్ల అశోక్ కుమార్, తూనం రాము, సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్, మోడెం రాజశేఖర్ గౌడ్, నాగవెళ్ళి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్గా తమలపాకుల సైదులు



కోదాడ టౌన్ డిసెంబర్ 21(వుదయం) కోదాడ పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన ప్రపంచ రికార్డు గ్రహీత సూక్ష్మ కళాకారుడు తమలపాకుల సైదులు ను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ సూర్యాపేట జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ గా నియమిస్తూ ఆ సంస్థ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ చింతపట్ల వెంకటాచారి నియామక పత్రాన్ని పంపినట్లు సైదులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ మంది కళాకారులను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో పేరు నమోదు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తానని, తనను జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ గా నియమించినందుకు సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ చింతపట్ల వెంకటాచారి కి కృతజ్ఞతలు తెలిపారు.

## బయ్యారం మండలానికి చెందిన కల్పనాదేవికి డాక్టరేట్.



బయ్యారం డిసెంబర్21(వుదయం ప్రతినిధి): కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ విభాగ పరిశోధక విద్యార్థిని గంగావత్.కల్పనా దేవి కి విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కట్ల రాజేందర్ డాక్టరేట్ ప్రకటించినట్లు శనివారం తెలిపారు.డాక్టర్ జి.కల్పనా దేవి "డెవలప్ మెంట్ ఆఫ్ న్యూ ఆక్సిజన్ అండ్ నైట్రోజన్ కంటయినింగ్ హెటిరోసైక్లిక్ కాంపౌండ్స్ ఫర్ యాంటి ఇనమేటరీ యాక్టివిటి" అనే అంశంపై విశ్రాంత ఆచార్యులు ఎ.సారంగపాణి పర్యవేక్షణలో పిహెచ్ డి పూర్తి చేశారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లికి చెందిన డాక్టర్ జి. కల్పనా దేవి ని తల్లిదండ్రులు గంగావత్ కాంతి ,నాగ్యానాయక్ కష్టపడి స్కూల్ స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ప్రభుత్వ స్కూల్స్,కాలేజిల్లో చదివించినట్లు తెలిపారు. డాక్టరేట్ సాధించిన కల్పనా దేవి ని పలువురు బోధనా,బోధనే తర సిబ్బంది, పరిశోధకులు,విద్యార్థులు,గ్రామస్థులు,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి భూక్యా ప్రవీణ్ నాయక్, తదితరులు అభినందించారు.

# రుణమాఫీ కాలేదంటే రాజీనామాకు సిద్ధం

## : నిరూపిస్తే కేటీఆర్ రాజీనామా చేయాలి



పెద్దపల్లి జిల్లా డిసెంబర్, 21, (వుదయం) ప్రతినిధి:పెద్దపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులను రుణమాఫీ పేరిట మోసం చేశారని, నాలుగు విడతల్లో రూ. 1లక్ష రుణమాఫీ వడ్డీలకే సరిపోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును ఎండగడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే రైతులకు మేలు చేయగలదని చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్ పై సవాల్ విసిరిన ఆయన, పెద్దపల్లి నియోజకవర్గంలో 90 శాతం రుణమాఫీ పూర్తి చేసినట్లు నిరూపిస్తానని, చేయకపోతే తాను రాజీనామా చేస్తానని ప్రకటించారు. మరోవైపు నిరూపించలేకపోతే కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కలేశ్వరం ప్రాజెక్టు వల్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైతులు నష్టపోయారని, ప్రాజెక్టు త్వరగా కూలిపోయి లక్షల కోట్లు వృథా అయ్యాయని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్లతో కుమ్మక్కయిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని విమర్శించారు.

# ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు.



పరకాల డిసెంబర్ 21 (వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల పథకాలలో భాగంగా ఇందిరమ్మ రాజ్యం - ఇంటింటి సౌభాగ్యం అనే రీతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో నిరుపేదలను గుర్తించి, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే లక్ష్యంగా చేసుకొని, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ ఆదేశాల మేరకు నేడు 14వ వార్డులో 245 దరఖాస్తు రాగా వాటిని ఇంటింటి సర్వేలో మొత్తం పరులైన ప్రతి ఇంటిని పరిశీలించి పూర్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వార్డ్ ఆఫీసర్ రమాదేవి తో పాటు పరకాల పట్టణ మాజీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అలీ, ఎండి అమీనా, కొక్కిరాల స్వాతి,ఆకుల అశోక్, సిఏ రుక్మిణి వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# అమిత్ షా ను మంత్రి మండలి నుండి బర్తరఫ్ చేయాలి

బెల్లంపల్లి, డిసెంబరు21( వుదయం ప్రతినిధి) అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వాక్యాలు యావత్ భారత దేశ ప్రజలను దళితులను కించపరిచేలా ఉన్నాయని సిఐటియు మంచిర్యాల జిల్లా కార్యదర్శి దాగం రాజారాం ఆరోపించారు. శనివారం తాండూరు మండలం ఐబీలో అమిషా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నదని, వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లును తీసుకొచ్చి రాజ్యాంగాన్ని తమ చేతుల్లోకి తెచ్చుకునేలా బిజెపి ప్రయత్నం చేయడం సిగ్గు చేటని అన్నారు. అంబెద్కర్




ను కించపరిచేలాగా అమిత్ షా చేసిన వాక్యాలను దేశ ప్రజలందరూ గమనిస్తున్నారు. అంబేద్కర్ అంటే ఎంత చిన్నచూపు ఉందో అమిత్ షా వాక్యాలతోనే అర్థమవుతుంది. అమిత్ షా ను మంత్రి మండల్ నుండి బర్తరాఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ చూపిన మార్గంలో అందరం నడవాలని కోరారు. కార్యక్రమంలోసత్యవతి, కె. విజయలక్ష్మి, లీలారాణి, ఎం. విజయలక్ష్మి, సుజాత, విజయ, రాజేశ్వరి, సరిత, తిరుమలేశ్వరి, ఎం. లక్ష్మి, బొల్లం రాజేశం, దుర్గం నాన్నయ్య, కార్మికులు పాల్గొన్నారు.

## ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావి శ్రీనివాస రామానుజన్.

## కాసిపేట మోడల్ స్కూల్ లో ఘనంగా జాతీయ గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలు





కాసిపేట డిసెంబర్ 21 (వుదయం విలేకరి)మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. డిసెంబర్ 22 శ్రీనివాస రామానుజన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని, శనివారం పాఠశాలలో గణిత రంగోలీ, గణిత శాస్త్ర మేళా, చిత్రలేఖనం,ఉపాన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన గణిత నమూనాలు రంగోళి అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర స్వామి హాజరయ్యారు. మండల విద్యాశాఖాధికారి ప్రిన్సిపాల్, విద్యార్థులకు శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలను వివరించారు. రామానుజన్ కృషితో ఎన్నో రకాల కార్యకలాపాలకు గణిత శాస్త్రం మూలమైందన్నారు. ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావుల లో ఒకరని, అప్పట్లో ఇక పరిష్కారం కావు అనుకున్న సమస్యలకు కూడా పరిష్కారం కనుగొన్నాడన్నారు. రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థులు బాగా చదివి మేధావులుగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, గణిత శాస్త్ర అధ్యాపకులు సంయుక్త, భాగ్యశ్రీ, రవిందర్, ఉపాధ్యాయులు నాగ మల్లయ్య, ప్రవీణ్, శ్రీవర్ధన్, సుష్మా మాధురి, చైతన్య స్రవంతి, అనిత, మల్లేష్ మహేశ్వరి, రేణుక, పద్మజ, అశోక్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు



యాదాద్రి భువనగిరి / తుర్కపల్లి : డిసెంబర్ 21 ( వుదయం ప్రతినిధి) :శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామ పరిధిలోని విశ్వభారత్ గ్లోబల్ స్కూల్లో శనివారం గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా అరుంధతి విద్యాలయాల గ్రూప్ డైరెక్టర్ ప్రతిమ మాట్లాడుతూ గణితం లేనిది జీవితం లేదని జననం నుండి మరణం వరకు ప్రతి అంశం గణితంతో ముడిపడి ఉంటుందని అన్నారు. గణిత ఉపాధ్యాయురాలు రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులందరూ గణితం పై పట్టు సాధిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలు అవలీలంగా అధిరోహించవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులు, గణిత చిహ్నాలతో అలంకరించిన పలు ఆకృతులు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశ్వర ప్రసాద్, ఉపాధ్యాయులు సంతోషి, రాధా, శైలజ ,కల్పనా, శిరీష ,లావణ్య జికియ ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# మేయర్ ను కలిసిన ఇందిరమ్మ కాలనీ వాసులు...



కుత్బుల్లాపూర్, డిసెంబర్ 21,(వుదయం ప్రతినిధి ),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డిని, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డిని, సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్, తలారి సాయి ముదిరాజ్ లతో డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ,అంబేద్కర్ యువజన సంఘం 13వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 1 వాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయగలరని కోరారు. మేయర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి ఎల్లపుడూ కృషి చేస్తామని తెలియజేశారు.

# ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని వినతి



వరంగల్, డిసెంబర్ 21,వుదయం ప్రతినిధి: నర్సంపేట డివిజన్ పరిధిలోని సంక్షేమ వసతి గృహాల్లో మరియు గురుకుల పాఠశాలలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని ఏ బి ఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ జిల్లా వైద్యా రోగ్య శాఖ అధికారి సాంబశివ రావుకు వినతి పత్రం అందజేశారు. చలికాలం మూలంగా వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు జలుబు,దగ్గు,జ్వరం తదితర ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని వాటి పట్ల అవగాహన కల్పిస్తూ ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని నరేష్ వినతి పత్రం లో కోరారు. ఆరోగ్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా విముక్తి కల్పించాలని కోరారు.

# విద్యార్థులు గణితంపై ఆసక్తిని పెంపొందించుకోవాలి...

## : డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్




కుత్బుల్లాపూర్, డిసెంబర్ 21,(వుదయం ప్రతినిధి ),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ ముఖ్య అతిధులుగా నిజాంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన మ్యాథ్స్ మేళాలో పాల్గొన్నారు. మొదటిగా విద్యార్థులు గణిత శాస్త్రనికి సంబంధించిన వివిధ పరికరాలను తయారు చేసి మేళాలో ప్రదర్శించారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే గణితంపై ఆసక్తి కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థి దశ నుంచే గణితంపై దృష్టి సారించి బాల మేధావులుగా ఎదగాలని కోరారు. గణిత శాస్త్రం మానవ, సామాజిక అభివృద్ధిలో ఎంతో ప్రాముఖ్యత కలదని, గణితం లేకుండా మానవ ప్రగతిని, అభివృద్ధిని ఊహించలేమని తెలుపుతూ విద్యార్థినులు తయారు చేసిన కళ కృతులను తిలకించారు. అనంతరం క్విజ్, రంగోలి, గణిత నమూనాలా ప్రదర్శన వంటి వాటిలో నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు రఘునాథ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన ఎండిపోయిన చెట్టు



శంకరపట్నం డిసెంబర్ 21 వుదయం ప్రతినిధి రోడ్డు కు ప్రక్కనే ఎండిపోయిన భారీ వృక్షం ఎప్పుడు కూలి ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారి పక్కనే ఎండిపోయిన చెట్టు ప్రమాదకరంగా ఉన్న ఎవరు పట్టించుకోవడం లేదు. ఆ చెట్టు ఎప్పుడూకూలిపోతుందోనని వాహనదారులు వాపోతున్నారు. కేశవపట్నం మహాలక్ష్మి మహా మార్ట్ ఎదురుగా ఎండిపోయిన చెట్టు కొమ్మలు గాలులకు విరిగి వచ్చిపోయే వాహనదారుల మీద పడే అవకాశం ఉందని ఆర్అండ్ బి,గ్రామ పంచాయితీ అధికారులు గుర్తించి తొలగించడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు వాహనదారుల ఆరోపణ. ఇప్పటికైనా త్వరగా అధికారులు స్పందించి రోడ్డు వెంట ఇరువైపులా ఉన్న ఎండిపోయినట్లు గుర్తించి తొలగించాలని వాహనాలపై వెళ్లే ప్రయాణికులు కోరారు.

# విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

## -ఊషన్నపల్లి పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం







పెద్దపల్లి జిల్లా: డిసెంబర్, 21, (వుదయం) ప్రతినిధి: కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామపంచాయతీ ఊషన్నపల్లిలోని ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు ఉదయాన్నే ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల వేషధారణలో పాఠశాలకు వచ్చి, వారికి నిర్దేశించిన పాఠాలను చక్కగా బోధించారు. ఎల్కేజీ నుంచి ఆరు తరగతులకు సంబంధించిన తెలుగు, ఆంగ్లం, గణితం, పరికరాల విజ్ఞాన సబ్జెక్టులను చక్కగా బోధించారు. పిల్లలు పాఠ్యాంశాలను బోధిస్తుండగా, హెచ్ఎం ఈర్ల సమ్మయ్య ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్ లు పర్యవేక్షించారు. తాము ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులుగా వ్యవహరించామనే ఆనందంతో పాఠశాల పిల్లలు ఎగిరి గంతులేశారు. భవిష్యత్తులో బాగా చదువుకుని పెరిగి, పెద్దయ్యాక టీచర్ల మవుతామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. స్వయంపాలన కార్యక్రమానికి ముందు పాఠశాలలో హెచ్ఎం ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. తరువాత పిల్లలు తయారుచేసిన గణితం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టిఎల్ఎం) ప్రదర్శించారు. మధ్యాహ్నం భోజన విరామానంతరం పాఠశాలలో పనిచేసి, బదిలీపై వెళ్లిన పి. మల్లేష్ అనే టీచర్లను హెచ్ఎం ఈర్ల సమ్మయ్య, అమృత సురేష్ కుమార్, పిల్లలందరూ కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్, పి.మల్లేష్, పిల్లలు, పలువురు పాల్గొన్నారు.

# అద్భుతంగా షైన్ హై స్కూల్లో సాక్షర్ - ఆస్పైర్ టు గ్రో ప్రోగ్రామ్





వరంగల్ వెస్ట్ డిసెంబర్ 21 (వుదయం విలేఖరి):షైన్ స్కూల్, శివనగర్, ఈరోజు ఎంతో ఉత్సాహంగా సాక్షర్ – ఆస్పైర్ టు గ్రో ప్రోగ్రామ్ను నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు వారి సృజనాత్మకతను,విద్యా నైపుణ్యాలను ప్రదర్శించడానికి గొప్ప వేదికగా నిలిచింది. షైన్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఛైర్మన్ ముగల కుమార్ మాట్లాడుతూ,"నేటి బాలలే రేపటి సమాజానికి పునాదులు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిగత మరియు సామాజిక నైపుణ్యాలను పెంపొందించేందుకు తోడ్పడతాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం విద్యార్థుల విజయానికి అత్యంత అవసరం." అని వివరించారు. షైన్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ కరస్పాండెంట్మ రమ మాట్లాడుతూ పిల్లల్లోని ప్రతిభను వెలికి తీయడానికి వాళ్ళ యొక్క భావాలను అర్థం చేసుకొని వాళ్ళ నైపుణ్యాన్ని గ్రహించి అర్థం చేసుకొని రూపు రూపుదిద్దించిన ఉపాధ్యాయులు , ప్రిన్సిపాల్ వేదం నీ అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాఠ్యసంబంధిత ప్రాజెక్టులను ప్రదర్శిస్తూ, తరగతి గది జ్ఞానాన్ని వాస్తవ ప్రపంచ పరిణామాలకు అన్వయించగల వినూత్న మార్గాలను చూపించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సమాజ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై, విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్నారు.

షైన్ స్కూల్ ప్రిన్సిపాల్ మానస మాట్లాడుతూ,"ఈ కార్యక్రమం విద్యార్థులకు పాఠ్యపుస్తకానికి మించి వారి విద్యాపరమైన ఆసక్తులను అన్వేషించడానికి అద్భుతమైన అవకాశాన్ని అందించింది. వారి సృజనాత్మకతను మరియు ఉత్సాహాన్ని చూడటం ఎంతో స్ఫూర్తిదాయకం." అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో , విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,కమ్యూనిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు చెక్కుల పంపిణీ



పెద్దవంగర, డిసెంబర్ 21 (వుదయం ప్రతినిధి):రాష్ట్రంలోని భూ నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. పోచంపల్లి లో 250 మంది దేవాదుల భూ నిర్వాసితులకు మంజూరైన రూ. 11.40 కోట్ల చెక్కులను తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి, మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ తో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె తొర్రూరు ఆర్డీవో గణేష్ కలిసి మాట్లాడుతూ.. దేవాదుల కాలువ నిర్మాణం (6) కోసం గంట్లకుంట, పోచంపల్లి రైతులు 30 ఎకరాల భూమి ఇవ్వడం గొప్ప విషయం అన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఆందోళన చెందవద్దని, కేవలం నష్టపరిహారం చెల్లించడమే కాకుండా, వారికి జీవనోపాధి కల్పించడానికి ప్రత్యేక చొరవ చూపుతానని అన్నారు. గత ప్రభుత్వం భూ నిర్వాసితులను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. ప్రాజెక్టులు, కాలువల వల్ల నష్టపోయిన భూ నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని పేర్కొన్నారు. నష్టపరిహారం చెల్లించడం తో పాటు రైతులకు పునరావాస కల్పనకు కృషి చేస్తానని అన్నారు. రైతాంగాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదుకుంటుందని వ్యాఖ్యానించారు . పాలకుర్తి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్ తీర్చిదిద్దుతానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కాగా మొత్తం 110 మంది రైతులకు గాను 89 మంది భూ నిర్వాసితులకు ఎమ్మెల్యే నష్టపరిహారం చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో దేవాదుల ప్రాజెక్టు ఈఈ సీతారాం నాయక్, డీఈ కిషన్ ప్రసాద్, ఏఈ కిషోర్, ఎంపీడీవో వేణుమాధవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యా నాయక్, ధరావత్ సురేష్ నాయక్, సుంచు సంతోష్, సీనియర్ నాయకులు గంజి విజయ్ పాల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రంగు మురళి, డైరెక్టర్లు మదన్ మోహన్ రెడ్డి, ముత్యాల పూర్ణచందర్, బానోత్ గోపాల్ నాయక్, బానోత్ శేఖర్, గ్రామ పార్టీ అధ్యక్షులు రాసాల ప్రభాకర్, రాజు, సోము నాయక్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# నలుగురు న్యాయవాదులతో కోర్టు తరలింపు కుట్ర: గద్వాల్ ఎమ్మెల్యేపై ప్రజా ఆగ్రహంలి



(గద్వాల డిసెంబర్ 21 వుదయం ప్రతినిధి): గద్వాల పట్టణంలో కోర్టు తరలింపుపై చర్చ జరుగుతున్న సమయంలో నలుగురు అనుకూల న్యాయవాదులను అడ్డం పెట్టుకుని కోర్టును పూడూర్ శివారుకు తరలించేందుకు గద్వాల ఎమ్మెల్యే ప్రయత్నాలు చేయడం ప్రజలలో తీవ్ర ఆగ్రహం రేకెత్తిస్తోంది. గద్వాల పట్టణ కోర్టును పూడూర్ శివారుకు తరలించేందుకు గద్వాల ఎమ్మెల్యే చేస్తున్న ప్రయత్నాలు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాయి. నలుగురు అనుకూల న్యాయవాదులను అడ్డం పెట్టుకుని, కోర్టు తరలింపునకు మద్దతు ఇవ్వడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యగా మారింది. పట్టణంలో ఎస్పీ కార్యాలయం ఇతర ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతుంటే, కోర్టు తరలించాల్సిన అవసరం ఏమిటి? ఈ నిర్ణయం వెనుక భూమి వ్యాపారాలు, స్వార్థ రాజకీయ ప్రయోజనాలు దాగున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ ప్రజల న్యాయసేవలను దూరం చేయడం ప్రజా వ్యతిరేక చర్య. కోర్టు శివారుకు వెళ్లితే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతుంది అని బారాస నేత రంగం జయపాల్ రెడ్డి విమర్శించారు నలుగురు న్యాయవాదుల మాటలకు బదులు లక్షల ప్రజల అభిప్రాయాన్ని వినాలి అని ఎమ్మెల్యేపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గద్వాల ప్రజలు ఈ కుట్రలను తిప్పికొట్టి కోర్టు పట్టణంలోనే కొనసాగించేందుకు పోరాటం చేయాలి అని జోగులాంబ గద్వాల జిల్లా టిఆర్ఎస్ నేత రంగం జయపాల్ రెడ్డి ప్రజలకు పిలుపు ఇచ్చారు.

# బ్యాంకు సేవలపై స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన



నిజాంసాగర్, డిసెంబర్ 21 (వుదయం ప్రతినిధి): నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో శనివారం ఆర్థిక అక్షరాస్యత కేంద్రం బాన్సువాడ, స్వచ్ఛంద సేవా సంస్థ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్(%యూ%) ఆధ్వర్యంలో పొదుపు ఏ విధంగా చేసుకోవాలి, బ్యాంకుల పైన, బ్యాంకు లలో అందించే సేవల గురించి వారు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా సైబర్ నేరాల పై అవగాహన కల్పిస్తూ మీకు ఫోన్ గాని మెసేజ్ రూపంలో లింక్ లు పంపించినట్లయితే వాటిని క్లిక్ చేయరాదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు అడిగే మీ బ్యాంకు సమాచారాన్ని ఎవరికీ తెలుపరాదని పేర్కొన్నారు. ఏటీఎం మెషిన్ వినియోగించే విధానం మరియు ఏటీఎం కార్డు దాని ఉపయోగాలు తదితరుల పూర్తి సమాచారాన్ని ప్రజలకు తెలియజేశారు. ఏటీఎం వాడడం వల్ల ఉపయోగాలు, డిజిటల్ పేమెంట్స్, భీమా పథకాలు సుకన్య సమృద్ధి యోజన తదితర బీమా పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. బ్యాంకు సేవలను వినియోగించుకుని ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్, కౌన్సిలర్స్ బాలకృష్ణ, పర్వయ్య, అనుదీప్, రైట్ బ్యాంక్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# పీవీకే 5గనిలో ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం డిసెంబర్ 21 (వుదయం ప్రతినిధి): క్రిస్టియన్ సోదరుల ఆధ్వర్యంలో జరిగినవి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏజెంట్ రవీందర్, మేనేజర్ శ్యామ్ ప్రసాద్, ఐ ఎన్ టీ యు సి వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, ముఖ్య ప్రసంగికులుగా సామ్యూల్ సుధాకర్ హాజరైనారు. వక్తలు మాట్లాడుతూ యేసు క్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా పి వి కే మైనందు సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కొత్తగూడెం లోఇది గొప్ప సాంప్రదాయం ఎందుకు అనగా అందరు కార్మికులు దసరా, రంజాన్, క్రిస్మస్ పండగల సందర్భంగా సమిష్టి కృషితో సంతోషంగా పాలుపంచుకొని, భిన్నత్వంలో ఏకత్వం లాగా భారతదేశ సంప్రదాయాన్ని అద్దం పట్టేలాగా ఉంటుందని, మ్యాన్ రైడింగ్ నందు మొదటి బహుమతి రావడానికి కృషిచేసిన కార్మికులు సూపర్వైజర్లు అధికారులను అభినందిస్తూ, రాబోయే కాలంలో ఇదేస్ఫూర్తిని కనపరచాలని, అందరికీ మంచి జరగాలని, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

అదేవిదంగా ఐ ఎన్ టీ యు సి నుండి చిలక రాజయ్య, ఏ ఐ టీ యు సి నుండి సాయి పవన్, హెచ్ ఎం ఎస్ నుండి ఆసిఫ్, అధికారులు సేఫ్టీ ఆఫీసర్ కిషోర్, పిట్ ఇంజనీర్ శ్రీనివాస్, సురేష్, తదితరులు హాజరైనారు. అదేవిదంగా ఈ కార్యక్రమ నిర్వాకులు సైమన్, మోహన్, విజయకుమార్, సాహుల్, బెనిడ్రిక్ శామ్యూల్, సంతోష్, శ్యామ్, కుమార్, ప్రేమ్, జోసెఫ్, రవి, రమేష్ తదితరులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి నిర్వహించడం జరిగినది.

# దళిత సంఘాలు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో.. హెూం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం



(వుదయంప్రతినిది) కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ పై కేంద్ర కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పార్లమెంటులో చేసిన అనుచిత వ్యాఖ్యలపై జాతికి క్షమాపణ చెప్పాలని కేంద్ర హెూంమంత్రిని తన మంత్రి వర్గం నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మరియు దళిత సంఘ ల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బిచ్కుంద మండల కేద్రం లో అమిత్ షా దిష్టి బొమ్మ దహనం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ సాక్షి గా అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా ను మంత్రి పదవి నుండి తప్పియ్యాలి అని దేశ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఒక కులానికో మతానికో ప్రాంతానికో భాషాకో ప్రతినిధికాదని ఆయన ఒక విశ్వ మానవుడని పేర్కొన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా ను వెంటనే మంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యక్షులు రవి పటేల్ డైరెక్టర్ సాయిని అశోక్ సీమా గంగారాం అంబేద్కర్ సంఘ నాయకులు రామచందర్, మేత్రి హనుమాన్లు, బొగడ మీది సాయిలు, రూసేగాం భూమయ్య, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా తో పేద ప్రజలకు నిద్ర లేకుండా చేసిన కాంగ్రెస్...

## - ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు



హైదరాబాద్, డిసెంబర్ 21,(వుదయం ప్రతినిధి): కరోనా వచ్చినపుడు ప్రపంచం ఏరకంగా భయపడినదో హైదరాబాద్ కు హైడ్రా వచ్చినప్పుడు పేదవర్గాలు ప్రజలు నిద్ర లేకుండా ఉన్నారని శాసన మండలిలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శాసన మండలి సమావేశంలో హైడ్రా, నూతన మున్సిపల్ చట్టం, కామారెడ్డిలో సభలో బిసి రిజర్వేషన్ పెంపునకు ఇచ్చిన హామీ తదితర అంశాలపై సభలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రసంగించారు.

# పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాల స్టాల్స్...



కోరుట్ల డిసెంబర్ 21 (వుదయం ప్రతినిధి) కథలాపూర్ మండలం పోతారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశంలో తెలంగాణ ఆహారోత్సవంలో తల్లిదండ్రులు ఉత్సాహంగా స్వయంగా చేసిన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలతో స్టాల్ ఏర్పాటు చేశారు ఇట్టి ఆహార పదార్థాలను పరిశీలించిన కథలాపూర్ మండలం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పులి శిరీష హరిప్రసాద్ లు ఈ కార్యక్రమాన్ని పోతారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఉపాధ్యాయులు రాజ్ కుమార్ సంతోషిని తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# అడవుల పరిరక్షణపై శిక్షణ



ఖానాపూర్, డిసెంబర్ 21(వుదయం విలేఖరి) ఖానాపూర్ నియోజకవర్గం, జన్నారం మండలంలో అడవుల పరిరక్షణ తదితర అంశాలపై అటవీ అధికారులకు శిక్షణను మూడు రోజులపాటు నిర్వహిస్తున్నామని ఎఫ్ఆర్ఓ సుష్మారావు తెలిపారు. శుక్రవారం రోజున జన్నారం పట్టణంలోని స్థానిక టీడీసీ సెంటర్ లో ముంబై కి చెందిన డబ్ల్యూసీటీ కేంద్రం శిక్షకులు మంచిర్యాల జిల్లాలోని జన్నారం, మంచిర్యాల, చెన్నూరు పరిధిలో పనిచేస్తున్న అటవీశాఖ అధికారులు సిబ్బందికి వివిధ అంశాలపై శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి జైశ్రీరామ్ ఫౌండేషన్ సాయం



యాదాద్రి భువనగిరి/రాజపేట డిసెంబర్ 21 వుదయం ప్రతినిధి: రాజాపేట గ్రామం లో (బంటుగూడెం) గోళ్లేన బిక్షపతి మృతి చెందగా శనివారం కుటుంబనికి జై శ్రీరాం ఫౌండేషన్ సభ్యులు లి5000లి ఆర్థిక సహాయం అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.. ఈ కార్యక్రమం లో ఊట్కర్ అశోక్ గౌడ్, దాచెపల్లి రాజు, చెలమనపల్లి లక్ష్మన్ ,సంగం మధు,దిడ్డి నర్సింలు,సంగం వేణు ,కోయ మధు,గోళ్లేన సురేష్, ఎర్ర చిన్న, గోళ్లేన స్వామి, గోళ్లేన నర్సింలు, గోళ్లేన కిష్టయ్య, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# బాసర అమ్మవారిని దర్శించుకున్న ఎన్ సిఈఆర్టి ప్రొఫెసర్



బాసర డిసెంబర్ 21( వుదయం ప్రతినిధి) నిర్మల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని శనివారం ఎన్ సిఈ ఆర్టి ప్రొఫెసర్ సుశీల్ కుమార్ త్రిపాఠి దర్శించుకున్నారు. వీరికి అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1 వ తరగతి విద్యార్థులకు ఈ నెల 19, 20,21 తేదీల్లో జరిగిన జాతీయ విద్యా ప్రవేశ పరీక్షలో పాల్గొని విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. వీరు మన తెలంగాణ లోని మంచిర్యాల, జగిత్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు ఇన్చార్జి ఆఫీసర్ గా వ్యవహరించడం జరిగింది. ఈ రోజు లోకేశ్వరం మండలం లోని ఎంపీపీస్ పాఠశాలను సందర్శించారు. వీరి వెంట బాసర నాగభూషణ విద్యాలయం ప్రిన్సిపాల్ జే బాబురావు, అధ్యాపకులు నర్సయ్య, సందీప్ లు ఉన్నారు.

# రాయపర్తి లో పెన్షన్ డే దినోత్సవ వేడుకలు...



రాయపర్తి డిసెంబర్ 21(వుదయం ప్రతినిధి ) : పెన్షన్ డే దినోత్సవాని పురస్కరించుకొని రాయపర్తి మండల కేంద్రంలోని పెన్షనర్లు అందరూ ఒకే చోట సమావేశమై రాయపర్తి మండలం పెన్షనర్ల సంఘం అధ్యక్షులు అబ్బోజు రావెెూహన చారి ఆధ్వర్యంలో అతిథులుగా శ్రీపాద సోమయ్య , ఎల్లయ్య, హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ రావడానికి కారణమైన డికార్న్ , జస్టిస్ వైవిచంద్ర చూడు, పెన్షన్ పొందే ప్రతి వ్యక్తి కృతజ్ఞతా పూర్వక ఉండవలసిన దినమని చెప్పారు. వృద్ధాప్యంలో పెన్షన్ పొందడం ఒక హక్కు అని దాన్ని చట్టపరం చేయడానికి అవసరమైన్నారు. సమన్వయకర్తగా రావుల భాస్కర రావు వ్యవహరిస్తూ వృద్ధాప్యంలో ఆరోగ్యాన్ని కాపాడుతూ తోటి ప్రజలకు సలహాలు సూచనలు సహాయ సహకారాలు సామాజిక సేవ చేయాలని భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా ఉండాలని భాస్కర్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో సోమలక్ష్మి సోమక్క ఎండి ఉస్మాన్ పెద్దగోని ప్రేమలీల లక్కం నరసయ్య రాణమ్మ ఎండి రహీం తదితరులు పాల్గొని పెనిషనర్స్ డే ను విజయవంతం చేశారు.

# మన ఊరు మనం బాగు చేసుకుందాం

## - మున్సిపల్ చైర్మన్ జి. చిన్న దేవన్న



అలంపూర్ డిసెంబర్ 21 (వుదయం ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పురపాలక సంఘం పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గవర్నమెంట్ ఆసుపత్రిని మున్సిపల్ చైర్మన్ దేవన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. 9వ వార్డు మాలపేట, 10 వ దుర్గనగర్ ఏరియాలో శనివారం ఉదయం 6 గంటలకు మున్సిపల్ చైర్మన్ జి. చిన్న దేవన్న పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ వార్డులలోని ప్రజలను పారిశుధ్యం, మంచి నీటి సరఫరా, వీధిలైట్లు, డ్రైనేజి సమస్యలను గురించి ప్రత్యేకంగా ఆరా తిశారు. పర్యటనలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి అక్కడ ఎంత మంది వైద్యులు ఉన్నారో ఆరా తిశారు.

ఆ సమయంలో ఆసుపత్రి లో కేవలం ఒక్క స్టాఫ్ నర్స్, ఒక్క ఆయా మాత్రమే ఉండడంతో ఏమర్జెన్సీ కేసులు వస్తే ఎం చేస్తారని అడగగా మా పరిధిలోని కేసులు మేము చూస్తామని ఏదైనా ఏమర్జెన్సీ కేసులు వస్తే గద్వాల్ కు రేఫర్ చేస్తామని తెలిపారు. అలాగే రాత్రి కూడా ఒక డాక్టర్ హాస్పిటల్ లో ఉంటే బాగుటుందని చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. దుర్గనగర్ లో చిన్న అల్లా బకాష్ ఇంటి దగ్గర డ్రైనేజి పూడిక తీయక మురుగు నిలిచి ఉండడంతో సిబ్బంది చేత వెంటనే మురుగు శుభ్రం చేయాలనీ ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. ప్రస్తుతం వార్డులో శానిటేషన్ గాని, వీధి లైట్లు గాని, వాటర్ సప్లయ్ విభాగం నుండి గాని ఎటువంటి సమస్యలు లేవని వార్డు ప్రజలు చైర్మన్ తో సంతోషం వ్యక్తం చేశారు. 9 వ వార్డు మాలపేటలో ఇండ్ల మధ్యలో ఒక ప్లాటులో పిచ్చి మొక్కలు చెత్త చెదారం పెరిగి చీడపురుగులకు ఆవాసంగా మారిందని కాలనీ వాసులు తెలుపగా ప్లాట్ ఎవరిదో కనుక్కొని వారికీ చెప్పి శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జవాన్లకు సూచించారు.


ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ అశోక్ కుమార్ రెడ్డి, ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ రంగన్న, వాటర్ లైన్ మెన్ నర్సింహులు, బిఆర్ ఎస్. పార్టీ నాయకులు ఇంజ్యోతి మురళి, రామాంజనేయులు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్స్పెక్టర్, జవాన్లు, ఎలక్ట్రీషియన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టిజిఓ సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శిగా అస్నాల శ్రీనివాస్ .



ధర్మసాగర్ 2024 శనివారం 21 (వుదయం ప్రతినిధి): ఈ రోజు టి జి ఓ భవన్ హైదరాబాద్ లో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కేంద్ర కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు .హన్మకొండ జిల్లా ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా పని చేస్తున్న అస్నాల శ్రీనివాస్ కేంద్ర కార్యవర్గంలో ప్రచార కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తెలంగాణ ఉద్యమంలో ఆస్నాల శ్రీనివాస్ మేధో ప్రతిభతో ,ప్రసంగాలతో ,చైతన్యయాత్ర సదస్సులతో ,వ్యాసాలతో క్రియాశీలక పాత్ర పోషించారు . వృత్తి నిబద్ధత సామాజిక భాద్యత తో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్నారు .ప్రజల సమస్యల పరిష్కారంలో ఉద్యోగుల సంక్షేమం ఇమిడి ఉందని నమ్మి పని చేస్తున్న అస్నాల శ్రీనివాస్ కు ప్రతిష్టాత్మక తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర నేతగా నియమించడం పట్ల పలు సంఘాల నేతలు హర్షాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం నేతలు వస్కుల శ్రీనివాస్,హరగోపాల్, అజం,గణేష్,గ్రంథ పాలకుల సంఘం నేతలు బాలునాయక్ సుధీర్ కుమార్ ,పలు ఉద్యోగ సంఘాల నేతలు అభినందనలు తెలియచేసారు.

# శ్రీనివాస రామానుజం జయంతి దినోత్సవం వేడుకలు...



ఎల్కతుర్తి డిసెంబర్ 21(వుదయం ప్రతి నిది): ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వల్లభాపూర్ నందు జాతీయ గణిత దినోత్సవం ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యములో ఘనంగా నిర్వహించడం జరిగింది. శ్రీనివాస రామానుజం చిత్ర పటానికి ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి పూల మాల వేసి నివాళులర్పించి కార్యక్రమం ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గణిత శాస్త్రవేత్తల లో రామానుజం అగ్రగణ్యుడు అని , త్రికోణమితి, రేఖాగణితం, సంఖ్యాశాస్త్రం మరియూ కలనగణితం లోని ఎన్నో అపరిష్కృత సమస్యలకు పరిష్కారం చూపారని కొనియాడారు. ఆర్య భట్టా , భాస్కర, లీలావతి వంటి ప్రముఖ భారతీయ గణిత శాస్త్రవేత్తల తరువాత అంతటి మేధావి రామానుజం అని కీర్తించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు %నబఅఓ% వ్యాసరచన ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు గల గణిత సూత్రాల ను విద్యార్థులు ప్రదర్శించి వాటి ప్రాముఖ్యత ను వివరించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయులు రఘురామ్ మరియు వెంకట స్వామి గార్లు విద్యార్థులకు మార్గదర్శణం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్రెడ్డి, వెంకటసుహాసిని, పద్మలత, కల్యాణి పాల్గొన్న.

# చాలామంది ఇటీవల కాలంలో ఆన్లైన్ యాప్ లలో పెట్టుబడి..?

**-ఆన్లైన్లో యాప్స్ లో పెట్టుబడి పెట్టొద్దు మోసపోవద్దు, ఎస్సై రాజేష్**




డిసెంబర్:21/12/2024, వుదయం పినపాక నియోజకవర్గం ప్రతినిధి: ఆన్లైన్ యాప్ లలో పెట్టుబడి పెట్టొద్దు మోసపోవద్దు అని బూర్గంపహాడ్ ఎస్ఐ రాజేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూజి బూర్గంపహాడ్ మండల వ్యాప్తంగా చాలామంది ఇటీవల కాలంలో ఆన్లైన్ యాప్ లలో పెట్టుబడి పెడుతున్నారని ఆ పెట్టుబడి పెట్టే క్రమంలో డబుల్ వస్తుందని అత్యాశ పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని ఆయన అన్నారు. ఎక్కువ డబ్బు ఆశ చూపించి మోసం చేసే అవకాశం ఉందని ఎవరు కూడా ఆ యాప్ లలో పెట్టుబడి పెట్టొద్దని సూచించారు సైబర్ నేరగాళ్లు ఈ రకమైన వివరాలను మీ ద్వారా వ్యక్తిగత వివరాలు సేకరించి తరువాత మీ ఖాతాల లోని డబ్బును మళ్లించే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన కోరారు. బ్యాంకు లింకుల తో కూడిన మెసేజ్లు వాట్సప్ ల లో వచ్చిన తొందరపడి ఆ లింకులు టచ్ చేయొద్దని అటువంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు సైబర్ నేరగాళ్లు పోలీస్ అధికారులమని చెప్పి మీరు ఆఫీస్ లో ఉన్నారు ఈ కేసులో ఉన్నారని బెదిరించిన డబ్బులు పంపించాలని బెదిరించిన అపరిచిత వ్యక్తులు ఫోన్ ద్వారా సమాచారాన్ని అడిగినట్లయితే అటువంటి వారి పట.

# హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జన్మదిన వేడుకలు




కమలాపూర్ డిసెంబర్ 21 (వుదయం ప్రతినిధి): హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి జన్మదిన వేడుకలను నియోజకవర్గం లో ఘనంగా బి ఆర్ ఎస్ కార్యకర్తలు జరుపుకున్నారు కమలాపూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జన్మదిన వేడుకలను బి ఆర్ స్ కార్యకర్తలు అభిమానులు కేక్ కట్ చేసి జరుపుకున్నారు నిత్యం ప్రజా శ్రేయస్సు కై పాటుపడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే యువ నాయకుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ బస్టాండ్ వద్ద ప్రయాణికులకు పండ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మాట్ల వెంకటేశ్వర్లు పుల్ల శీను ఎండీ దుర్వేష్ మాట్ల రాజు శ్రీధర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# హన్మకొండ జిల్లా మానవ వికాస వేదిక నూతన అధ్యక్షునిగా బొల్లారం చంద్రమౌళి...

**-ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి రౌంటాల బుచ్చయ్య హ్యూమనిస్ట్ పంపిన పత్రిక ప్రకటనలో వెల్లడి.**

ఎల్కతుర్తి డిసెంబర్ 21(వుదయం ప్రతి నిది): ఇటీవల మానవ వికాస వేదిక డిసెంబర్-14,15 తేదీల్లో 20 వసంతాల వేడుకలను హైదరాబాదులోని బాటసింగారం, రామోజీ ఫిలిం సిటీ దగ్గర ఘనంగా నిర్వహించుకొని, జిల్లాల వారిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టారని తెలంగాణ మానవ వికాస వేదిక రాష్ట్ర కార్యదర్శి రౌంటాల బుచ్చయ్య హ్యూమనిస్ట్ శుక్రవారం రోజు పంపిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. 20 ఏళ్ళ వేడుకల కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుండి మేధావులు, వక్తలు, వచ్చి అమూల్యమైన సందేశాలు ఇవ్వడం కూడా జరిగిందని, మానవ వికాస వేదిక 20 సంవత్సరాలుగా చేసినటువంటి కార్యక్రమాలను సభాముఖంగా తెలియజేయడం జరిగిందని అన్నారు. మానవ వికాస వేదిక కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీల నాయకులు, సభ్యులు మరియు మిత్ర సంఘాల నాయకులు కార్యకర్తలు అనేకమంది వచ్చి 20 వసంతాల వేడుకలను విజయవంతం చేశారని అన్నారు. ఈ వేడుకల అనంతరం రాష్ట్ర కమిటీలు కేంద్ర కమిటీలు, జిల్లా కమిటీలను, మానవ వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కేంద్ర కమిటీ అధ్యక్షులు బి. సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రకటించడం జరిగిందని వెల్లడించారు. ఇందులో బాగంగానే 2024, డిసెంబర్-21న హన్మకొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుచ్చయ్య ప్రకటించారు.




హన్మకొండ జిల్లా నూతన కార్యవర్గంఎన్నిక:, అధ్యక్షులుగా : బొల్లారపు చంద్రమౌళి , ఉపాధ్యక్షులుగా : చదిరం సారంగపాణి ప్రధాన కార్యదర్శిగా : వేల్పుల దామోదర్ , సహాయ కార్యదర్శిగా: నాగం రాజయ్య కోశాధికారిగా : పెరుక సుందరయ్య కార్యవర్గ సభ్యులుగా :!పుల్లి సుధాకర్ భీమదేవరపల్లి బి సుధాకర్ హన్మకొండ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

**-4 నెలల చలికాలంలో ఈ ఏడు పండ్లు తింటే.. 206 ఎముకలు బలపడతాయి**






చలికాలం ప్రారంభమైంది. రానున్న రోజుల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. ఈ సీజన్లో సూర్య రశ్మి అంతగా ఉండదు. సూర్య రశ్మి లేకపోవడం వల్ల శరీరానికి కావాల్సిన విటమిన్ డి అందదు. విటమిన్ డి శరీరంలో కాల్షియం పెంచుతుంది. ఎముకల్ని బలంగా మార్చడానికి కాల్షియం, విటమిన్ డి చాలా అవసరం. కాల్షియం, విటమిన్ డి ఎముకల సాంద్రతను పెంచుతాయి. దీంతో.. బోలు ఎముకలు వంటి వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చు. అంతేకాకుండా ఈ రెండు కండరాల బలాన్ని పెంచుతాయి. కాల్షియం నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపరుస్తుంది. రక్తం గడ్డకట్టడంలో సహాయపడుతుంది. హార్మోన్లు, ఎంజైమ్ల స్రావాన్ని నియంత్రిస్తుంది.

కాల్షియం కోసం ఏం తినాలి?

ఆహారంలో కొన్ని పండ్లను చేర్చుకోవడం ద్వారా ఎముకలు దృఢంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. %ఆవశీఇజూతీఅ% వ్యవస్థాపకుడు, హొలిస్టిక్ న్యూట్రిషనిస్ట్ ప్రియాంషి భట్నాగర్ ప్రకారం, చలికాలంలో నాలుగు నెలల పాటు పూర్తి కాల్షియం పొందడానికి కొన్ని పండ్లను డైట్లో చేర్చుకోవాలి. ఈ పండ్లను తింటే కాల్షియం స్థాయి పెరిగి ఎముకలు బలంగా మారతాయి. ఇంతకీ ఆ పండ్లు ఏంటో ఇక్కడ చుద్దాం.

జామపండ్లు తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు..

ఖర్జూరాలు..

ఖర్జూరాలు డ్రై ఫ్రూట్స్లో సూపర్ ఫుడ్ అని చెప్పొచ్చు. ఖర్జూరంలో ఎన్నో పోషకాలు ఉంటాయి. కాల్షియంతో పాటు ఇతర ఖనిజాల అద్భుతమైన మూలం. ఖర్జూరంలో ఐరన్, మినరల్, అమినో యాసిడ్స్, ఫాస్ఫరస్, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని, ఎముకలకు బలాన్ని అందిస్తాయి. 100 గ్రాముల ఖర్జూరాల్లో దాదాపు 64 %ఎగ్ర% కాల్షియం ఉంటుంది.

కివి..

కివిలో కాల్షియం, విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఎముకలకు ప్రయోజనం చేకూరుస్తాయి. 100 గ్రాముల కివీ పండులో దాదాపు 34 %ఎగ్ర% కాల్షియం ఉంటుంది. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీంతో.. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఈ పండ్లలో విటమిన్ ఇ తో పాటు యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని ఎంతో మేలు చేస్తాయి.

జామ..

జామపండులో ఎన్నో పోషకాలు ఉన్నాయి. చలికాలంలో జామపండు తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. జామపండులో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. దీంతో.. ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. రోగాలు రాకుండా అడ్డుకుంటుంది. ఇందులో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది. దీంతో.. మలబద్ధక సమస్యతో బాధపడేవారికి జామపండు అద్భుతంగా పనిచేస్తుంది. చలికాలంలో జామకాయ తినడం వల్ల శరీరానికి విటమిన్ డి, కాల్షియం అందుతాయి. 100 గ్రాముల జామపండులో దాదాపు 18 మిల్లీగ్రాముల కాల్షియం ఉంటుంది.

"అంజీర్..

అంజీర్ను పోషకాల గని అంటారు. విటమిన్ ఎ, విటమిన్ కే, పొటాషియం,%ఎ% కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు అత్తి పండులో ఉన్నాయి. ఎండిన లేదా తాజా అత్తి పండ్లలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇవి చలికాలంలో శరీరాన్ని వెచ్చగా, ఎముకలు దృఢంగా ఉంచడంలో సహాయపడతాయి. 100 గ్రాముల ఎండిన అత్తి పండ్లలో 162 %ఎగ్ర% కాల్షియం ఉంటుంది. అయితే 100 గ్రాముల తాజా అంజీర్లో 35 %ఎగ్ర% కాల్షియం ఉంటుంది.

నారింజ..

ఆరెంజ్ విటమిన్ సితో పాటు కాల్షియం యొక్క మంచి మూలం. ఆరెంజ్ జ్యూస్ తాగడం వల్ల శరీరానికి క్యాల్షియం అందడంతో పాటు రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. 100 గ్రాముల నారింజలో దాదాపు 40 %ఎగ్ర% కాల్షియం ఉంటుంది. నారింజలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని, జుట్టును ఆరోగ్యంగా ఉంచుతాయి. ఆరెంజ్ తినడం వల్ల ఎముకలతో పాటు దంతాలు కూడా బలపడతాయి.

ఈ రెండు పండ్లు కూడా తినండి..

బొప్పాయి, ?? స్ట్రాబెర్రీలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. ఈ రెండూ కాల్షియం పరిమాణం పెంచడంలో సాయపడతాయి. 100 గ్రాముల స్ట్రాబెర్రీలో దాదాపు 27 %ఎగ్ర% కాల్షియం ఉంటుంది. ఇక, బొప్పాయి తినడం వల్ల ఎముకల ఆరోగ్యం మెరగవుతుంది. అంతేకాకుండా శరీరానికి కావాల్సిన కాల్షియం అందుతుంది.

# సర్వే పేరుతో ఇంటి పన్నులు వసూలు వెంటనే ఆపాలని బిజెపి జిల్లా ఓబీసీ అధ్యక్షులు నిరంజన్ గౌడ్ డిమాండ్



ఊర్కొండ న్యూస్ 21 వుదయం ప్రతినిధి: బిజెపి జిల్లా ఓబీసీ అధ్యక్షుడు నిరంజన్ గౌడ్ ఊరుకొండ మండలంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్ల సర్వే పేరుతో ఇంటి పనులు బలవంతంగా వసూలు చేస్తున్నారని. అట్టి వసూలు ఆపేయాలని ఎంపీడీఓ డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం. మండలంలో వివిధ గ్రామాల లో సర్వే పేరుతో పంచాయతీ కార్యదర్శులుఇంటిపన్నుసులు వసూళ్లు. బిజేపి ఊరుకొండ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో ఇందిరమ్మ ఇండ్లపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఇట్టి విషయంపై ఓబీసీ మోర్చా నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు వాగుల దాస్ నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ. ఈ ఊరుకొండ మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ మధ్యకాలంలో గ్రామపంచాయతీ కార్యదర్శులకు టార్గెట్గా పెట్టి ఇందిరమ్మ ఇండ్ల పేరుతో బలవంతంగా ఇంటి పన్నులు వసూలు చేయిస్తున్నారు. వాస్తవంగా ప్రతి సంవత్సరం మార్చి నెలలో వస్తువులు చేయాల్సిన ఇంటి పన్నును మీరు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ప్రజలలో మభ్య పెడుతూ బలవంతంగా గ్రామాలలో ఇంటి పన్నులు వసూళ్లు చేస్తున్నారు. మీరు ఈ పద్ధతిని మానుకోవాలని లేని ఎడల మా పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణ చేయాల్సి ఉంటుంది ఈ ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను నిరంతరంగా కొనసాగిస్తూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా సర్వే నిర్వహించాలని ఓబీసీ మోర్చా జిల్లా శాఖ తరపున డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమలో టీ అరవింద్ గౌడ్ %దీజేవీ% మండల సీనియర్ నాయకులు బిజేపి నాయకులూ %దీజేవీ% కర్యక్తలు తదితరులు పాల్గొన్నారు

# ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా ప్రీ క్రిస్టమస్ వేడుక!




హనుమకొండ, డిసెంబర్ 21(వుదయం జిల్లా ప్రతినిధి) :హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం ప్రీ క్రిస్టమస్ వేడుకను కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సౌకరి జ్యోతి, కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ సుదర్శన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పుల్లా రమేష్, విశ్రాంతి ఆచార్యులు డాక్టర్ శర్మ, పాల్గొన్న ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతి మాట్లాడుతూ సమాజం పట్ల న్యాయం, ధర్మం ప్రేమ పంచిన వ్యక్తులలో ఏసుక్రీస్తు మొదటి వాడని, సమాజం పట్ల నిరంతరం ఆలోచించే వ్యక్తి ఏసుక్రీస్తు అని ఆమె అన్నారు. సాంస్కృతిక సాంప్రదాయక పండుగలు కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని ఇటీవల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించామని, ఇప్పుడు క్రిస్మస్ పండుగను, కాలానుగుణంగా వచ్చే పండుగల వేడుకలను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ శర్మ, రమేష్, సుదర్శన్ చిర రాజు, కర్ణాకర్, డాక్టర్ బిక్షపతి, బోధనేతర సిబ్బంది నాయకులు రాజు, సుశీల్, ఐలయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రిన్సిపల్ కేక్ కట్ చేశారు.

# ఐ డి ఓ సి కార్యాలయంలో ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం డిసెంబర్ 21 (వుదయం ప్రతినిధి): ఐడిఓసి కార్యాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత సెమీ క్రిస్టమస్ కేక్ ను కలెక్టర్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెమీ క్రిస్టమస్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. క్రిస్టమస్ పండుగ శాంతి, సంతోషానికి, త్యాగానికి, ప్రేమ, కరుణకు తార్కాణంగా జరుపుకుంటామన్నారు. క్రీస్తు జీవనగమనం అందరికీ ఆచరణీయమని అన్నారు. క్రిస్మస్ పండుగ రోజును సంతోషంగా, ఆహ్లాదకర వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాక్షించారు. క్రీస్తు బోధనలు మంచి మార్గంలో నడిపిస్తాయన్నారు. అందరూ ఐకమత్యంతో మెలుగుతూ ఎదుటివారిని క్షమించే గుణాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అందరికీ క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, ఏవో రమాదేవి మరియు కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్పీ రిలే నిరాహార దీక్షలను విరమింప జేసిన తహసిల్దార్ లక్ష్మి రాజయ్య..

**-పూర్తి హామీలతో దీక్షలు విరమణ..**




వెంకటాపురం డిసెంబర్ 21 (వుదయం ప్రతినిది): గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో కొమరం భీమ్ కాలనీ ఆదివాసీలుసర్వే నెంబరు 27 లో 30సంవత్సరాలు గా సాగుచేస్తున్న భూమికోసం గత ఆరు రోజుల నుండివెంకటాపురం మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలుచేపట్టటం జరిగింది. శనివారం వెంకటాపురం తాసిల్దారు ఆదివాసీల రిలే నిరాహార దీక్షలకు విచ్చేసికొమురం భీం కాలనీ ఆదివాసీలకు 2/1/2025నా పూర్తి సర్వే చేసి మీ భూమి మీకే అప్పగిస్తానని వెంకటాపురం తాసిల్దారు హామీ ఇవ్వడంతో దీక్షలు విరమించడం జరిగింది ఈ సందర్భంగా జి.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర మాట్లాడుతూ ఫిఫ్త్ షెడ్యూల్ ఏరియాలో ప్రభుత్వ భూములపై సర్వహక్కులు ఆదివాసీలకే ఉంటాయని ఆయన అన్నారు. కొమరం భీం కాలనీ ఆదివాసీలు గత 30సంవత్సరాల నుండి సాగు చేస్తున్న భూమిని గిరిజనేతరులకి ఇవ్వాలని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. నిరుపేదలైన ఆదివాసీలకు ఏజెన్సీలో సాగు చేసుకొనే హక్కులు లేవా అని అయన ప్రశ్నించారు .వెంకటాపురం మండల తాసిల్దారు హామీతో దీక్షలను విరమిస్తున్నమని లేని పక్షంలో మరల ఇదే సమస్యపై రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని అన్నారు.ఆదివాసీల కోసం అమర్ నిరాహార దీక్ష కూడా సిద్ధమని ఆయన హెచ్చరించారు. వెంకటాపురం మండల టౌన్ లో 1/70 చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ భూములలో గిరిజనేతర్లు అక్రమ బవులంతస్తులు నిర్వహిస్తున్నారని అయన అన్నారు.అక్రమ భవనం నిర్మిస్తున్న గిరిజనేతరులపై క్రిమినల్ కేసులు, 145 సెక్షన్ నమోదు చేయాలని అని ఈ సందర్భంగా కోరారు. రిలే నిరాహార దీక్షలు విరమణ కుమద్దతుగా ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోర్స నరసింహమూర్తి, ఏ ఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఉయిక శంకర్,జిఎస్పి ములుగు జిల్లా కమిటీ కోమ రంబీం కాలనీ ఆదివాసులు పాల్గొన్నారు.

# రాయపర్తి లో పెన్షన్ డే దినోత్సవ వేడుకలు...



రాయపర్తి డిసెంబర్ 21(వుదయం ప్రతినిధి ) : పెన్షన్ డే దినోత్సవాని పురస్కరించుకొని రాయపర్తి మండల కేంద్రంలోని పెన్షనర్లు అందరూ ఒకే చోట సమావేశమై రాయపర్తి మండలం పెన్షనర్ల సంఘం అధ్యక్షులు అబ్బోజు రామ్మోహన చారి ఆధ్వర్యంలో అతిథులుగా శ్రీపాద సోమయ్య , ఎల్లయ్య, హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ రావడానికి కారణమైన డికార్స్ , జస్టిస్ వైవిచంద్ర చూడు, పెన్షన్ పొందే ప్రతి వ్యక్తి కృతజ్ఞతా పూర్వక ఉండవలసిన దినమని చెప్పారు. వృద్ధాప్యంలో పెన్షన్ పొందడం ఒక హక్కు అని దాన్ని చట్టపరం చేయడానికి అవసరమైన్నారు. సమన్వయకర్తగా రావుల భాస్కర రావు వ్యవహరిస్తూ వృద్ధాప్యంలో ఆరోగ్యాన్ని కాపాడుతూ తోటి ప్రజలకు సలహాలు సూచనలు సహాయ సహకారాలు సామాజిక సేవ చేయాలని భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా ఉండాలని భాస్కర్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో సోమలక్ష్మి సోమక్క ఎండి ఉస్మాన్ పెద్దగోని ప్రేమలీల లక్కం నరసయ్య రాణమ్మ ఎండి రహీం తదితరులు పాల్గొని పెనిషనర్స్ డే ను విజయవంతం చేశారు.

# వి కె పి ప్రీమియర్ లీగ్ సీజన్ - 3 క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన

**-సింగిల్ విండో మాజీ అధ్యక్షులు సంకాపురం రాముడు**



అలంపూర్ డిసెంబర్ 21 (వుదయం ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ నియోజక వర్గం అయిజ మండలం వెంకటాపురం గ్రామంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా వెంకటాపురం యూత్ ఆధ్వర్యంలో వెంకటాపురం ప్రీమియర్ లీగ్ సీజన్ - 3 ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా అయిజ మండల సింగిల్ విండో మాజీ అధ్యక్షులు సంకాపురం రాముడు పాల్గొని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభోత్సవం చేసి క్రీడా కారులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలలో గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. క్రీడకు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఉపయోగపడు తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మాజీ సర్పంచ్ తిమ్మయ్య, నౌరోజి క్యాంపు మాజీ సర్పంచ్ భద్రయ్య, బింగి దొడ్డి ఎంపీటీసీ చిన్న రాముడు,ఉరుకుందు, ముక్తార్, క్రీడా కారులు, తదితరులు పాల్గొన్నారు.

# 30 అడుగుల రోడ్డు వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం...



డిసెంబర్:20/12/2024, వుదయం పినపాక నియోజకవర్గం ప్రతినిధి: బూర్గంపాడు మండలం సారపాక బసప్ప క్యాంపులో30 అడుగులు రోడ్డు పనులు వారం రోజుల్లో పనులు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తామని గ్రామస్తులు కు కాంగ్రెస్ నేతలు పార్టీ హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభివృద్ధిపనులు ముమ్మరంగా సాగుతున్నాయని అన్నారు. స్థానికులు బసప్ప క్యాంపులో డ్రైన్, విద్యుత్ పోల్స్, త్రాగునీరు సరఫరా చేయాలని పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ నేతలు ఇంగువ. రమేష్, కోమటిరెడ్డి మోహన్ రెడ్డి,పులపెల్లి సుధాకర్ రెడ్డి, రహీమ్ ఖాన్,స్థానికులుతదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ



యాదాద్రి భువనగిరి/ తుర్కపల్లి : డిసెంబర్ 21 (వుదయం ప్రతినిధి) :తుర్కపల్లి మండల కేంద్రంలో శివ నర సింహన్ తాంత్రి, డాక్టర్ పి ఎం మనోజ్ తంత్రి, రాచర్ల రమేష్, పెండెం శ్రీనివాస్ గురు స్వాముల ఆధ్వర్యంలో పత్తిపాటి రామారావు 18 వ మహా పడిపూజ ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి పూజ, కలశపూజ, అమ్మవారి పూజ, అనంతరం అయ్యప్ప స్వామికి 18 రకాల అభిషేకాలు, ఆభరణాల ఊరేగింపు ,నిర్వహించి పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో తుర్కపల్లి ప్రాంతమంతా మారుమోగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వాములకు, భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు పత్తిపాటి హనుమంతరావు, సీత నరసింహులు, డాక్టర్ ఎస్ రాజు, ఎరుకల అనిల్ గౌడ్, ర్యాకల రాజు, బొట్టు గురుస్వామి, తిప్పారం నాగ,పత్తిపాటి ఆనంద్,పత్తిపాటి సునీల్,బోడ నవీన్,తిప్పారం బహ్మచారి,పుట్టఆంజనేయులు, కట్కూరి రాజు,మడిగే వెంకట్ స్వామీ, ఉప్పు పెద్ది రాజు, బోల్లారం రవి, పల్లే నరేష్, శాగర్ల పరామేష్, కురెళ్ల సందీప్,పాముల బాలకృష్ణ,వంగాల ఉదయ్, సుంకి శివ, కొడపక నర్సింహ,లింగాల నరసింహ, రసాల ఐలేష్, బండారి కనకరాజు, వేముల మల్లేష్,ఆదిములం రాజేష్, రసాల ఐలేశ్, తునికీ సాయి కిరణ్,కార్తిక్, భజన బృందం జగదీష్ ,సందీప్, సిద్దు పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ, సామరస్య విలువలను కలిగి ఉండాలి

**– శాంతి, సహనం, ప్రేమ, కరుణ సందేశం అందించి క్రీస్తు చూపిన బాటలో నడవాలి**

**– ప్రజాభవన్ లో పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేసిన ఏం.ఎల్.ఏ. నాయిని రాజేందర్ రెడ్డి**



హనుమకొండ, డిసెంబర్ 21(వుదయం జిల్లా ప్రతినిధి): క్రిస్టమస్ పండుగను ను పురస్కరించుకొని ప్రజాభవన్ లో నేడు వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి గారు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న పాస్టర్లకు దుస్తులు పంపిణి చేసారు. అనంతరం కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులందరికి ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారుఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సర్వ మానవ సమానత్వం శాంతి, సహనం, ప్రేమ, కరుణ సందేశం అందించి ఆచరించిన క్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ రకమైన మత విద్వేషాలు, కొట్లాటలు లేని సమాజాన్ని నిర్మించుకోవాలని, మతాలను సమానంగా గౌరవించినప్పుడే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలకు సమాన గౌరవం, అన్ని పండుగలకు సమాన గుర్తింపు లభించాలన్నదే తమ అభిమతమన్నారు. దేవుడి కృప వలన ప్రజలందరూ సుఖసంతోశంగా ఉండాలని ప్రతి ఒక్కరు ఎంతో పవిత్రంగా భావించే క్రిస్టమస్ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకోవాలని అన్నారు. క్రీస్తు దేవేనలు ఎల్లపుడు మనతో ఉండాలని మీ ఇంట ఆనందాలు నిండాలని కోరుకొంటూ మరొకసారి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియ చేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఎస్.సి. డిపార్టుమెంటు కార్యదర్శి ఎం.పి. ఆనంద్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎం.వి. రాజు, జిల్లా ఎస్.సి. డిపార్టుమెంటు చైర్మన్ డాక్టర్ పి. రామకృష్ణ, జిల్లా డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ శ్రవణ్కుమార్, నాయకులు హన్మకొండ కాలబ్, బిషప్ లు డాక్టర్ జోహన్ మార్కండయ్య, డాక్టర్ నిరంజన్ బాబు, డాక్టర్ ఐజాగ్, డాక్టర్ కొర్విన్ తదితరులు పాల్గొన్నారు.

# అడవులలో పర్యటించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు



జన్నారం,డిసెంబర్ 21(వుదయం విలేకరి) జన్నారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు,అధ్యాపకులు ఇంధనపల్లి రేంజ్ పరిధిలోని కవ్వాల్ అటవీ అభయారణ్యంలో పర్యటించారు.శుక్రవారం రోజున సాయంత్రం విద్యార్థులు,అధ్యాపకులకు అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు,అడవులు సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్ వివరించారు.ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ అడవులను కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని,వన్యప్రాణులను వేటాడి చంపడం నేరమని అన్నారు.

అనంతరం వారితో అడవులను కాపాడడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి బర్ల కరుణాకర్,ఫీల్డ్ అధికారి వెంకట్,అధ్యాపకులు,అటవీ అధికారులు పాల్గొన్నారు.

# భారత కమ్యునిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి



అశ్వారావుపేట డిసెంబర్21(వుదయం ప్రతినిధి): ఈ నెల 26 కు భారత కమ్యునిస్టు పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా అన్ని మండల హెడ్క్వార్టర్స్ లో రాలీ,బహిరంగ సభ నిర్వహించాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా అశ్వారావుపేట నియోజకవర్గం లోని ప్రతి వూరువాడలో సీపీఐ పార్టీ జండాను ఆవిష్కరించి 26 న అశ్వారావుపేట లో జరిగే రాలీ,భారీ బహిరంగ సభలో పాల్గొనాలని నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం సీపీఐ పార్టీ శ్రేణులకు,నాయకులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గంన్నిన రామకృష్ణ,మహిళా సంఘం నాయకులు సత్యవతి, రోజ్వానా,శ్రావణి,రోహిణి,ఏఐటీయూసీ నాయకులు పఠాన్ జలాల్,జోసెఫ రాజు,అబ్బాస్,బలరాం,చెన్నారావు,సీపీఐ సోషల్ మీడియా ఇన్చార్జి నూకవరపు విజయ్ కాంత్ తదితర సీపీఐ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు

# సిపిఆర్ పై విద్యార్థులకు అవగాహన



జన్నారం,డిసెంబర్ 21(వుదయం విలేకరి) జన్నారం పట్టణంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు సిపిఆర్ పై ప్రిన్సిపల్ కస్తూరి సతీష్ కుమార్ శనివారం రోజున మధ్యాహ్నం పాఠశాల ఆవరణలో అవగాహన కార్యక్రమం చేపట్టారు.అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వ్యక్తిని బతికించేందుకు సిపిఆర్ పద్ధతి ఉపయోగపడుతుందని,ఆ వ్యక్తి గుండెపై సిపిఆర్ విధానాన్ని ఎలా ఉపయోగించాలో స్వయంగా చేసి చూపించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ప్రమాదవశాత్తుతో వ్యవసాయ బావిలో పడి కూలి రైతు మృతి.





ఖానాపురం డిసెంబర్ 21 వుదయం ప్రతినిధి.మండల కేంద్రంలోని పెద్దమ్మగడ్డ గ్రామానికి చెందిన వల్లెపు సాంబయ్య (55) ప్రమాదవశాత్తుతో వ్యవసాయ బావిలో పడి కూలీ రైతు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు మృతుని కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. ఇట్టి విషయమే స్థానిక ఎస్ఐ సిహెచ్ రఘుపతిని వివరణ కోరగా మృతిని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ తెలిపారు.

## గురుకుల పాఠశాలలో అదనపు కలెక్టర్ విచారణ

నారాయణఖేడ్, డిసెంబర్21(వుదయం ప్రతినిధి): ప్రిన్సిపల్ వైఖరికి నిరసనగా అందోలు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినిలు ఆందోళన చేయడంతో కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ గురుకుల పాఠశాలలో శనివారం సందర్శించి విద్యార్థినిలతో మాట్లాడారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీఓ పాండు, సీఐ అనిల్ కుమార్ ఉన్నారు.

# పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ఇవ్వాలి



యాదాద్రి భువనగిరి / తుర్కపల్లి : డిసెంబర్ 21 ( వుదయం ప్రతినిధి ) :పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ఇవ్వాలని ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్లో భాగంగా తెలంగాణ ఆహార దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలంగాణ సాంస్కృతిని ప్రతిబింబించేలా వివిధ రకాల వంటలను తయారు చేసుకొని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలందరూ ఆరోగ్యంగా పెరగాలంటే పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ఇవ్వాలని అన్నారు .ఆహార దినోత్సవ ప్రదర్శనలో భాగస్వాములై తల్లిదండ్రులను ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఆకుల విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు జెన్నెపల్లి అరుణ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

# పేరుకే కుబేరులు అంబారీకి పేదరికలు

**- అయ్యప్ప దేవాలయానికి కోట్లలో ఆదాయం**

**- ఖర్చు పెట్టడంలో కమిటీ పెద్దల నిర్వాకం**

**- అయ్యప్ప స్వాములు లేకుండా అంబారి ఊరేగింపు**



యాదాద్రి భువనగిరి / డిసెంబర్ వుదయం ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గత పది సంవత్సరాలుగా శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం ఆధ్వర్యంలో భువనగిరి పట్టణ హనుమాన్ వాడ శ్రీ లక్ష్మీ నారాయణ దేవాలయం నుండి అంబారి ఊరేగింపు కొనసాగడం ఆనవాయితీగా వస్తుంది. ఈ అంబారీలో గరుడ పక్షి రావడం ఒక ప్రత్యేకత కానీ ఆలయ కమిటీ నిర్లక్ష్యం వలన అంబారీలో స్వాముల కనుమరువు. ఆలయానికి కోట్లలో ఆదాయం వస్తున్న ఖర్చు పెట్టడంలో కమిటీ వెనుకడుగు. అంబారీ పేరుతో 10 లక్షల ఖర్చు అంటూ. చెవులు కోరుకుంటున్న భువనగిరి పట్టణ పరిసర ప్రాంత అయ్యప్ప స్వాములు. అంబారి ఊరేగింపులో ఆర్యవైశ్యులు తప్ప అయ్యప్ప స్వాములు లేని పరిస్థితి నెలకొంది. ఆర్యవైశ్యుల పెద్దరికం తప్ప అయ్యప్ప స్వాములకు కనీసం మర్యాద కూడా ఇవ్వలేదంటూ వాపోతున్న అయ్యప్ప స్వాములు. ఏనుగు అంబానికి అటవీ శాఖ అధికారులు పర్మిషన్ ఇవ్వలేదంటూ తోసిపుచ్చిన ఆలయ కమిటీ చైర్మన్ అధ్యక్షులు సభ్యులు, నేడు నిర్వహిస్తున్న అంబారీ ఊరేగింపులో దేవతా మూర్తుల వేషధారణ, గిరిజన మహిళల నృత్యాలు, మహిళల కోలాటాలు తప్ప భక్తి భావంతో భజనలు చేసేవారే కరువయ్యారు.

# బీసీ హాస్టల్ రహదారిని శుభ్రం చేయించాలని ఈవోకు వినతి



జన్నారం,డిసెంబర్ 21(వుదయం విలేఖరి) బీసీ హాస్టల్ కు వెళ్లే రహదారిని శుభ్రం చేయించాలని పొనకల్ గ్రామపంచాయతీ ఈవో రాహుల్ కు బీసీ సంఘం నాయకులు శనివారం రోజున ఉదయం వినతి పత్రం అందజేశారు.పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న బీసీ హాస్టల్ కు వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు,ముళ్ళకంపలతో రహదారి మొత్తం కనపడకుండా పోయిందని వెంటనే రహదారిని శుభ్రం చేయించాలంటూ వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘ నాయకులు ఆడేపు లక్ష్మీనారాయణ,కడార్ల నర్సయ్య,బాలసాని శ్రీనివాస్ గౌడ్,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీసీ కన్వీనర్ కోడూరు చంద్రయ్య,కొండపల్లి మహేష్,శ్రీధర్ రావు,పోడేటి సతీష్ గౌడ్,కుంట మహేష్,సాయి,పురుషోత్తం, మురళి,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# భారత ప్రభుత్వం నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ సుప్రీం కోర్ట్ సామాన్యుడుఅయినా కాట కుమారస్వామికి లేక






చెన్నరావుపెట. డిసెంబర్21(వుదయం ప్రతినిధి): నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ సుప్రీంకోర్టుకు ఉచిత న్యాయం కోసం దరఖాస్తు గత 30 రోజుల క్రితం దరఖాస్తును పోస్టు ద్వారా పంపి నా స్వీకరించి కేసు నెంబర్ 12/08429/ 2024 అప్లోడ్ చేయడం జరిగింది గత నాలుగు సంవత్సరాల నుండి రావికుంట చెరువు శిఖం భూమి కోసం ప్రభుత్వ అధికారులపై చెన్నారావుపేట ఎమ్మార్వో గారికి అనేక వినతి పత్రాలు ఇచ్చిన అన్యాక్రాంతం అక్రమ పట్టాలు చేసిన అధికారులను ఎలాంటి చర్యలు తీసుకోకుండా పబ్లిక్ అథారిటీ పబ్లిక్ సర్వెంట్ అయినా అధికారులు ప్రభుత్వానికి శికం భూమిని అక్రమ పట్టాలు చేసిన గతంలో హైకోర్టులో లోకాయుక్తలో కేసులు వేసినప్పటికీ చెన్నారావుపేట ఎమ్మార్వో శిఖం భూమిని ఇలాంటి పట్టాలు చేయలేదు ఇలాంటి పాసుబుక్కులు ఇవ్వడం లేదు అని ఆర్టిఐ ద్వారా విషయాన్నీ తెలపడం జరిగింది ఇరిగేషన్ అధికారులు పోలీసు అధికారులతో మత్తడి ధ్వంసం చేసి హైకోర్టు నుంచి నివేదిక ఇచ్చే క్రమంలో నీటి ఎద్దడి చాలా తీవ్రతంగా ఉంది సిమ్ములు పనిచేయడం లేదు అని అని తప్పుడు సమాచారం ఇస్తూ ఉన్న విషయాన్ని ఒక ఎకరానికి రెండు సర్వే నెంబర్లు పూర్తి ఆధారాలతో 54 పేజీలతో నేషనల్ లీగల్ సర్వీస్కు సాక్షాదారులతో పంపడం జరిగింది ప్రభుత్వ అధికారులు ఎన్ని కంప్లేట్ చేసిన ప్రభుత్వ భూములు రక్షించే అధికారులు ప్రభుత్వం వైపు లేరు అని ఆ విషయాన్ని సమర్పించుకుంటూ వరంగల్ కలెక్టర్ గారిపై నర్సంపేట ఆర్డిఓ వారిపై ఎమ్మార్వో పై ఇరిగేషన్ అధికారులపై రిజిస్ట్రేషన్ అధికారులపై ఫిర్యాదు చేయడం జరిగింది అట్టి ఫిర్యాదు సానుకూలంగా తెలంగాణ స్టేట్ లీగల్ అథారిటీ ఫార్వర్డ్ చేసి హైకోర్టులో మరో7 రోజుల్లో పూర్తి నివేదిక ఇస్తామని లేక ధార తెలపడం జరిగింది ఈ సందర్భంగా ఒక సామాన్యుడికి ఉచిత న్యాయం పొందాలంటే రాజ్యాంగంలో లిఖించబడిన సెక్షన్లు ఆధారంగా ప్రతి పౌరునికి ప్రాథమిక హక్కుగా చట్టాలపై అవగాహనగా ప్రభుత్వ అధికారులు అయినా సామాన్యుడు అయినా చట్టం దృష్టిలో అందరూ సమానులే అని రాజ్యాంగంలో లిఖించి ఉంది నేషనల్ లీగల్ సర్వీస్ గురించి నాకు సహకరించిన ముదిరాజ్ న్యాయవాదులకు మరియు సమాచార పరిరక్షణ కమిటీ ప్రజాప్రతినిధులకు జల్లి గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజల్లో అవేర్నెస్ పెంచడం కోసం ఎప్పుడు ముందుండే సమాచార పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు కాట కుమారస్వామి తెలిపినారు

# కోటలో ఘనంగా ప్రథమ ప్రపంచం ధ్యాన దినోత్సవ వేడుకలు..



వరంగల్ వెస్ట్ డిసెంబర్ 21 (వుదయం విలేఖరి): ప్రపంచ ప్రథమ ధ్యాన దినోత్సవ వేడుకలు ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ ఎం. శోభ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ కోట శిల్పాలలో ప్రథమ ప్రపంచ ధ్యాన దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ధ్యానం చేయడం వలన కలిగే లాభాలు, మానసిక ప్రశాంతత, ప్రస్తుత సమాజంలో రోజు వారి పనులతో అనేక టెన్షన్స్ తో అనారోగ్యాలు కొని తెచ్చుకుంటున్నారని కావున ప్రతి ఒక్కరు రోజుకు కనీసం 10నిముషాలు ధ్యానం చేయడం వలన ప్రశాంతత ఉంటుందని ఐక్యరాజ్య సమితి కూడా డిసెంబర్ 21ని ప్రపంచం ధ్యాన దినోత్సవ గా ప్రకటించడం జరిగిందని అన్నారు. ఈ రోజు గురుదేవులు శ్రీ శ్రీ రవిశంకర్గా చెప్పినట్లు ఆరోగ్యానికి ఐశ్వర్యం, ఆస్థి ఎంత ముఖ్యమో, ఆరోగ్యం కూడా ముఖ్యం అని చెప్పినట్లు అందరు ధ్యానాన్నీ పాటించి జీవితం లో ఎలాంటి ఛాలెంజ్ లను ఎదుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ మాట్లాడుతూ నిత్యం బిజీగా జీవితాన్ని గడిపే వారికి ఈ ధ్యానం ఎంతో ఉపయోగం పడుతుందని ఈ కార్యక్రమం నిర్వహించిన ధ్యాన టీచర్ శోభ బృందానికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానికులు సంగరాబోయిన చందర్, బోలుగోడు శ్రీనివాస్,విశ్వనాదం,అరుణ్, ప్రతాప్ అమృత్, గోపాల కృష్ణ,కల్పన,శేషాద్రి, నళిని ప్రియా, గోపిక, రంజిత్, లతో పాటు తదితరులు పాల్గొన్నారు.





# బిజినెస్



## ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీల చెలగాటం

దేశంలోని ప్రయివేటు వైద్య బీమా కంపెనీలు పాలసీదారులతో చెలగాటం అడుతోన్నాయి. బీమా ఇచ్చే సమయంలో క్యాష్‌లెస్, మొత్తం మేమే భరిస్తామని చెప్పుతూ పాలసీలు చేపిస్తున్నాయి. ఆ తర్వాత అనుకోని పరిస్థితుల్లో పాలసీదారు అనారోగ్యంతో హాస్పిటల్ పాలు అయితే చెల్లింపుల్లో కొసర్లు, కోతలు పెడుతున్నాయి. మొత్తం బిల్లింగ్‌లో 80 శాతం లోపే భరిస్తున్నాయి. మిగితా మొత్తం భారం పాలసీదారులపై పడేస్తున్నాయి. దేశంలోని 20 ప్రయివేటు వైద్య బీమా కంపెనీలు 2023లో 80 శాతం లోపే క్లయిమ్ మొత్తం చెల్లింపులు చేశాయి. అంటే హాస్పిటల్‌లో రూ.1 లక్ష బిల్లు అయితే కేవలం రూ.80వేలు మాత్రమే చెల్లించాయి. మిగితా రూ.20వేలు పాలసీదారు చెల్లించాల్సి వచ్చింది. వైద్య బీమా చెల్లింపులు, పరిష్కారాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు మెరుగైన పనితీరును కనబర్చాయి. గరిష్టంగా 98 శాతం మేర చెల్లింపులు చేసిన సంస్థలు ఉన్నాయి. ఇన్సూరెన్స్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐబిఎఐ) రిపోర్ట్ ప్రకారం.. ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ మాత్రం ఏకంగా 98.74 శాతం మొత్తం చెల్లిస్తూ టాప్‌లో ఉండటం విశేషం. మరో పిఎస్‌యు ఓరియంటల్ ఇన్సూరెన్స్ కూడా సగటున 97.35 శాతం మొత్తాన్ని చెల్లించింది. ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో సగటున 71.35 శాతం మొత్తం క్లెయిమ్ చెల్లింపులు చేసింది. ఐసిఐసిఐ లంబార్డ్ 63.98 శాతం చెల్లించగా.. ఈ రంగంలో మార్కెట్ లీడర్‌గా ఉన్న స్టార్ హెల్త్ మాత్రం 54.61 శాతం క్లెయిమ్ చెల్లింపులు చేయడం గమనార్హం. ఆరోగ్య బీమా వ్యాపారంలోని 29 బీమా సంస్థలలో కేవలం నాలుగు బీమా కంపెనీలు మాత్రమే 2023 సంవత్సరంలో 90 శాతం కంటే ఎక్కువ క్లెయిమ్ చెల్లింపు నిష్పత్తిని (క్లెయిమ్‌ల సంఖ్యపై) కలిగి ఉన్నాయి. దాదాపు పది బీమా సంస్థలు 80 శాతం కంటే తక్కువ క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లను కలిగి ఉన్నాయి.

ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ క్లెయిమ్ చెల్లింపుల నిష్పత్తిలో 95.04 శాతంతో ముందంజలో ఉంది. ఆదిత్య బిర్లా హెల్త్ 94.52 శాతం, ఇఫ్కో టోకియో 91.70 శాతం, బజాజ్ అలియాంజ్ 90.29 శాతంతో క్లెయిమ్ చెల్లింపు నిష్పత్తులతో ముందు వరుసలో ఉన్నాయి. ప్రయివేటు బీమా కంపెనీలు క్లెయిమ్ చెల్లింపుల్లో 5-18 శాతం వరకు నిరాకరిస్తున్నాయి. 2022-23లో సాధారణ, ఆరోగ్య బీమా సంస్థలు 2.36 కోట్ల ఆరోగ్య బీమా క్లెయిమ్‌లను పరిష్కరించాయి.





## నవంబర్‌లో రూపాయి అత్యంత పేలవం

తమ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. రూపాయి విలువను అమాంతం పెంచుతామని.. డాలర్‌కు సమానంగా రూపాయి విలువ చేస్తామని.. రూపాయి కరెన్సీల కోసం విదేశాలు లైన్ కట్టాలని నరేంద్ర మోడీ 2013లో చేసిన ప్రచార అర్భాటాలకు ప్రస్తుత పరిస్థితికి పొంతన లేకుండా పోయింది. ప్రస్తుత ఏడాది నవంబర్‌లో అయితే రూపాయి విలువ అత్యంత పేలవంగా నమోదయ్యింది. ఈ ఒక్క నెలలోనే 0.5 శాతం విలువ కోల్పోయింది. అమెరికా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం తర్వాత డాలర్ విలువ మరింత పెరగడం, భారత మార్కెట్ల నుంచి భారీగా విదేశీ పోర్ట్‌ఫోలియో నిధులు తరలిపోవడంతో గడిచిన ఎనిమిది నెలల్లో ఎప్పుడూ లేని స్థాయిలో రూపాయి విలువ పడిపోయింది. శుక్రవారం నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.48కు పరిమితమయ్యింది. అక్టోబర్ ముగింపు నాటికి రూపాయి విలువ 82.71గా ఉంది. నరేంద్ర మోడీ ప్రధాని కాకముందు 2014లో డాలర్‌తో రూపాయి విలువ 60లోపే ఉండటం విశేషం.

## తాకట్టు చెరలో స్వర్ణం

ఎన్నో ఆశలు, సంతోషాలతో కొనుక్కునే స్వర్ణం తాకట్టు పడుతోంది. దేశంలో తగ్గిన ఆదాయాలు, భారీగా పెరిగిన ఖర్చులు పసిడి తనఖాకు దారితీస్తున్నాయి. ఏడాది కాలంలో అమాంతం పెరుగుతోన్న వ్యయాలను తట్టుకోవడానికి ప్రజలు ఉన్న బంగారాన్ని భారీగా కుదువ పెట్టేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గణాంకాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో పసిడి అప్పులు ఏకంగా 50.4 శాతం ఎగిసి రూ.1,54,282 కోట్లకు చేరాయి. 2024 మార్చి ముగింపు నాటికి ఈ రుణాల విలువ రూ.1,02,562 కోట్లుగా ఉంది. విద్య, వైద్యం, వ్యక్తిగత, వ్యవసాయ అవసరాలు తీర్చుకోవడానికి ప్రజలు బంగారం రుణాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీంతో బ్యాంకింగేతర విత్త సంస్థలు



(ఎన్‌బిఎఫ్‌సి)లు అన్ సెక్యూర్డ్ రుణాల కంటే సెక్యూర్డ్ రుణాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. పసిడి రుణాలకు డిమాండ్ పెరగడానికి ప్రజలు ఆర్థికంగా దెబ్బతినడమే ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఏడు నెలల్లో వ్యక్తిగత రుణాలు 5.6 శాతం పెరిగాయి. గృహ రుణాలు 12.1 శాతం పెరిగి రూ.28.7 లక్షల కోట్లకు చేరాయి. క్రెడిట్ కార్డులపై రుణాలు 9.2 శాతం పెరిగి రూ.2.81 లక్షల కోట్లకు చేరాయి. అన్‌సెక్యూర్డ్ రుణాలు 3.3 శాతం తగ్గాయి. తొలి ఏడు నెలల్లో బ్యాంక్ రుణాల జారీ 4.9 శాతం పెరిగి రూ.172.4 లక్షల కోట్లుగా నమోదైంది. రుణగ్రహీతలను కుదువ సంస్థలు మోసానికి గురిచేస్తుండటం, పసిడి విలువ నిర్ధారణలో లోపాలు, వేలంలో పారదర్శకత లేకపోవడం వంటి అంశాలు ఆర్‌బిఐ దృష్టికి వెళ్లాయి.

# క్రీడలు



## రాబిన్ ఉతప్పకు అరెస్ట్ వారెంట్

కాగా డిసెంబర్ 4న ఉతప్పపై అరెస్ట్ వారెంట్ జారీ అవుతుందన్న విషయం తెలుసుకుని ఉతప్ప తన ఇంటి అడ్రస్ మార్చుకున్నాడు. టీమిండియా మాజీ ఆటగాడు రాబిన్ ఉతప్పకు బిగ్ షాక్ తగిలింది. ప్రావిడెంట్ ఫండ్ కేసులో అతనిని అరెస్ట్ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు పీఎఫ్ రిజినల్ కమీషనర్ గోపాల్ రెడ్డి ఉతప్పను అరెస్ట్ చేయాల్సిందిగా పోలీసులను కోరారు. ఈ మేరకు అరెస్ట్ వారెంట్ కూడా జారీ చేశారు. ఉతప్ప సెంచరీస్ లైఫ్‌స్టైల్ బ్రాండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే అందులో జీతాల నుంచి పీఎఫ్ సొమ్మును ఉద్యోగుల పీఎఫ్ ఖాతాల్లో జమ చేయలేదన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. విశేషమేంటంటే కేవలం 23 లక్షల కోసం ఊతప్ప ఈ మోసానికి పాల్పడ్డాడంటూ ఉద్యోగులు వాపోతున్నారు. కాగా డిసెంబర్ 4న ఉతప్పపై అరెస్ట్ వారెంట్ జారీ అవుతుందన్న విషయం తెలుసుకుని ఉతప్ప తన ఇంటి అడ్రస్ మార్చుకున్నాడు. దీంతో పీఎఫ్ అధికారులు ఉతప్పపై అరెస్ట్ వారెంట్ జారీ చేసి గాలిస్తున్నారు. రాబిన్ ఉతప్ప అంటే మనకు మొదట గుర్తుకొచ్చేది 2007 టి20 ప్రపంచకప్. ఆ టోర్నీలో టీమిండియా ఫైనల్లో పాకిస్థాన్ పై గెలిచి తొలి టి20 వరల్డ్ అందుకుంది. ధోనీ సారథ్యంలో రాబిన్ ఊతప్ప అద్భుత ప్రదర్శనతో హాఫ్ సెంచరీ చేశాడు. ఒకరకంగా ఆ టోర్నీలో ఊతప్ప పాత్ర ఎంతగానో ఉంది. 2006లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా ఉతప్ప తొలి వన్డే ఆడాడు. అలాగే 2014లో ఐపీఎల్ విజేత కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో సభ్యుడుగా ఉన్నాడు. ఊతప్ప తన కెరీర్లో 46 అంతర్జాతీయ వన్డేలు, 13 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. అయితే అనారోగ్య సమస్యల కారణంగా ఊతప్ప జట్టుకు దూరమయ్యాడు. ఇదిలా ఉండగా ఇప్పుడు ఊతప్పపై అరెస్ట్ వారెంట్ జారీ కావడం క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్ గా మారింది

## అందుకే జట్టులో మార్పులు చేశాం..

### చీఫ్ సెలక్టర్ జార్జ్ బెయిలీ మైండ్ గేమ్

సిరీస్‌లోని చివరి రెండు టెస్టుల కోసం 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఆస్ట్రేలియా ప్రకటించింది. సెలెక్టర్లు యువ సంచలనం 19 ఏళ్ల సామ్ కాన్స్టాస్‌ను జట్టులో చేర్చారు. గబ్బాలో భారత్ కంటే ఆస్ట్రేలియా జట్టు మెరుగ్గా కనిపించినా.. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియన్ ప్లేయర్ల లోపాలు బయటపడ్డాయి. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఇప్పుడు 1-1తో సమంగా ఉంది. మెల్‌బోర్న్‌లో డిసెంబర్ 26 నుండి బాక్సింగ్ డే టెస్ట్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ మినహా మిగిలిన ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్లు గబ్బాలో ప్రత్యేకంగా సాధించిందేమీ లేదు. ఉస్మాన్ ఖవాజా, నాథన్ మెక్‌స్వీనీ మరియు మార్నస్ లాబుస్‌చాగ్నేలు నిరాశపరిచారు. జోష్ హేజిల్‌వుడ్ గాయం ఆ జట్టుని ఇబ్బందుల్లోకి నెట్టింది. ఇప్పుడు మెల్ బోర్న్ పోరుకు ముందు ఆస్ట్రేలియా జట్టులో పలు మార్పులు చేసి ఆ లోపాలను అధిగమించేందుకు ప్రయత్నించింది. సిరీస్‌లోని చివరి రెండు టెస్టుల కోసం 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఆస్ట్రేలియా ప్రకటించింది. సెలెక్టర్లు యువ సంచలనం 19 ఏళ్ల సామ్ కాన్స్టాస్‌ను జట్టులో చేర్చారు. అదే సమయంలో రెడ్ బాల్ అరంగేట్ర ఆటగాడు నాథన్ మెక్‌స్వీనీని సైడ్ చేశారు. మెక్‌స్వీనీ మూడు టెస్టు మ్యాచ్‌ల్లో ఒక్క అర్ధ సెంచరీ కూడా చేయలేకపోయాడు. ఆరు ఇన్నింగ్స్‌లలో 10, 0, 39, 10లి, 9 మరియు 4 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇందులో నాలుగు సార్లు అతను జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్ లో అవుటయ్యాడు. తాజాగా ఆ జట్టు చీఫ్ సెలక్టర్ జార్జ్ బెయిలీ మాట్లాడుతూ.. సామ్ తొలిసారిగా టెస్టు జట్టులోకి



వచ్చాడు. అతని బ్యాటింగ్ శైలి భిన్నంగా ఉంటుంది. అయితే నాథన్‌కు సత్తా ఉందని, భవిష్యత్తులో టెస్టు క్రికెట్‌లో మరిన్ని అవకాశాలు అందుకుంటాడని మాకు నమ్మకం ఉందని తెలిపాడు. మెక్‌స్వీనీని దూరంగా ఉంచాలనే నిర్ణయం సాధారణ విషయం కాదన్నాడు.

ఈ సిరీస్‌లో టాప్ ఆర్డర్ పరుగులు చేయకపోవడం ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో వచ్చే రెండు మ్యాచ్‌లకు బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చాల్సి వచ్చిందన్నాడు. అటు బౌలింగ్‌లో రిచర్డ్‌సన్, సీన్ అబాట్‌లకు సెలక్టర్లు అవకాశం ఇచ్చారు.

## ఫాలో-ఆన్‌ని సమర్థించిన శాస్త్రి

ఒకప్పుడు సిరీస్ లు గెలిచి సంబరాలు చేసుకున్న భారత్ ఇప్పుడు కేవలం ఫాలో-ఆన్‌ను తప్పించుకుని సంబరాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్రిస్బేన్ వేదికగా జరిగిన మూడో టెస్ట్ డ్రాగా ముగిసింది. దీంతో ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ 1-1తో సమంగా నిలిచింది. డిసెంబర్ 26 నుంచి నాలుగో టెస్ట్ మొదలు కానుంది. ఈ డూ ఆర్ డై మ్యాచ్ లో గెలిచిన జట్టు సిరీస్ ను దక్కించుకుంటుంది. పైగా ఈ సిరీస్ ఇరు జట్లకు కాలకంగా మారింది. ఈ సిరీస్ ను కోల్పోతే టీమిండియా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ ఫైనల్ ఆడే అవకాశం లేకుండా పోతుంది. ఈ నేపథ్యంలో టీమిండియా నాలుగో టెస్ట్ ఎలాగైనా గెలవాల్సిన అవసరముంది.



ఒకప్పుడు సిరీస్ లు గెలిచి సంబరాలు చేసుకున్న భారత్ ఇప్పుడు కేవలం ఫాలో-ఆన్‌ను తప్పించుకుని సంబరాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షం కారణంగా టీమిండియా ఫాలో-ఆన్ నుంచి తప్పించుకున్న విషయం తెలిసిందే. దీనిపై టీమిండియాపై విమర్శలు వచ్చినప్పటికీ కొందరు సీనియర్లు దానిని సమర్థిస్తున్నారు. ఫాలో-ఆన్‌ను తప్పించుకుని సంబరాలు చేసుకోవడం సరైనదేనని భారత మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. 2021లో ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో లార్డ్స్‌లో బుమ్రా, మహ్మద్ షమీ మధ్య 89 పరుగుల భాగస్వామ్యాన్ని శాస్త్రి గుర్తుచేసుకున్నాడు, ఈ మ్యాచ్‌లో టీమిండియా చివరి వరకు పోరాడింది. క్లిష్ట పరిస్థితుల నుంచి భారత్‌ను గట్టెక్కించేందుకు లోయర్ ఆర్డర్ ప్రాముఖ్యతను కూడా ఆయన ఎత్తిచూపారు. ఆ సిరీస్ లో చివరి రోజు టెస్ట్ ఇంగ్లండ్ ఆధిక్యంలో ఉంది. అయితే టీమిండియా ఒక్కసారిగా ఆటను తిప్పేసిందని శాస్త్రి గుర్తు చేసుకున్నాడు. జట్టు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు టెయిల్ ఎండర్లు పోరాడుతారని ఆయన చెప్పారు. గత పర్యటనలో అదే జరిగింది. గబ్బా వేదికగా జరిగిన మ్యాచ్ లో అశ్విన్ ,హనుమ విహారి మ్యాచ్‌ను కాపాడిన రోజుల్ని ఆయన గుర్తు చేసుకున్నాడు.

# జాతీయం - అంతర్జాతీయం



## అమిత్ షా వ్యాఖ్యలపై ప్రతిపక్షాల ఆందోళన

న్యూఢిల్లీ : లోక్‌సభ శుక్రవారం ప్రారంభం కాగానే జమిలి బిల్లును జెపిసికి పంపాలనే తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. దీనిని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. అనంతరం అంబేద్కర్‌ను అవమానిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన కొనసాగుతుండగానే స్పీకర్ ఓం బిర్లా లోక్ సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమయంలో ప్రధాని మోడీ కూడా సభలో ఉన్నారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీలో 12 మంది రాజ్యసభ సభ్యులకు చోటు కల్పించాలని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ప్రవేశపెట్టిన తీర్మానానికి రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆ తరువాత అమిత్ షా వ్యాఖ్యలపై సభలో ప్రతిపక్ష ఎంపిలు నిరసనకు దిగడంతో రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేశారు. ఉభయసభల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఇండియా బ్లాక్ ఎంపీలు ఆందోళన చేపట్టారు. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వారు తప్పుపట్టారు. అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించిన ఆయన రాజీనామా చేయాలంటూ నినదించారు. సభ్యులంతా అంబేద్కర్ చిత్రపటాలతో ఆందోళనలో పాల్గొన్నారు. జైభీం అంటూ నినాదాల ఇచ్చారు

## మోహన్ భగవత్ మరో కపట నాటకం



పూణె : ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ మరో కపట నాటకానికి తెర తీశారు. వారణాసిలో జ్ఞాన్ వాపి, మధురలో షాహి ఈద్గా, శంభాల్‌లోని షాహి జామా మసీదుల కింద ఆలయాలు ఉన్నాయంటూ ఒక వైపు మత విద్వేషాలను రెచ్చగొడుతూ, మరో వైపు మందిర్-మసీదు వివాదాలు తలెత్తుతుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. 'విశ్వగురు భారత్' అన్న అంశంపై సహజీవన్ అనే ఓ ఎన్‌జివో సంస్థ గురువారం నాడిక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మోసపూరిత ప్రకటనలకు పెట్టింది పేరైన ఆరెస్సెస్ చీఫ్ లెక్చరిస్తూ, "ఉగ్రవాదం, దుందుడుకుతనం, బలవంతపు చర్యలు, ఇతర దేవుళ్లను కించపరచడం మన దేశ లక్షణం కాదని" సెలవిచ్చారు. ఇతర మతాలను కించపరిచే ధోరణి పెరుగుతోందని, ఇది మంచిది కాదని అన్నారు. వారణాసిలో గ్యాన్‌వాపి మసీదు వివాదంపై తదుపరి సర్వేకు సంబంధించిన కేసులో విచారణను అలహాబాద్ హైకోర్టు వాయిదా వేసిన కొద్ది సేపటికే ఆరెస్సెస్ చీఫ్ ఈ సూక్తి ముక్తావళిని వినిపించడం గమనార్హం. దశాబ్దాల నాటి మసీదులు హిందూ ఆలయాలను కూలదోసి కట్టారంటూ కోర్టుల్లో సంఘ్ పరివార్ గ్రూపులు దేశవ్యాపితంగా కోర్టుల్లో పిటిషన్లు మీద పిటిషన్లు వేస్తూ, మత ఘర్షణలు రెచ్చగొడుతుంటే ఎన్నడూ నోరు మెదపని భగవత్ మత సామరస్యం, దయాగుణం గురించి లెక్చరిస్తున్నారు. అంబేద్కర్ గురించి రాజ్యసభలో అమిత్‌షా చేసిన అవమానకర వ్యాఖ్యలపై దేశవ్యాపితంగా నిరసనాగ్రహాలు వ్యక్తమవుతున్న తరుణంలో దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ కపట నాటకానికి తెర తీసినట్లు పరిశీలకులు పేర్కొంటున్నారు. మత విభజనలు సృష్టించడం ద్వారా 'హిందూ లీడర్లు' కాలేరు, మసీదుల కింద శివలింగాల గురించి వెతకొద్దు, భారత్‌లో అందరూ సామరస్యంతో జీవిస్తున్నారని ప్రపంచానికి సందేశమివ్వాలి వంటి డైలాగులను ఆయన వల్లించారు. రైతుల ఉద్యమాన్ని ఆరెస్సెస్ కనుసన్నల్లోని బిజెపి ప్రభుత్వం ఒక వైపు అణచివేస్తుంటే, ఈయనగారు రైతుల పరిస్థితి పై మొసలి కన్నీరు కార్చారు. భగవత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ ఎక్స్‌లో స్పందిస్తూ ఆరెస్సెస్ చీఫ్ మాటలను సంఘపరివార్‌కు శిరోధార్యం కావాలని అన్నారు

## రాజస్థాన్‌లో ఘోర అగ్ని ప్రమాదం



జైపూర్ : రాజస్థాన్‌లో దారుణం చోటు చేసుకున్నది. జైపూర్‌లోని ఓ రహదారిపై ట్రక్కు బీభత్సం సృష్టించటంతో అక్కడ భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. మంటలు పెట్రోల్ బంకుకూ వ్యాపించాయి. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. వారిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నది. పదుల సంఖ్యలో వాహనాలు దగ్ధమయ్యాయి. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్-అజ్మీర్ హైవే వద్ద ఓ పెట్రోల్ పంపు బయట సీఎన్‌జీ ట్యాంకర్ పార్క్ చేసి ఉన్నది. వేగంగా వచ్చిన ఓ ట్రక్కు ఇతర వాహనాలను ఢ కొనటంతో సీఎన్‌జీ ట్యాంకర్‌కు మంటలు అంటుకున్నాయి. మంటలు ఉవ్వెత్తున ఎగిసి అది కాస్తా పెట్రోల్ బంకుకు వ్యాపించాయి. ఈ మంటల్లో 30 ట్రక్కులతో పాటు మరిన్ని వాహనాలు దగ్ధమైనట్టు సమాచారం. ఉదయం 5.30 గంటలకు ఈ ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ ఘటనలో 11 మంది చనిపోయారు. 40 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో 28 మంది పరిస్థితి విషమంగా ఉన్నది. ప్రమాదానికి సంబంధించిన సమాచారం అందగానే 20 అగ్నిమాపక యంత్రాలతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో బంకు నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. పెద్ద ఎత్తున పొగ కమ్ముకున్నది. పేలుడు శబ్దం పది కిలోమీటర్ల దూరం వరకు వినబడినట్టు స్థానికులు చెప్తున్నారు.

వాహనాలను ఢకొట్టిన ట్రక్కులో మండే రసాయనాలు ఉన్నట్టు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. బాధితులను దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అనంతరం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, సీఎంతో ఫోన్లో ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## జమిలీ బిల్లులపై జేపీసీ చైర్మెన్‌గా పీపీ చౌదరి

న్యూఢిల్లీ: జమిలీ ఎన్నికలకు సంబంధించి రెండు రాజ్యాంగ సవరణ బిల్లులపై ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చైర్మెన్‌గా బీజేపీ ఎంపీ పీపీ చౌదరి నియమితుల య్యారు. అలాగే కమిటీ సభ్యుల సంఖ్యనూ పెంచారు. తొలుత 31 మంది జేపీసీ సభ్యులని ప్రకటించి 21 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులని తెలిపారు. ఆ తర్వాత సభ్యుల సంఖ్యను 31 నుంచి 39కి పెంచారు. ప్రస్తుతం లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు. దీంతో జేపీసీలో మరికొంత మంది సభ్యులకు అవకాశం కల్పించారు. దీంతో మరో ఇద్దరు బీజేపీ సభ్యులు పెరిగారు. అలాగే ఎస్పీ నుంచి మరొకరికి, సీపీఐ(ఎం), శివసేన (ఉద్దవ్ ఠాక్రే), ఎల్‌జేపీ నుంచి ఒక్కొక్కరికి అవకాశం లభించింది. 39 మంది సభ్యుల గల జేపీసీలో 16 మంది బీజేపీ, ఐదుగురు కాంగ్రెస్, ఇద్దరు ఎస్పీ, ఇద్దరు టీఎంసీ, ఇద్దరు డీఎంకే, ఒక్కొక్కరు చొప్పున సీపీఐ(ఎం), శివసేన (ఠాక్రే), ఎన్‌సీపీ, ఆప్, బీజేడీ, టీడీపీ, జనసేన, వైసీపీ, జేడీయూ, శివసేన (శిండే), ఆర్ఎల్‌డీ, ఎల్‌జేపీ ఉన్నారు. కమిటీ సభ్యులు బీజేపీకి చెందిన పీపీ చౌదరి, సీఎం రమేష్, బాన్సూరి స్వరాజ్, పురుషోత్తం రూపాలా, అనురాగ్ సింగ్ ఠాకూర్, విష్ణు దయాళ్ రామ్, భర్తృహరి మహతాబ్, సంబిత్ పాత్ర, అనిల్ బలుని, విష్ణుదత్ శర్మ, బైజయంత్ పాండే, సంజరు జైస్వాల్ ఉన్నారు. జీఎం హరీష్ బాలయోగి (టీడీపీ), శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే (శివసేన షిండే), చందన్ చౌహాన్ (ఆర్ఎల్‌డీ), వల్లభనేని బాలశౌరి (జనసేన), శాంభవి (ఎల్‌జేపీ) ఉన్నారు. కమిటీలో కాంగ్రెస్‌కు చెందిన ప్రియాంక గాంధీ వాద్రా, మనీష్ తివారీ, సుఖదేయో భగత్ ఉన్నారు. ధర్మేంద్ర యాదవ్, ఛోటేలాల్ (ఎస్పీ), కళ్యాణ్ బెనర్జీ (టీఎంసీ), టిఎం సెల్వగణపతి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్‌సీపీ), కె.రాధాకృష్ణన్ (సీపీఐ(ఎం)), అనిల్ దేశారు (శివసేన ఉద్దవ్ ఠాక్రే) ఉన్నారు. రాజ్యసభకు చెందిన ఘనశ్యామ్ తివారీ, భువనేశ్వర్ కలిట, కె.లక్ష్మణ్, కవితా పాటిదార్ (బీజేపీ), సంజరు కుమార్ ఝా (జేడీయూ), రణదీప్ సింగ్ సుర్జేవాలా, ముకుల్ వాస్నిక్ (కాంగ్రెస్), సాకేత్ గోఖలే (టీఎంసీ), పి.విల్సన్ (డీఎంకే), సంజరుసింగ్ (ఆప్), మానస్ రంజన్ మంగరాజ్ (బీజేడీ), వి.విజయసాయి రెడ్డి (వైసీపీ) ఉన్నారు.

## శాన్‌ఫ్రాన్సిస్కోలో జాకీర్ హుస్సేన్ అంత్యక్రియలు

న్యూయార్క్: ఈ నెల 16న కన్నుమూసిన ప్రముఖ తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ అంత్యక్రియలు శుక్రవారం ఇక్కడ జరిగాయి. అక్కడకు కొద్ది దూరంలో ప్రముఖ డ్రమ్ వాయిద్యకారుడు శివమణి సహా పలువురు సంగీత కళాకారులు ఆయనకు తమ సంగీత స్వరాలతో ఘనంగా నివాళి అర్పించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఫెర్న్‌వుడ్ సిమెట్రీలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. చివరిసారిగా తమ నివాళి ఘటించేందుకు వందల సంఖ్యలో ఆయన అభిమానులు అక్కడకు వచ్చారు. అనంతరం శివమణి మీడియాతో మాట్లాడారు. 1982 నుండి ఇప్పటివరకు సాగిన ఈ ప్రయాణంలో జాకీర్ భాయి నుండి తాను చాలా నేర్చుకున్నానని చెప్పారు. చివరిసారిగా తన నివాళి అర్పించేందుకే తానిక్కడకు వచ్చినట్లు చెప్పారు. తన ప్రతిభతో శాస్త్రీయ సంగీతానికి, పాశ్చాత్య సంగీతానికి మధ్య హద్దులు చెరిపేసిన జాకీర్ హుస్సేన్ భారతదేశం గర్వించదగిన సంగీత విద్యాంసుల్లో ఒకరు. తన ఆరు దశాబ్దాల సంగీత జీవితంలో అనేకమంది జాతీయ, అంతర్జాతీయ కళాకారులతో కలిసి పనిచేశారు. గ్రామీ విజేత రికీ కెజ్, జాకీర్‌తో తనకు గల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఘనమైన జాకీర్ వారసత్వం ఎన్నటికీ నిలిచి వుంటుందని, రాబోయే తరాలను అమితంగా ప్రభావితం చేస్తూనే వుంటుందని పేర్కొన్నారు.

## జర్మనీలో కారు బీభత్సం

బెర్లిన్: జర్మనీలోని మగ్‌డెబర్గ్ ప్రాంతలో క్రిస్మస్ మార్కెట్‌లో కారు బీభత్సం సృష్టించింది. కిస్మస్ మార్కెట్‌లో పాదచారులపైకి అతి వేగంగా కారు దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ ప్రమాదంలో 68 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు.

క్షతగాత్రులలో 15 మంది పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. పాదచారులను ఢీకొట్టిన తరువాత కారు 400 మీటర్లు దూసుకెళ్లింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బిఎండబ్ల్యు కారు డ్రైవ్ చేసిన వ్యక్తి డాక్టర్ సక్సోనీ అన్‌హల్ట్‌గా(50) గుర్తించారు. సౌదీ అరేబియా చెందిన సక్సోనీ 2006 నుంచి జర్మనీలో ఉంటున్నాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## ప్రధాని కువైట్ పర్యటన

కువైట్ : భారత ప్రధాని నరేంద్రమోడీ రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం కువైట్ చేరుకున్నారు. గతంలో ప్రధానిగా ఉన్న సమయంలో ఇందిరాగాంధీ 1981లో కువైట్‌ని సందర్శించారు. 2009లో భారత ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ ఈ అగేయాసియా దేశాన్ని సందర్శించారు. దాదాపు 43 ఏళ్ల తర్వాత కువైట్‌ని సందర్శించిన రెండవ ప్రధానిగా మోడీ నిలిచారు. కువైట్ అమీర్ షేక్ మెషల్ అల్ అహ్మద్ అల్ జాబర్ అల్-సబా ఆహ్వానం మేరకు ప్రధాని కువైట్ పర్యటించనున్నారు. మోడీ రెండు రోజుల పర్యటనలో కువైట్ ప్రధాని, ఆ దేశ యువరాజు సబా అల్-ఖలిద్ అల్-సబాతో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఇరు దేశాల వాణిజ్యం, పెట్టుబడి, విద్యుత్, సంస్కృతులపై, ప్రజల మధ్య సంబంధాలపై ఇరు ప్రధానులు చర్చించుకోనున్నారు. కాగా, ఈ పర్యటనలో భాగంగా మోడీ భారతీయ బ్లూ కాలర్ కార్మికులు ఉన్న లేబర్ క్యాంప్‌ను కూడా సందర్శించనున్నారు. భారతీయ కమ్యూనిటీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నారు. గల్ఫ్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఆయన హాజరుకానున్నారు. మెడీ పర్యటన ఇరు దేశాల మధ్య కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది.



## ఆ పదవికి అమిత్ షా అనర్హులు

న్యూఢిల్లీ : భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా చర్చ జరుగుతున్న సమయంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ అంబేద్కర్ గురించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమైనవని ఐద్వా పేర్కొంది. పైగా ప్రధాని నరేంద్ర మోడీ ఆయనకు మద్దతుగా నిలబడడం సిగ్గుచేటైన వ్యవహారమని విమర్శించింది.

ఈ వ్యాఖ్యలతో హెూం మంత్రి, బిజెపి-ఆర్ఎస్ఎస్ మనువాదీ వైఖరి బయటపడిందని వ్యాఖ్యానించింది. ఇటువంటి విపరీత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా ఇక కేంద్ర హెూం మంత్రి పదవిలో కొనసాగడానికి అర్హత లేదని ఐద్వా పేర్కొంది. ఈ వ్యాఖ్యలకు నిరసనగా ఇతర మహిళా సంఘాలు, ప్రజాస్వామ్య, లౌకిక వర్గాలతో కలిసి దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు ఐద్వా ప్రకటించింది.




## అమెజాన్ వర్కర్ల సమ్మె

### అమెరికా చరిత్రలోనే అతి పెద్దది

న్యూయార్క్: అమెరికా వ్యాప్తంగా ఉన్న అమెజాన్ కేంద్రాల వద్ద సంస్థ కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు. అమెరికా కాలమానం ప్రకారం గురువారం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమైన ఈ అన్‌ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్ (యుఎల్‌పి) సమ్మె ఆ దేశ చరిత్రలోనే అతి పెద్దది. కార్మిక హక్కులను అమెజాన్ సంస్థ ఉల్లంఘిస్తోందని కార్మికులు విమర్శిస్తున్నారు. తక్కువ వేతనాలు, భద్రతలేని పని వాతావరణానికి వ్యతిరేకంగా వారు ఆందోళన కొనసాగిస్తున్నారు. తమ యూనియన్‌ను గుర్తించాలని, చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేస్తున్నారు. న్యూయార్క్, అట్లాంటా, కాలిఫోర్నియా, శాన్‌ఫ్రాన్సిస్కో, ఇల్లినాయిస్ వంటి అన్ని ప్రధాన నగరాల్లోనూ అమెజాన్ కేంద్రాల వద్ద ఈ సమ్మె కొనసాగుతోంది. ఇంటర్నేషనల్ బ్రదర్‌హుడ్ ఆఫ్ టీమ్‌స్టర్స్ నేతృత్వంలో ఈ సమ్మెలో కార్మికులు పాల్గొంటున్నారు. టీమ్‌స్టర్స్ ప్రతినిధి కారా డెనిజ్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి కార్మికులను అమెజాన్ సంస్థ దోపిడీ చేస్తోందని విమర్శించారు. అమెజాన్ కార్మికులకు సరైన వేదిక లేని కారణంగా టీమ్‌స్టర్స్‌తో కలిసి సమ్మెకు దిగారని వివరించారు. అమెరికాలోని ఇతర లాజిస్టిక్స్ పరిశ్రమల్లోని యుపిఎస్ కార్మికుల మాదిరిగానే అమెజాన్ కార్మికులు కూడా పనిచేస్తారని, వీరికి తక్కువ ప్రోత్సాహకాలు, భద్రతతో స్వల్ప వేతనాలు లభిస్తున్నాయని తెలిపారు.

## గాజా, వెస్ట్‌బ్యాంక్‌ల్లో ఇజ్రాయిల్ బాధ్యతలేమిటో చెప్పాలి



న్యూయార్క్: పాలస్తీనియన్ల మనుగడకు అవసరమైన మానవతా సాయం అందించడానికి గాజా, వెస్ట్ బ్యాంక్‌ల్లో ఇజ్రాయిల్ చేపట్టాల్సిన చర్యలు, బాధ్యతలేంటో చెప్పాలని అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ కోరింది. ఈ మేరకు గురువారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఐసిజె అభిప్రాయాన్ని కోరుతూ నార్వే ప్రతిపాదించిన ఈ తీర్మానం 137-12 ఓట్ల తేడాతో ఆమోదం పొందింది.

ఓటింగ్‌కు 22 దేశాలు గైర్హాజరయ్యాయి. ఇజ్రాయిల్ మిత్రపక్షమైన అమెరికా ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. మొత్తం 193మంది సభ్యులు గల జనరల్ అసెంబ్లీ చేసిన ఈ తీర్మానానికి చట్టబద్ధంగా కట్టుబడి వుండాల్సిన అవసరం లేనప్పటికీ ప్రపంచ ప్రతినిధుల అభిప్రాయాలేంటనేది దీనిలో ప్రతిబింబిస్తుంది. ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయిల్ మకాం వేయడం చట్ట విరుద్ధమని జులైలో కోర్టు పేర్కొంది. తక్షణమే ఈ ఆక్రమణలకు స్వస్తి చెప్పాలని, అక్కడ ఆవాసాల నిర్మాణాన్ని ఆపేయాలని కోరింది. ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్ధుల సంస్థ కార్యకలాపాలపై ఇజ్రాయిల్ నిషేధం విధించిన నేపథ్యంలో ఐరాస ఈ తీర్మానం చేయడం గమనార్హం. ఈ సందర్భంగా ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ మాట్లాడుతూ, యుఎన్ఆర్‌డబ్ల్యుఎను నిషేధించినట్లైతే పాలస్తీనియన్ల మౌలికావసరాలను తీర్చాల్సిన బాధ్యత ఇజ్రాయిల్‌దేనని స్పష్టం చేశారు. గాజాలో వందలు వేల సంఖ్యలో చోటు చేసుకున్న మరణాలకు అంతర్జాతీయ సమాజం బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం వుందని నార్వే డిప్యూటీ విదేశాంగ మంత్రి ఆండ్రెస్ క్రవిక్ వ్యాఖ్యానించారు. ఓటింగ్‌కు ముందు ఇజ్రాయిల్ రాయబారి డానీ డానన్ మాట్లాడుతూ, పనికిరాని విషయాలపైనే మళ్ళీ మళ్లీ సభ్యులు చర్చిస్తున్నారని వ్యాఖ్యానించారు.

## ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు జుబేర్ అరెస్టుపై హైకోర్టు స్టే



ప్రయాగ్‌రాజ్ : ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు మహ్మద్ జుబేర్‌ను అరెస్టు చేయకుండా అలహాబాద్ హైకోర్టు శుక్రవారం స్టే విధించింది. యతి నర్సింగానంద్ సహచరుడు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో వివిధ మత గ్రూపుల మధ్య శతృత్వం పెచ్చరిల్లేలా వ్యవహరిస్తున్నారంటూ జుబేర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశా రు. ముస్లింలు హింసకు పాల్పడాలనే ఉద్దేశంతో అక్టో బరు 3 నాటి నర్సింగానంద్ పాత వీడియో క్లిప్‌ను పోస్ట్ చేశారని జుబేర్‌పై యతి నర్సింగానంద్ సరస్వతి ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఉదితా త్యాగి ఫిర్యాదు చేశారు. పైగా ఎడిట్ చేసిన క్లిప్‌లను ఎక్స్‌లో పోస్టు చేశారని ఆరోపించారు. మహ్మద్ ప్రవక్తపై నర్సింగానంద్ చేసిన వ్యాఖ్యలను జుబేర్ ఖండించారు. గత నెల్లో ఘజియా బాద్ పోలీసులు ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై జుబేర్ హైకోర్టును ఆశ్రయించారు. ఆ ఎఫ్ఐ ఆర్‌ను కొట్టివేసి, తనకు రక్షణ కల్పించాలన్నారు. నర్సింగానంద్ పై హింసను రెచ్చగొట్టేలా తన పోస్ట్ లేదని పేర్కొన్నారు. నర్సింగానంద్ చర్యల గురించి పోలీసులను అప్రమత్తం చేయాలన్నదే తన ఉద్దేశమన్నారు.



# చక్కని ఆరోగ్యం



## షుగర్ పేషెంట్స్ జామ తింటే ఏమౌతుంది?

అలాంటి జామపండులో రెండు రకాలు ఉన్నాయి. తెలుపు, గులాబీ రెండు రకాలు ఉంటాయి. అయితే, డయాబెటిక్ బాధితులు పింక్ జామకాయ తింటే ఏమౌతుందో ఇక్కడ తెలుసుకుందాం. సంపూర్ణ ఆరోగ్యానికి పండ్లు మంచి పోషకాహారం అని మనందరికీ తెలుసు. పండ్లలో ముఖ్యంగా జామకాయ గురించి చెప్పుకోవాలి. జామకాయను పేదవాడి యాపిల్ అని కూడా పిలుస్తారు. జామకాయలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే దీన్ని సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. జామకాయ పోషకాల పవర్ హౌస్. అలాంటి జామపండులో రెండు రకాలు ఉన్నాయి. తెలుపు, గులాబీ రెండు రకాలు ఉంటాయి. అయితే, డయాబెటిక్ బాధితులు పింక్ జామకాయ తింటే ఏమౌతుందో ఇక్కడ తెలుసుకుందాం.. పింక్ జామలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇందులో చక్కెర, కార్బస్ , విటమిన్ సి తక్కువగా ఉంటాయి. దీనికి గింజలు కూడా తక్కువ. తెల్లజామలో చక్కెర, స్టార్చ్, విటమిన్ సి, విత్తనాలు ఎక్కువగా ఉంటాయి. తెల్ల జామలో యాంటీఆక్సిడెంట్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. పింక్ జామలో యాంటీఆక్సిడెంట్ కంటెంట్ ఇంకా ఎక్కువగా ఉంటాయి. గులాబి జాయకాయలో విటమిన్ సి, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. పింక్ జామకాయల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం. విటమిన్ సి వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి, జలుబు, ఫ్లూ వంటి వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం వల్ల డయాబెటిస్ ఉన్నవారికి మంచిది. పింక్ జామకాయల్లో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. పింక్ జామకాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం, ఇవి క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడతాయి. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి, మలబద్ధకం తగ్గుతుంది.

## చలికాలంలో కొబ్బరి నీళ్లు తాగితే!

కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో పుష్కలంగా ఉండే ఎలక్ట్రోలైట్స్, హైడ్రేషన్ గుణాలు శరీరానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. అయితే కొబ్బరి నీళ్లు చలికాలంలో తాగితే ఆరోగ్య సమస్యలు కలగుతాయని కొందరు భావిస్తుంటారు. ఇందులో ఏమాత్రం నిజం లేదని పలువురు నిపుణులు చెబుతున్నారు. శీతాకాలంలో కొబ్బరినీళ్లు తాగితే ఏమౌతుందో ఇక్కడ తెలుసుకుందాం.. చలికాలంలో చాలామంది నీటిని తక్కువగా తాగుతారు. దాంతో డీహైడ్రేషన్ సమస్యలు వస్తాయి. కానీ కొబ్బరి నీరు చలికాలంలో కూడా శరీరానికి హైడ్రేషన్ అందించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే చలికాలంలో వచ్చే చర్మ పగుళ్ళు, జలుబు, దగ్గు వంటి సమస్యలు కూడా దూరమవుతాయి. కొబ్బరి నీళ్లతో పలు ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. కొబ్బరి నీరు జీర్ణశక్తిని కూడా మెరుగుపరుస్తుంది. ఎసిడిటీ, కడుపు నొప్పులు, పొట్ట ఉబ్బరం వంటి సమస్యలను నివారిస్తుంది. చలికాలంలో వచ్చే రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు కూడా కొబ్బరి నీరు తాగడం ద్వారా అదుపులో ఉంటాయి. కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం, ఎంజైమ్‌లు శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపి, శరీరాన్ని శుద్ధి చేస్తాయి. చాలా మంది చలికాలంలో చర్మం పొడిబారడం, కష్టపడటం వంటి సమస్యలు ఎదుర్కొంటారు.కానీ కొబ్బరి నీరు చర్మాన్ని పుష్కలంగా హైడ్రేట్ చేసి, ఈ సమస్య నుండి బయటపడేందుకు సాయపడుతుంది. చలికాలంలో కొబ్బరి నీరు తాగడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో తరచుగా వచ్చే జలుబు, దగ్గు వంటి సమస్యలు దూరమవుతాయి. పౌష్టికాహార నిపుణులు



కూడా చలికాలంలో కొబ్బరి నీరు తాగడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచిస్తున్నారు. చలికాలంలో వచ్చే జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేయడంలో కూడా కొబ్బరి నీరు ఉపయోగడుతుంది. ముఖ్యంగా ఎసిడిటీతో వచ్చే పొట్ట ఉబ్బరం, కడుపు నొప్పి వటి సమస్యలన్నీ దూరమవుతాయి. ఇందులో ఉండే మెగ్నీషియం కంటెంట్ రక్తపోటును అదుపులో ఉంచుతుంది. దీంతో గుండె ఆరోగ్యం మెరుగవుతుంది.

## అటిక మామిడి తీగ గురించి తెల్సా!

ప్రకృతి సిద్ధంగా మన పరిసరాల్లో సమృద్ధిగా పెరిగి, లభించే ఔషధ గుణాలు కలిగిన మొక్కలను, వనమూలికలను ఉపయోగించి ప్రమాదకరమైన మొండి వ్యాధులను సైతం మన పూర్వికులు తరిమి కొట్టేవారు. ఇప్పుడు అలంటి ఓ మొక్క గురించి మీకు తెలియజేయబోతున్నాం. మన చుట్టుపక్కల పరిసరాల్లోని పెరిగే మొక్కల్లో ఎన్నో ఔషద గుణాలు దాగి ఉన్నాయి. తరాలు మారిపోవడంతో.. మనకే వాటి గురించి తెలియక పిచ్చి మొక్కలు అనుకుంటూ పీకి పారేస్తున్నాం.



కొన్ని మొక్కలు అయితే  లక్షల రూపాయలు ఖర్చుచేసినా నయంకాని వ్యాధులను తరిమికొట్టేస్తాయి. మన పూర్వీకులు.. ఆయుర్వేద పద్ధతుల ఫాలో అయ్యి..  రూపాయి ఖర్చు లేకుండా ఎన్నో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందేవారు. అందుకే అప్పట్లో పెరట్లో ఎన్నో ఔసధ గుణాలను ఉన్న మొక్కల్ని పెంచేవారు. అందులో ఒకటి అటిక మామిడి తీగ. పల్లెల్లో విరివిగా కనిపిస్తుంది.. దీనిని అంటుడు కాయ మొక్క అని కూడా కొన్ని ప్రాంతాల్లో పిలుస్తారు.కిడ్నీ సమస్యలన్నిటికీ ఇది మంచి సొల్యూషన్ అంటుంటారు. కిడ్నీలో రాళ్లు ఏర్పడినా, ఇతరత్రా వ్యాధులు వచ్చినా, వచ్చే అవకాశాలున్నా దీన్ని వాడితే.. మీ కిడ్నీల సమస్యలన్నీ మటుమాయం అయిపోతాయట. కిడ్నీలు దయాలసిస్ వరకు వచ్చిన వారి ప్రాణాలను సైతం అటిక మామిడి కాపాడిందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అటిక మామిడి తీగను తెంచుకుని ఆకులు, పువ్వులు, రెమ్మలు, వేర్లతో సహా సన్నని ముక్కలుగా చేసుకోవాలి. 200 మి.లీ. నీటిని ఓ గిన్నెలో తీసుకుని సన్నని సెగపై 5-10 నిమిషాలు మరిగించాలి. మరిగే క్రమంలోనే అందులో ఆ ముక్కలను వేయలి.  తర్వాత ఆకుల్లోని సారం దిగి రసంగా మారిన తర్వాత వడకట్టి రసం వరకు ఓ గ్లాసులోకి తీసుకోవాలి.రోజూ ఉదయం 50మి.లీ. నీటిని తాగితే సరిపోతుంది. అటిక మామిడి తీగ ఊళ్లలో, చేలల్లో ఎక్కడపడితే అక్కడ పెరుగుతుంది. కిడ్నీ వ్యాధులకు సంబంధించిన ఇంగ్లిష్ మందుల్లో దీనిని ఎక్కువగా వాడతారని తెలిసింది.దీనిని మిగిలిన ఆకు కూరల్లాగానే వండుకుని తినవచ్చట.కళ్ల నుంచి కాళ్ల వరకు, శిరస్సు నుంచి పాదాల వరకు అన్ని అవయవాలకు చక్కటి పోషకాలు ఇస్తుందని ఆయుర్వేదం చెబుతోంది. ఇది తాగడం వల్ల వారానికి 3సార్లు చేసే డయాలసిస్ క్రమంగా ఒక్కసారికి వచ్చి తర్వాత అవసరమే ఉండదన్నది ఆయుర్వేద నిపుణులు చెబుతున్న మాట.

# వేడి నీళ్లతో స్నానం చేస్తున్నారా..?



చలికాలంలో చాలా మంది వేడి నీటితో స్నానం చేస్తారు.. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ఇలా చేస్తుంటారు.. అయితే.. వేడి నీటితో స్నానం చేయడం వల్ల ఉల్లాసంగా అనిపిస్తుంది.. శారీరకంగా ఓదార్పునిస్తుంది. ఈ క్రమంలో మీరు, బీపీ లేదా హార్ట్ పేషెంట్ అయితే కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి.. లేకపోతే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. చలి విజృంభిస్తోంది.. ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. అయితే, శీతాకాలంలో స్నానం చేయడానికి వేడి నీటిని ఉపయోగించడం చాలా సౌకర్యవంతమైన ఎంపిక.. ఈ అలవాటు శారీరక సౌఖ్యాన్ని అందించడమే కాకుండా మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. అయితే, వేడి నీళ్లతో స్నానం చేయడం వల్ల ప్రయోజనాలతో పాటు కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా హృద్రోగులకు స్నానం చేసే నీటి ఉష్ణోగ్రత సరిగ్గా ఉండటం చాలా ముఖ్యం. అటువంటి పరిస్థితిలో, చలికాలంలో ఆరోగ్యంగా ఉండేందుకు ఏ రకమైన నీటితో స్నానం చేయడం ఆరోగ్యానికి ప్రయోజనకరం.. ఎలాంటి తప్పులు చేయకూడదు.. అనే విషయాలను తెలుసుకోవడం చాలామంచిది. కొన్ని అనారోగ్య సమస్యలున్న వారు వేడినీటితో స్నానం చేయడం వల్ల గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం పెరిగే అవకాశం ఉందంటున్నారు వైద్య నిపుణులు.. ఇలాంటి పరిస్థితుల్లో వేడి నీటితో స్నానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, దుష్ప్రభావాలు ఏంటో తెలుసుకోండి.. వేడి నీటితో స్నానం చేయడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడి తగ్గుతుంది. వేడి నీటితో స్నానం చేయడం వల్ల కండరాల ఒత్తిడి తగ్గుతుంది. ఇది శారీరక ఉపశమనాన్ని అందిస్తుంది.


ఇది కాకుండా, ఇది శరీర రక్త ప్రసరణను కూడా పెంచుతుంది. దీని కారణంగా ఆక్సిజన్, పోషకాలు అన్ని శరీర భాగాలకు సరిగ్గా చేరుతాయి.వేడి నీరు చర్మ రంధ్రాలను తెరుస్తుంది.. మురికిని బయటకు తీస్తుంది.. తద్వారా చర్మాన్ని శుభ్రపరుస్తుంది.వేడి నీటితో స్నానం చేయడం వల్ల శరీరం మొత్తం ఉపశమనం పొందుతుంది.. ఇది దృఢత్వం, నొప్పి నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది.

వేడి నీరు చర్మం సహజ తేమను తొలగిస్తుంది. దీని వలన చర్మం పొడిబారుతుంది. చికాకు, దురద లేదా పగుళ్లు ఏర్పడవచ్చు.వేడి నీళ్లతో స్నానం చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి, బీపీ పెరుగుతుంది. ముఖ్యంగా ఇప్పటికే బిపి లేదా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఇది ప్రాణాంతకం.. కొందరికి బాగా వేడి నీళ్లతో స్నానం చేసిన తర్వాత తల తిరగడం కూడా అనిపించవచ్చు.. ఎందుకంటే శరీరం బలహీనంగా, అలసటగా అనిపిస్తుంది. తలనొప్పి, డీహైడ్రేషన్, వికారం, మూర్ఛపోవడం లాంటి సమస్యలను కూడా ఎదుర్కొవాల్సి ఉంటుంది. శీతాకాలంలో స్నానం చేయడానికి నీటి ఉష్ణోగ్రత చాలా చల్లగా లేదా చాలా వేడిగా ఉండకూడదు. గోరువెచ్చని నీరు ఉత్తమ ఎంపిక.. ఇది సౌకర్యవంతంగా ఉండటమే కాకుండా చర్మం, బిపిపై మంచి ప్రభావాన్ని చూపుతుంది. మీరు వేడి నీటితో స్నానం చేస్తుంటే, స్నానం చేసిన తర్వాత మాయిశ్చరైజర్‌ను సరిగ్గా అప్లై చేయడం కూడా ముఖ్యం.. తద్వారా చర్మం తేమగా ఉంటుంది.

## చలికాలంలో రాత్రిపూట చెమట పట్టుతుందా..?

చలికాలపు రాత్రులలో, అందరూ వెత్తని బొంత వెచ్చదనాన్ని ఆస్వాదిస్తుంటారు.. కానీ.. కొంతమంది చెమటతో తడిసి ముద్దవుతుంటారు.. వారికి నిద్ర కూడా సరిగా ఉండదు.. వేసవిలో అయితే సాధారణం కానీ.. చలికాలంలో ఇలా పదే పదే జరుగుతుంటే తేలిగ్గా తీసుకోవడం సరికాదంటున్నారు వైద్య నిపుణులు. చలికాలం ప్రారంభమైంది.. ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి.. దీంతో అందరూ తీవ్రమైన చలికి వణికిపోతున్నారు.. వాస్తవానికి, చలికాలపు రాత్రులలో అందరూ మెత్తని బొంత, రగ్గులు కప్పుకుని వెచ్చదనాన్ని ఆస్వాదిస్తుంటారు.. అయితే.. కొందరు చెమటతో తడిసి మేల్కొంటారు. ఎంత చల్లగా ఉన్నా రాత్రిపూట చెమట ఎక్కువగా పడుతుంది.. ఇలా పదే పదే జరుగుతుంటే తేలిగ్గా





తీసుకోవడం సరికాదంటున్నారు వైద్య నిపుణులు.. చల్లని వాతావరణంలో రాత్రిపూట చెమటలు పట్టడం అనేది కొన్ని తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చలిలో కూడా రాత్రి చెమటలు పట్టడం వెనుక అనేక కారణాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అత్యంత సాధారణ కారణాలు హార్మోన్ల అసమతుల్యత, ఇన్ఫెక్షన్ లేదా చాలా వెచ్చని బట్టలు ధరించడం.. కానీ ఈ సమస్య నిరంతరం కొనసాగితే, ఇది కొన్ని తీవ్రమైన వ్యాధుల లక్షణం కావచ్చు. అవేంటో తెలుసుకోండి. (క్షయవ్యాధి): ప్రారంభ లక్షణాలు రాత్రిపూట చెమటలు పట్టడం. ఈ ఇన్ఫెక్షన్ ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. సమయానికి చికిత్స చేయకపోతే ప్రమాదకరంగా మారుతుంది.హాడ్జికిన్స్ లింఫోమా క్యాన్సర్: అనేది శోషరస కణుపులను ప్రభావితం చేసే ఒక రకమైన క్యాన్సర్. దీని లక్షణాలు రాత్రి చెమటలు, బరువు తగ్గడం, జ్వరం లాంటివి కనిపిస్తాయి. హైపర్ థైరాయిడిజం: థైరాయిడ్ గ్రంధి అతిగా పనిచేసినప్పుడు కూడా రాత్రిపూట చెమటలు పట్టవచ్చు. ఈ పరిస్థితి హృదయ స్పందన రేటును పెంచుతుంది. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సమస్యలను కలిగిస్తుంది. మెనోపాజ్ లేదా హార్మోన్ల మార్పులు: మహిళల్లో రుతువిరతి సమయంలో హార్మోన్ల మార్పులు చలిలో కూడా చెమటలు పట్టేలా చేస్తాయి. గుండె సంబంధిత సమస్యలు: రాత్రిపూట చెమటలు పట్టడం గుండెపోటు వంటి గుండె సమస్యలకు సంకేతం.. ఇలా తరచూ కొనసాగుతుంటే.. దీనిని నిర్లక్ష్యం చేయకూడదు.




## శీతాకాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచడానికి ఆల్కహాల్ సేవిస్తున్నారా?

శీతాకాలంలో చలి నుంచి తప్పించుకోవడానికి చాలా మంది ఆల్కహాల్ సేవిస్తుంటారు. ఇది తాగితే క్షణాల్లోనే శరీరం వెచ్చగా మారి హాయిగా ఉంటుంది. అయితే ఈ అలవాటు మునుముందు ఎలాంటి ప్రమాదాలు తెచ్చిపెడితుందో ఇక్కడ తెలుసుకోండి.. చలికాలం ప్రారంభమైంది. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. అంతేకాకుండా ఫ్లూతో సహా అనేక వ్యాధులు విజృంభిస్తున్నాయి. సీజనల్‌గా వచ్చే ఫ్లూతోపాటు అనేక వ్యాధులు ప్రబలుతుండడంతో ఆసుపత్రుల్లో రోగుల తాకిడి కూడా పెరుగుతోంది. కాబట్టి ఈ కాలంలో వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. చలి వాతావరణం అనేక అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి అదనపు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. కానీ కొందరు ఈ కాలంలో జలుబు, దగ్గు వంటి వాటి నుంచి రక్షించుకోవడానికి ఆల్కహాల్ తీసుకోవడం మొదలుపెడతారు. ఇది ఎంత ప్రమాదకరమో తెలిస్తే జన్మలో ముట్టుకోరని అంటున్నారు వైద్యులు. నిజానికి, ఈ కాలంలో మద్యం తాగడం వల్ల జలుబు నుంచి ఉపశమనం పొందవచ్చనే అపోహ చాలా మందిలో ఉంటుంది. కానీ శీతాకాలంలో మద్యం సేవించడం వల్ల వచ్చే సమస్యలు అన్నీ ఇన్నీకావు. సాధారణంగా సాయంత్రం వేళల్లో చలి మొదలవుతుంది. చలి నుంచి ఉపశమనం పొందడానికి చాలా మందికి మద్యం సేవించే అలవాటు ఉంటుంది. అందులోనూ చలి నుంచి తప్పించుకోవడానికి మరికాస్త ఎక్కువగా తాగుతారు. ఈ అలవాటు అనేక సమస్యలను ఆహ్వానిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది శ్వాసకోశ సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. తీవ్రమైన జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చర్మం నీలంగా మారడం, పెదవుల నుండి రక్తం, కఫం సమస్యలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని డాక్టర్ సూచిస్తున్నారు. ఉష్ణోగ్రత తగ్గినప్పుడు వెచ్చగా ఉండటానికి మద్యం తాగడం వల్ల ఈ సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ కాలంలో మద్యం సేవించడం వల్ల మొదట వెచ్చని అనుభూతిని కలిగిస్తుంది. కానీ క్రమంలో ఆల్కహాల్ మీ హృదయ స్పందన రేటు పెంచుతుంది. ఇది అరిథ్మియా ప్రమాదాన్ని పెంచుతుంది. విపరీతమైన చలిలో మద్యం సేవించడానికి బదులు మందపాటి బట్టలు ధరించడం, పోషకాహారం తీసుకోవడం, వీలైనంత వరకు వెచ్చని పానీయాలు తాగడం అలవాటు చేసుకోవాలి.



# సినిమా





## సూపర్ స్టైలిష్‌గా సోహైల్‌ఖాన్..

బింబిసార తర్వాత నందమూరి కల్యాణ్‌రామ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఎన్‌కేఆర్21. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్నాడు. మేకర్స్ ఇప్పటికే ఎన్‌కేఆర్21 అనౌన్స్ మెంట్ పోస్టర్ లాంచ్ చేశారని తెలిసిందే. ఇందులో పిడికిలి బిగించి ఉన్న కల్యాణ్ రామ్ చేతిపై రక్తపు మరకలు చూడొచ్చు. ఈ మూవీలో బాలీవుడ్ యాక్టర్ సోహైల్‌ఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. తాజాగా మేకర్స్ సోహైల్‌ఖాన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. లుక్ ఒకటి విడుదల చేశారు. ఈ చిత్రంతో సోహైల్ ఖాన్ టాలీవుడ్‌కు పరిచయమవుతున్నాడు. సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తుండగా.. ఇంతకీ ఎలాంటి పాత్రలో కనిపిస్తాడనేది సస్పెన్స్ నెలకొంది. ఈ మూవీలో సయీ మంజ్రేకర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. విజయశాంతి ఐపీఎస్ ఆఫీసర్‌గా నటిస్తుండగా.. శ్రీకాంత్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్ బ్యానర్‌లో అశోక్ వర్ధన్ ముప్ప, సునిల్ బలుసు, ఎన్టీఆర్ ఆర్ట్స్‌తో కలిసి సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.అశోక క్రియేషన్స్ బ్యానర్‌లో వస్తోన్న రెండో సినిమా ఇది. ఈ చిత్రంలో క్లైమాక్స్ ఎపిసోడ్ కోసం మేకర్స్ ఏకంగా రూ.8 కోట్లు ఖర్చు పెట్టారని ఇన్‌సైడ్ టాక్. బ్రహ్మ కడలి టీం వేసిన సెట్ డిజైన్‌లో ఫైట్ మాస్టర్ రామకృష్ణ నేతృత్వంలో కల్యాణ్ రామ్‌తోపాటు సుమారు 1000 మంది ఆర్టిస్టులపై వచ్చే ఈ క్లైమాక్స్ ఎపిసోడ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సాగనుందట.



## ప్రేయసి జ్ఞాపకాలను భార్యతో పంచుకుంటున్న వెంకటేశ్


'నాలైఫ్‌లోనున్న ఆ ప్రేమ పేజీ తీయనా.. పేజీలో రాసున్న అందాల ఆ పేరు మీనా.. ట్రైనర్‌గా నేనుంటే ట్రైనీగా వచ్చిందా కూనా.. వస్తునే వెలుగేదో నింపింది ఆ కళ్లలోనా.. చిత్రంగా ఆ రూపం.. చూపుల్లో చిక్కిందే.. మత్తిచ్చే ఓ ధూపం.. ఊపిరిలో జల్లిందే..' ఈ సాహిత్యం వింటే ప్రేమించిన అమ్మాయిని గుర్తు చేసుకుంటూ అబ్బాయి పాడే పాట అని ఎవరైనా ఇట్టే చెప్పేస్తారు. అయితే.. దర్శకుడు అనిల్ రావిపూడి ఇంకాస్త కొత్తగా ఆలోచించాడు. తన ప్రేయసి జ్ఞాపకాలను భార్యతో పంచుకుంటూ భర్త పాడే పాటగా దీన్ని చిత్రీకరించాడు. ఆ భర్త విక్టరీ వెంకటేశ్ కాగా.. భార్య ఐశ్వర్య రాజేష్. ఇక ప్రేయసి ఎవరో తెలిసిందేగా.. మీనాక్షి చౌదరి. రానున్న సంక్రాంతికి సందడి ఏ స్థాయిలో ఉండనుందో ఈ పాటతో చెప్పేశారు 'సంక్రాంతికి వస్తున్నాం' టీమ్. ప్రచారంలో భాగంగా ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు, తొలిపాటగా విడుదలైన 'గోదారి గట్టు'కు అద్భుతమైన స్పందన వస్తున్న నేపథ్యంలో గురువారం విడుదలైన ఈ రెండో పాట.. తొలిపాటను మించేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరచి, ప్రణవి ఆచార్యతో కలిసి ఆలపించారు. వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి.

## 2024 ఇయర్‌లోనూ అంతే

## బ్రేక్ కోసం వరుణ్‌తేజ్ వెయిటింగ్!



ముకుంద, కంచె సినిమాలతో టాలీవుడ్‌లో యాక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు వరుణ్ తేజ్ ఆ తర్వాత కెరీర్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసినా గద్దలకొండ గణేశ్, ఎఫ్ 2, ఎఫ్ 3 సినిమాలు తప్ప మిగిలిన సినిమాలు దాదాపు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను నిరాశపరిచాయి. 2019లో హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన గద్దలకొండ గణేశ్.. 2022లో ఎఫ్ 3 తర్వాత వరుణ్ తేజ్ ఖాతాలో చెప్పుకునేంత సక్సెస్ సాధించిన సినిమాలేమి లేవు. వరుణ్ తేజ్ 2023లో యాక్షన్ థ్రిల్లర్ గాండీవధారి అర్జున సినిమాతో పలుకరించగా బోల్తా కొట్టింది.దీంతో 2023 ఇయర్ వరున్‌తేజ్‌కు ఫ్లాప్‌తోనే ముగిసింది. 2024 కూడా ఇదే సీన్ రిపీటైంది. ఈ ఏడాది ఎయిర్‌ఫోర్స్ డ్రామా నేపథ్యంలో నటించిన ఆపరేషన్ వాలెంటైన్ ప్రేక్షకుల అంచనాలు అందుకోలేకపోయింది. ఆ తర్వాత కరుణకుమార్ దర్శకత్వంలో వచ్చిన గ్యాంబ్లింగ్ గ్యాంగ్ స్టర్ డ్రామా మట్కా ఊహించని స్థాయిలో డిజాస్టర్‌గా నిలిచి.. అటు మేకర్స్‌తోపాటు ఇటు అభిమానులు, మూవీ లవర్స్‌కు భారీ నిరాశనే మిగిల్చింది. ఈ లెక్కన 2024 ఇయర్ కూడా వరుణ్‌తేజ్ కెరీర్‌లో ఫ్లాప్ టాక్‌తోనే ముగిసిందని చెప్పాలి. సక్సెస్, ఫెయిల్యూర్‌తో సంబంధం లేకుండా.. ఓ వైపు ప్రయోగాత్మక సినిమాలు చేస్తూనే.. మరోవైపు ప్రేక్షకులకు వినోదాన్ని అందించాలనే ప్రయత్నంలో ఎప్పుడూ ముందుండే వరుణ్‌తేజ్‌కు 2025 ఇయర్ అయినా కలిసి రావాలని విష్ చేస్తున్నారు మూవీ లవర్స్.



## టార్గెట్ దంగల్, బాహుబలి అంటున్న అల్లు అర్జున్

భారీ అంచనాల మధ్య విడుదలై ఎప్పటిలాగే సౌత్‌తోపాటు నార్తిండియన్ ప్రేక్షకులను ఫిదా చేస్తున్నాడు పుష్పరాజ్. ఐకాన్ అల్లు అర్జున్ సీక్వెల్ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్ డిసెంబర్ 5న వరల్డ్‌వైడ్‌గా థియేటర్లలోకి వచ్చి రికార్డు వసూళ్లతో ట్రెండింగ్ టాపిక్‌గా నిలుస్తోంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలై న పుష్ప 2 ది రూల్ ఓపెనింగ్ డేనే జవాన్, ఆర్ఆర్ఆర్ రికార్డును బద్దలు కొట్టిందని తెలిసిందే. తాజా కలెక్షన్ల రిపోర్ట్‌తో పుష్పరాజ్ మేనియా ఎలా ఉందో అర్థమవుతోంది. పుష్పరాజ్ ఏ మాత్రం తగ్గేదేలే అంటున్నారు. 15 రోజుల్లోనే రూ.1508 కోట్లు వసూళ్లు రాబట్టి అత్యధిక వేగంగా ఈ మార్క్ చేరుకున్న చిత్రంగా అరుదైన ఫీట్ నమోదు చేసింది. ఇప్పటివరకు ఆల్ టైమ్ హయ్యెస్ట్ గ్రాస్ ఇండియన్ మూవీస్ అమీర్ ఖాన్ దంగల్ (రూ.2070. 30 కోట్లు), బాహుబలి.. ది కంక్లూజన్ (రూ.1786.06 కోట్లు) పేర్లతో ఉన్న రికార్డ్‌ను పుష్ప 2 ది రూల్ అధిగమించడం ఖాయమని తాజా కలెక్షన్లు చెప్పకనే చెబుతున్నాయి. పుష్ప 2 మరికొన్ని రోజుల్లోనే ఈ ఫీట్ చేరుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రం కన్నడ సోయగం రష్మిక మందన్నా మరోసారి శ్రీవల్లిగా ఇంప్రెస్ చేసింది. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రలు పోషించారు.



## అమరన్‌కు అవార్డుల పంట..

## ఉత్తమ నటుడిగా విజయ్ సేతుపతి

కోలీవుడ్ నుంచి తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ స్టార్‌డమ్ సంపాదించుకున్న వారిలో లీడింగ్‌లో ఉంటారు విజయ్ సేతుపతి సాయిపల్లవి. సినిమా సినిమాకు తమ పర్‌ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఫిదా చేయడం ఈ స్టార్ యాక్టర్ల స్పెషాలిటీ. తాజాగా ఇద్దరు ఉత్తమ నటులుగా అవార్డులు అందుకుని వార్తల్లో నిలిచారు. 22వ చెన్నై ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ డిసెంబర్ 19న ముగిసింది. ఈవెంట్‌లో వివిధ కేటిగిరీల్లో అవార్డులను ప్రదానం చేశారు. సాయిపల్లవి ఇటీవలే అమరన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా.. ఈ చిత్రానికి ఉత్తమ నటిగా అవార్డు అందుకుంది. ఈ మూవీ ఉత్తమ చిత్రం, ఉత్తమ సినిమాటోగ్రఫీ విభాగాల్లో అవార్డులు అందుకుంది. మరోవైపు విజయ్ సేతుపతి మహారాజ చిత్రానికి ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నాడు. వీరితోపాటు పలు సినిమాలకు వివిధ విభాగాల్లో అవార్డులు దక్కాయి.

**అవార్డ్ విజేతలు..**

**అమరన్ :**

ఉత్తమ నటి : సాయిపల్లవి
ఉత్తమ ఎడిటర్: ఫిలోమిన్ రాజ్
ఉత్తమ సంగీత దర్శకుడు: జీవీ ప్రకాశ్ కుమార్
ఉత్తమ సినిమాటోగ్రఫీ : సీహెచ్ సాయి

**మహారాజ :**

ఉత్తమ నటుడు: విజయ్ సేతుపతి
ఉత్తమ రచయిత: నిథిలన్ స్వామి నాథన్
ఉత్తమ సహాయ నటి: దుషారా విజయన్ (వెట్టైయాన్)
ఉత్తమ దర్శకుడు (స్పెషల్ జ్యూరీ అవార్డ్) : పా రంజిత్ (తంగలాన్)
ఫేవరేట్ యాక్టర్ అవార్డ్ : అరవింద్ స్వామి

# జేపీసీకి జమిలి బిల్లు

**న్యూఢిల్లీ:** ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించే అంశంపై రూపొందిన జమిలి బిల్లును పార్లమెంటరీ స్థాయి సంఘానికి పంపాలని ఇవాళ లోక్‌సభ తీర్మానం పాస్ చేసింది. సభను నిరవధికంగా వాయిదా వేయడానికి ముందు రెండు బిల్లులను జేపీసీకి పంపేందుకు తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే రెండు రోజుల క్రితం జమిలి ఎన్నికల బిల్లుకు లోక్‌సభలో ఆమోదం దక్కిన విషయం తెలిసిందే. అయితే పార్లమెంటరీ స్థాయి సంఘంలో ఉండే సభ్యుల వివరాలను పంపించాలని రాజ్యసభను మంత్రి కోరారు. సంయుక్త పార్లమెంటరీ స్థాయి సంఘం కమిటీలో మొత్తం 39 మంది ఎంపీలు ఉంటారు. దాంట్లో 27 మంది లోక్‌సభ, 12 మంది రాజ్యసభ సభ్యులు ఉండనున్నారు. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, పీపీ చౌదరీ, ప్రియాంకా గాంధీలు లోక్‌సభ నుంచి ఆ కమిటీలో ఉన్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులపై జేపీసీలో చర్చిస్తారు. ఓ బిల్లు కోసం మాత్రం రాజ్యాంగ సవరణ అవసరమని నిపుణులు చెబుతున్నారు.




### ఉభయసభలు నిరవధిక వాయిదా

పార్లమెంట్‌లో శీతాకాల సమావేశాలు శుక్రవారం ముగిశాయి. విపక్ష సభ్యుల ఆందోళనల నేపథ్యంలో ఉభయసభలను నిరవధికంగా వాయిదా వేశారు. అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై విపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేస్తుండగానే స్పీకర్ ఓం బిర్లా లోక్ సభ ను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమయంలో ప్రధాని మోదీ కూడా సభలో ఉన్నారు.

వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీలో 12 మంది రాజ్యసభ సభ్యులకు చోటు కల్పించాలని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ప్రవేశపెట్టిన తీర్మానానికి రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆ తర్వాత అమిత్ షా వ్యాఖ్యలపై సభలో విపక్ష ఎంపీలు నిరసనకు దిగడంతో రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేశారు. దాంతో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిసినట్లయ్యింది. ఇవాళ ఉదయం ఉభయసభల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద .. ఇండియా కూటమి ఎంపీలు నిరసన చేపట్టారు. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వారు తప్పుపట్టారు. షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించిన షా రాజీనామా చేయాలన్నారు.


## మానవ తప్పిదం వల్లే కూలిన చాపర్..





**న్యూఢిల్లీ:** త్రివిధ దళాధిపతి జనరల్ బిపిన్ రావత్ ప్రయాణిస్తున్న ఎంఐ 17 వీ5 హెలికాప్టర్ 2021 డిసెంబర్ 8వ తేదీన ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఆ ఘటనలో మొత్తం 12 మంది మరణించారు. బిపిన్ రావత్ భార్య మధులిక రావత్ కూడా ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. తమిళనాడులోని కూనూరులో ఆ ఘటన జరిగింది. ఆ ప్రమాదం పట్ల రక్షణశాఖ స్థాయి సంఘం కమిటీ నివేదికను తయారు చేసింది. ఆ నివేదికను గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మానవ తప్పిదం వల్ల ఎంఐ-17 హెలికాప్టర్ కూలినట్లు రిపోర్టులో వెల్లడించారు. 2017 నుంచి 2022 వరకు భారతీయ వైమానిక దళానికి చెందిన 34 ప్రమాదాలు జరిగినట్లు స్టాండింగ్ కమిటీ రిపోర్టులో పేర్కొన్నారు. ఇక 2021-2022లో జరిగిన 9 ప్రమాదాల్లో.. డిసెంబర్ 8వ తేదీన మానవ ప్రమాదం వల్ల ప్రమాదం జరిగినట్లు తెలిపారు.

## మందిర్-మసీదు వివాదాలు పెరగడం ఆందోళనకరం




**న్యూఢిల్లీ:** దేశంలో ఇటీవల కాలంలో మందిర్-మసీద్ వివాదాలు పెరుగుతుండటంపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం తర్వాత ఇదే తరహా వివాదాలు రేకెత్తించడం ద్వారా తాముకూడా హిందూ నాయకులు కావచ్చనే అభిప్రాయంతో కొందరు ఉన్నారని, ఇది తమకు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. "ఇండియా-ది విశ్వగురు" అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో భాగవత్ మాట్లాడుతూ, మన దేశం సామరస్యంగా ఉంటుందని ప్రపంచానికి చాటాల్సిన అవసరం ఉందన్నారు. "చిరకాలంగా మనం సామరస్యంతో జీవిస్తున్నాం. ప్రపంచానికి సామరస్య సందేశాన్ని అందించాలంటే అందుకు మనం ఆదర్శంగా నిలవాలి. అయోధ్యలో రామమందిర నిర్మాణం తర్వాత కొందరు నేతలు కొత్త కొత్త ప్రాంతాల్లో ఇదే తరహా అంశాలను లేవనెత్తడం ద్వారా తాము హిందూ నాయకులు అయిపోతామని అనుకొంటున్నారు. ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ప్రతిరోజూ ఒక కొత్త అంశం (వివాదం) లేవనెత్తుతున్నారు. ఇది ఎలా సాగనిస్తాం? ఇదెంత మాత్రం కొనసాగడానికి వీల్లేదు. మేము కలిసికట్టుగా బతుకుతున్నామనే సందేశాన్ని భారత్ చాటుకోవాల్సిన అవసరం ఉంది" అని మోహన్ భాగవత్ అన్నారు.

### రాజ్యాంగం ప్రకారమే..

రాజ్యాంగం ప్రకారమే భారతదేశం నడుస్తోందని, ఈ పద్ధతిలోనే తమ ప్రతినిధులను ప్రజలు ఎన్నుకుంటారని, ఎన్నికైన వారు ప్రభుత్వాన్ని నడుపుతారని భాగవత్ అన్నారు. ఎవరో ఒకరు ఆధిపత్యం చెలాయించే రోజులు పోయాయన్నారు. అందరూ తమను తాము భారతీయులుగా గుర్తించినప్పుడు భాషాధిపత్యం ఎందుకని ఆయన ప్రశ్నించారు. "ఎవరు మైనారిటీ, ఎవరు మెజారిటీ? ఇక్కడ అంతా సమానమే. దేశ ప్రజలు తమకు ఇష్టమైన ఆరాధనా పద్ధతులను అనసరించడమే ఈ దేశ సాంప్రదాయం. అయితే సామరస్యంతో చట్టాలకు లోబడి వ్యవవహరించడం అవసరం" అని భాగవత్ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో వివిధ ప్రాంతాల్లో తమ ఆలయాలపైనే మసీదులు కట్టారని, మసీదుల సర్వే జరపాలని పలు డిమాండ్లు వెలుగు చూస్తున్న నేపథ్యంలో భాగవత్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మసీదులు ఉన్న ప్రాంతాల్లో ఆలయాల ఆనవాళ్లు ఉన్నాయంటూ పలు పిటిషన్లు కోర్టులకు వస్తుండటం, కోర్టులు సైతం సర్వేలకు ఉత్తర్వులు ఇస్తున్న విషయాన్ని సుప్రీంకోర్టు ఇటీవల పరిగణలోకి తీసుకుంది. మతపరమైన నిర్మాణాలు, స్వభావానికి సంబంధించి కొత్త వ్యాజ్యాలు తీసుకోవద్దని దిగువ కోర్టులను ఆదేశించింది.

# అలలపై ఇంజనీరింగ్ అద్భుతం

భారతీయ రైల్వే అతి త్వరలో సరికొత్త రికార్డును నమోదు చేయబోతోంది. తమిళనాడులోని రామేశ్వరంలో 2,070 మీ (6,790 అడుగులు) పొడవు గల నిలువు లిఫ్ట్ సీ బ్రిడ్జి పాంబన్ వంతెన నిర్మాణం చివరి దశలో ఉంది. ప్రస్తుతం ఉన్న పాంబన్ వంతెనకు సమాంతరంగా నిర్మించిన ఈ బ్రిడ్జి భారతదేశపు మొదటి సముద్ర వంతెన కాబోతుంది. ఇది సముద్రం మీదుగా 100 స్పాన్‌లను కలిగి ఉంది. అందులో 99 స్పాన్‌లు 18-3 మీటర్లు, ఒక స్పాన్ 72-5 మీటర్లు ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు రూ.550 కోట్లు ఖర్చవుతుందని అంచనా. బంగాళాఖాతంలో నావిగేషన్ ఛానల్‌లో లిఫ్ట్ స్పాన్ గిర్డర్‌ను ఏర్పాటు చేసే పని పూర్తయింది. ఆగస్టు 31 నాటికి ప్రాజెక్ట్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పనిని బలోపేతం చేసిన తర్వాత, వంద సంవత్సరాల పురాతనమైన పాంబన్ రైల్వే వంతెనపై లైట్ ఇంజిన్‌ను పరీక్షించారు. బ్రిడ్జిని పటిష్ట పరిచే పనినిలో భాగంగా రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. భద్రతా కారణాల దృష్ట్యా డిసెంబర్ 23, 2022న ట్రాఫిక్‌కు తాత్కాలికంగా నిలిపివేయడం జరిగింది. ఇక నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతో దక్షిణ రైల్వే కొత్త పాంబన్ వంతెనపై 12 జూలై 2024న 428 మీటర్లలో 200 మీ దూరం లైట్ ఇంజిన్ ట్రయల్ రన్ నిర్వహించింది. ఇది వంతెన నిర్మాణ సమగ్రత మరియు విశ్వసనీయతను నిర్ధారించింది. ఇక మండపం చివర నుండి 1-50 కి.మీ వరకు ట్రాక్ అనుసంధానించి, గూడ్స్ రైళ్ల ట్రయల్ మూమెంట్ పూర్తయింది. మిగిలిన 0-60 కి.మీ అప్రోచ్ స్పాన్ ప్రారంభంతో ట్రాక్ పూర్తి అయ్యింది.



ఇది తమిళనాడు రాష్ట్రంలోని న్యూ పంబన్ బ్రిడ్జ్. బ్రిడ్జ్ అంటే మామూలు బ్రిడ్జ్ కాదు.. దేశంలోనే ఫస్ట్ వర్టికల్ లిఫ్ట్ రైల్వే సీ బ్రిడ్జ్. 105 ఏళ్లనాటి వారధి స్థానంలో దీన్ని నిర్మించారు. పాత పంబన్ బ్రిడ్జ్ తుప్పుపట్టిన కారణంగా దాని సేవలు నిలిచిపోవడంతో.. దాని సమీపంలోనే ఈ న్యూ పంబన్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టారు. లేటెస్ట్ టెక్నాలజీతో ఈ వంతెనను నిర్మించారు. వావ్ అనిపించే ఈ దృశ్యాలను కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. అలలపై ఇంజనీరింగ్ అదరహో అంటూ కొనియాడారు. పాత, కొత్త పంబన్ వంతెనల మధ్య తేడాలను వివరించారు. టెక్నాలజీలోనే కాదు స్పీడ్‌లోనూ అదరగొడుతుందంటూ కొనియాడారు. త్వరలోనే ఈ నయా బ్రిడ్జ్ అందుబాటులోకి వస్తుందన్నారు. రామనాథపురం జిల్లాలో మండపం, రామేశ్వరం ద్వీపం మధ్య ఫిబ్రవరి 24, 1914లో పంబన్ వంతెనను సముద్రంలో నిర్మించారు. అప్పట్లో దాని నిర్మాణం 20 లక్షలతో పూర్తైంది. 2.6 కి.మీ పొడవైన వంతెనను 2006లో మీటర్ గేజ్ నుంచి బ్రాడ్ గేజ్‌కు మార్చారు. ఈ బ్రిడ్జి మధ్య నుంచి పడవలు, షిప్స్ వెళ్లాలంటే.. 16 మంది కార్మికులు పనిచేస్తేనే వంతెన తెరుచుకుంటుంది. ఇప్పుడు అలా కాకుండా ఏకంగా ట్రాక్ ఉన్న వంతెనను పూర్తిగా పైకి లిఫ్ట్ చేసేలా అధునాతన సాంకేతికతను జోడించారు. 2019 మార్చిలో ఈ కొత్త పంబన్ బ్రిడ్జికి ప్రధాని నరేంద్ర మోదీ పునాదిరాయి వేశారు. సముద్రంలో ఓడలు వంతెన దగ్గరకు వస్తే ఆటోమేటిక్‌గా బ్రిడ్జి పైకి లేస్తుంది. ఇలా సముద్రంపై నిర్మితమైన తొలి వర్టికల్ రైల్వే బ్రిడ్జి ఇదే కావడం విశేషం.

## రెండు రాష్ట్రాల మధ్య ముదిరిన వివాదం..

## రచ్చకు కారణం ఏంటంటే..?

దక్షణాదిన మరో రెండు రాష్ట్రాల మధ్య వివాదం ముదురుతోంది. ఇప్పటిదాకా తమిళనాడు %-% కర్ణాటక మధ్య కావేరి జలాల విషయంలో పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్న పరిస్థితి నెలకొని ఉన్న విషయం తెలిసిందే..! తాజాగా తమిళనాడు %-% కేరళ మధ్య మరో వివాదం రాజుకుంది. కొద్ది నెలలుగా రెండు రాష్ట్రాల మధ్య మొదలైన సమస్య, ఇప్పుడు కేంద్రం దాకా వెళ్ళింది. ఇంతకీ కేరళ %-% తమిళనాడు మధ్య మొదలైన ఆ రచ్చకు కారణం ఏంటో తెలుసుకుందాం..! ప్రపంచవ్యాప్తంగా ప్రమాదకరంగా మారుతున్న విషయం ఏంటంటే మెడికల్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయడం. ఆసుపత్రిలో చికిత్స అనంతరం మిగిలిపోయిన మందులు, సర్జరీ తర్వాత తొలగించిన మానవ అవయవాలు.. ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలు వాటిని డిస్పోస్ చేసేందుకు పలు ఏజెన్సీలకు కాంట్రాక్టులు ఇస్తుంటాయి. అయితే ఆ ఏజెన్సీలు మెడికల్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వదిలేసి చేతులు దులిపేసుకుంటూ కాసులు దండుకుంటున్నాయి. అలాగే మరికొన్ని ఆస్పత్రులు నేరుగానే ఇలాంటి వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తుంటాయి. ఇప్పుడు ఇదే అంశమై రెండు రాష్ట్రాల మధ్య వివాదం మొదలై రచ్చకు దారితీసింది. కేరళ నుంచి మెడికల్ వేర్ధాలు తమిళనాడులోని పలుచోట్ల వదిలేసి వెళ్లిపోవడం చాలా రోజులుగా జరుగుతుంది. కేరళలోని తిరువనంతపురం రీజినల్ క్యాన్సర్ సెంటర్ కు చెందిన ప్రమాదకరమైన వైద్య వ్యర్థాలను తిరునల్వేలి జిల్లాలోని కొడెక్క నల్లూరు నడుక్క నల్లూరు, పాలవూరు కొండనగరం ప్రాంతాల్లో పడేసి వెళు తున్నట్లు స్థానికులు గుర్తించారు. పలుమార్లు అడ్డు చెప్పినా, ఏం పట్టనట్లు యథావిధిగా వ్యర్థాలను వదిలి వెళ్తున్నారు. ఈ విషయంపై స్థానికుల్లో చాలా రోజులుగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సరిహద్దులో ఉన్న ఈ ప్రాంతాల్లో నిత్యం ఇదే విధంగా ఆసుపత్రి నుంచి వ్యర్థాలు పడేసి వెళ్లడంపై అనారోగ్యానికి కారణమవుతుందని స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా ఆందోళనలు చేపట్టాయి. చాలా రోజులుగా జరుగుతున్న ఈ విషయంపై తమిళనాడు ప్రభుత్వం కూడా స్పందించి, కేరళ ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో ప్రస్తావించింది. అయినా మెడికల్ వ్యర్థాలను పడేయడం అనేది జరుగుతూనే ఉంది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి కేసులు నమోదు చేసి విచారణ మొదలుపెట్టారు. మరోవైపు గ్రీన్ ట్రిబ్యునల్ బోర్డు కూడా ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుని మూడు రోజుల్లో వ్యర్థాలను తొలగించాలని కేరళ రాష్ట్ర కాలుష్య నియంత్ర మండలిని ఆదేశించింది. డిసెంబర్ 23 లోగా ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని ట్రిబ్యునల్ ఆదేశించింది. ప్రమాదకరమైన వైద్య వ్యర్థాలను ఇలా పడేసి వెళ్లడంపై చెరువు అనంతపురం క్యాన్సర్ ఇన్స్‌స్టిట్యూట్‌పై చర్యలు తీసుకోవాలని కేరళ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కు తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే ఫిర్యాదు చేసింది.

## మురికివాడలో భారీ అగ్ని ప్రమాదం..



మురికివాడలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ గుడిసెలో చెలరేగిన మంటలు క్రమంగా వాడ అంతటా వ్యాపించాయి. దాంతో ఆ మురికివాడ నివాసితులు ఇళు వదిలి ప్రాణభయంతో బయటికి పరుగులు తీశారు. అందరూ చూస్తుండగానే వాడ పూర్తిగా అగ్నికీలల్లో చిక్కుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, స్థానిక అధికారులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మంటలు తీవ్ర స్థాయిలో ఉండటంతో ఏకంగా 15 ఫైరింజన్‌లను తెప్పించి మంటలను ఆర్పే పనిలో ఉన్నారు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని తోప్సియా ఏరియాలోగల మురికివాడలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మురికివాడ పూర్తిగా అగ్నికి ఆహుతైంది. గుడిసెలన్నీ కాలిపోయి బూడిదగా మారాయి. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# మాజీ ముఖ్యమంత్రి కన్నుమూత



**న్యూఢిల్లీ:** ఇండియన్ నేషనల్ లోక్ దళ్ సీనియర్ నేత, హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాష్ చౌతాలా శుక్రవారంనాడు కన్నుమూశారు. ఆయన వయస్సు 89 సంవత్సరాలు. గురుగావ్ నివాసంలో గుండెపోటు రావడంతో ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ తుదశ్వాస విడిచినట్టు వైద్యులు ప్రకటించారు. హర్యానా రాజకీయాల్లో దిగ్గజనేతగా పేరున్న చౌతాలా 1989 నుంచి నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. చివరిసారిగా 1999 నుంచి 2005 వరకూ సీఎంగా పనిచేశారు. ఎమ్మెల్యేగా హర్యానాకు చిరకాల సేవలందించిన నేతగా కూడా నిలిచారు. 1935 జనవరిలో ఓం ప్రకాష్ చౌతాలా జన్మించారు. హర్యానాకు రెండుసార్లు ముఖ్యమంత్రిగా, దేశ ఆరవ ఉప ప్రధానమంత్రిగా పనిచేసిన చౌదరి దేవీలాల్ తనయుడే ఓం ప్రకాష్ చౌతాలా. తన తండ్రి అడుగుజాడల్లోనే ఓం ప్రకాష్ చౌతాలా సైతం ప్రముఖ నేతగా రాజకీయాల్లో ఎదిగారు. చౌతాలా తన హయాంలో రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా దేశ రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించారు. 1987లో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై 1990 వరకూ సేవలందించారు. నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ (%చీణూ%) అసోసియేషన్‌తో తన రాజకీయ సత్తాను చాటుకున్నారు. కాగా, వివాదాలు, లీగల్ చిక్కులు కూడా ఆయన చవిచూశారు. 1999-2000లో హర్యానాలో జూనియర్ ప్రైవేట్ టీచర్ల నియామకాలకు సంబంధించి చిక్కుల్లో పడ్డారు. టీచర్స్ రిక్రూట్‌మెట్ స్కామ్‌లో పదేళ్లు జైలుశిక్ష పడింది. 2021 జూలైలో తొమ్మిదన్నరేళ్ల శిక్ష అనంతరం 2021 జూలైలో తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. చౌతాలా న్యాయపరమైన వివాదాలు చవిచూన్నప్పటికీ హర్యానా రాజకీయాల్లో ఆయన చూపిన నాయకత్వ పటిమి ప్రత్యేకత సంతరించుకుంది.

ప్రముఖుల సంతాపం

హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాష్ చౌతాలా మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. చౌతాలా రాష్ట్ర రాజకీయాల్లో ఎన్నో ఏళ్లు చురుకుగా పనిచేశారని, చౌదరి దేవీలాల్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు నిరంతరం కృషి చేశారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమ సంతాప సందేశంలో గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చౌతాలా ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, హర్యానా మాజీ సీఎం, కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హుడా తదితరులు కూడా సంతాపం తెలిపారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.